అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శుక్రవారం 09-6-2023 | సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 159 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు | వెల : 6.50

అగ్ని ప్రైమ్ బాలిస్టిక్ మిస్సైల్ పరీక్ష సక్సెస్

ఒడిశా తీరంలో డీఆర్‌డీఓ ప్రయోగం



భువనేశ్వర్ : కొత్త జనరేషన్‌కు చెందిన అగ్ని ప్రైమ్ బాలిస్టిక్ మిస్సైల్‌ను విజయవంతంగా పరీక్షించారు. డీఆర్డీవో ఈ పరీక్ష చేపట్టింది. ఒడిశా తీరంలో ఉన్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం దీవి నుంచి దీన్ని పరీక్షించారు. బుధవారం రాత్రి పూట ఈ పరీక్షను నిర్వహించారు. ఫ్లయిట్ టెస్ట్ సమయంలో ఆ క్షిపణి అన్ని లక్ష్యాలను సక్సెస్‌ఫుల్‌గా చేరుకున్నట్టు డీఆర్డీవో అధికారులు తెలిపారు.మూడుసార్లు విజయవంతంగా ట్రయల్స్ నిర్వహించిన తర్వాతే ప్రీ ఇండక్షన్ నైట్ లాంచ్‌ను చేపట్టారు. బాలిస్టిక్ క్షిపణికి చెందిన కచ్చితత్వాన్ని, విశ్వసనీయతను టెస్ట్ ...5లో



రైలు ప్రమాదాలను నివారించలేమా..?

భద్రతా లోపాలను ఏవిధంగా అధిగమించవచ్చు

చైనా, జపాన్, ఈయూలో అత్యాధునిక వ్యవస్థల వినియోగం

శతాబ్దాల కింద నిర్మించిన వంతెనలు..పట్టాలపై ప్యాసింజరు రైళ్లు నడపాల్సిన చోట వందేభారత్ లాంటి రైళ్లను నడపటం ఎంతవరకు సమంజసమనే ప్రశ్న ఉదయిస్తోంది. మోడీ సర్కార్ అధికారంలికి వచ్చినప్పటినుంచి జనం ముక్కుపిండి పలురూపాల్లో నిధులను ఖజానాలో వెనకేసుకుంటోంది. రైలు ప్రమాదాల్లో భారీగా ప్రాణనష్టం జరుగుతున్నా..కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంలో ఎందుకని చలనం కనిపించటంలేదు. నామ్ కే వాస్తే అన్నట్టుగా అప్పటి కప్పుడు ప్రమాదాలు జరిగినచోట మరమ్మతులతో సరిపెట్టి..పరిహారాలు ప్రకటించి చేతులు దులుపు కుంటే సరిపోతుందా..?. నెత్తురు చిమ్ముతున్న మన పట్టాలపైకి బుల్లెట్ రైళ్లు నడిపితే..ఇంకెంత ప్రాణనష్టం జరుగుతుందో తలుచుకుంటేనే ఒళ్లు జలధరిస్తోంది. ఈ విషయంలో ఒక్కసారైనా మోడీ సర్కార్ ఆలోచిస్తున్నదా..? వాస్తవానికి మన కన్నా వేగంగా దూసుకెళ్లే రైళ్లతో..ప్రయాణికుల భద్రత గురించి ప్రత్యేక దృష్టి పెడుతున్న చైనా, జపాన్ లాంటి దేశాలతో ఎందుకు పోటీపడలేకపోతున్నాం.



చైనాలో...

ప్రపంచంలో అత్యంత వేగంగా నడిచే రైళ్ల ప్రయాణాలకు అనువుగా ఉండే లైన్లు చైనాలోనే ఎక్కువగా ఉన్నాయి. ఇలాంటి లైన్లు ఆ దేశంలో 86 ఉన్నాయి. వీటి పొడవు 22 వేల కిలోమీటర్లు. అక్కడ అత్యంత వేగవంతమైన 2,846 సెట్ల ఎలక్ట్రానిక్ మల్టీపుల్ యూనిట్లు (ఈఎంయూలు) పని చేస్తున్నాయి. రైలు పట్టాలు తప్పకుండా నివారించే అత్యాధునిక వ్యవస్థలు చైనాలో అందుబాటులో ఉన్నాయి. మౌలిక సదుపాయాలను ఎప్పటికప్పుడు పరిరక్షించుకుంటూ ఉంటారు. ఇందుకోసం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగిస్తున్నారు.

సాంకేతిక వైఫల్యం మాటే లేదు

న్యూఢిల్లీ : ఘోర రైలు ప్రమాదం జరిగిన ఒడిశాలోని బాలాసోర్‌లో ఇప్పుడిప్పుడే సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి. చెల్లాచెదురుగా పడిపోయిన బోగీలు, మృతదేహాలతో భీతావహ దృశ్యాలు కన్పించిన ప్రదేశంలో ఇప్పుడు పట్టాలపై మళ్లీ రైళ్లన్నీ మామూలుగానే నడుస్తున్నాయి. కానీ భారతీయ రైల్వేలో భద్రతా వ్యవస్థపై మాత్రం పలు ప్రశ్నలు, మరిన్ని అనుమానాలు రేకెత్తుతున్నాయి. ముఖ్యంగా రైల్వేలో భద్రతా లోపాలను ఎత్తి చూపుతూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి ఘటనలు జరగకుండా భారతీయ రైల్వేలు ఉపయోగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం ఏమిటన్న ప్రశ్న తలెత్తుతోంది. ఇలాంటి ఘటనల్ని నివారించలేమా? గంటకు 600 కిలోమీటర్ల వేగంతో పరుగులు తీసే రైళ్ల ...2లో



జపాన్‌లో...

జపాన్‌లో ఉపయోగిస్తున్న షింకాన్‌సేన్ టెక్నాలజీ గత 55 సంవత్సరాలుగా అక్కడి రైల్వే భద్రతకు ఎంతగానో ఉపయోగపడుతోంది. ఈ వ్యవస్థ విశేషమేమంటే సాంకేతిక వైఫల్యం కారణంగా రైలు ప్రమాదం జరిగే అవకాశమే లేదు. మానవ తప్పిదం కారణంగానే జపాన్‌లో రైలు ప్రమాదాలు జరుగుతున్నాయి తప్పించి సాంకేతిక వైఫల్యం కారణంగా కాదని అక్కడ జరుగుతున్న దుర్ఘటనలను పరిశీలిస్తే ...2లో

పాలమూర్ అంటే మైగ్రేషన్..

ఇప్పుడు ఇరిగేషన్

తెలంగాణలో సమీకృత అభివృద్ధి

- మంచి పనులే మానవత్వాన్ని చాటుతాయి
- మేధస్సును ఎప్పటికప్పుడూ అభివృద్ధి చేసుకోవాలి : మంత్రి కేటీఆర్



నవ తెలంగాణ- మహబూబ్‌నగర్

"రాష్ట్రంలో సమీకృత అభివృద్ధి జరుగుతోంది.. మంచి పనులే మానవత్వం.. చేసిన పనులే మనిషిని చరిత్రలో నిలబెడతాయి.. మనిషి ఎప్పటికప్పుడూ తన మేధస్సును అభివృద్ధి చేసుకోవాలి.. లేదంటే వెనుకబడి పోతామమని" ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి తారక రామారావు అన్నారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటించారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఒకప్పుడు మహబూబ్‌నగర్ అంటే మైగ్రేషన్ అని.. ఇప్పుడు ఇరిగేషన్‌గా మారిందని చెప్పారు. మెట్టుగడ్డలోని బాలికల ఐటీఐ కళాశాలలో సెయింట్ ఫౌండేషన్స్, శాంతా నారాయణగౌడ్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణానికి కేటీఆర్ భూమిపూజ చేశారు. శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి సర్టిఫికెట్లు అందజేశారు. అలాగే, వేములలో ఎస్‌జీడీ ఫార్మా కార్నింగ్ టెక్నాలజీ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జడ్చర్లలో డబుల్ బెడ్రూం ఇండ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు చోట్ల ఏర్పాటు చేసిన సభల్లో మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ..డబ్బులు చాలా మందికి ఉండొచ్చు కానీ.. మంచి చేయాలనే ఆలోచన రావడం గొప్ప విషయమన్నారు. మోహన్‌రెడ్డి ఇక్కడ స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు ...5లో

ఆహార భద్రత సూచీలో కేరళ టాప్

రెండో స్థానంలో పంజాబ్

- పడిపోయిన గుజరాత్



న్యూఢిల్లీ : ఆహార భద్రత సూచీ 2022-23లో కేరళ చక్కని ప్రదర్శనను కనబర్చింది. దేశంలోని మిగతా రాష్ట్రాల కంటే అగ్రస్థానంలో నిలిచింది. పంజాబ్ రెండో స్థానంలో ఉన్నది. కేంద్ర ఆరోగ్య మంత్రి మన్సుఖ్ మాండవియా బుధవారం విడుదల చేసిన ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ఐదో ఆహార భద్రత సూచిక (ఎస్ఎఫ్ఎస్ఐ)లో ఆయా రాష్ట్రాల ర్యాంకులు వెలువడ్డాయి.

ఆహార భద్రత సూచిక సమాచారం ప్రకారం.. దేశంలోని 20 పెద్ద రాష్ట్రాల్లో తమిళనాడు అగ్రస్థానంలో ఉన్నది. గుజరాత్, మహారాష్ట్రలు తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ఈ విషయంలో 2020-21లో గుజరాత్ అగ్రస్థానంలో ఉండగా ఈ సారి దాని ర్యాంకు పడిపోవటం గమనార్హం. ఇక చిన్న రాష్ట్రాల విషయానికి వస్తే గోవా ...5లో



జాలరిగా మంత్రి ఎర్రబెల్లి..

- మత్స్యకారులతో చేపలు పట్టి అబ్బురపర్చిన వైనం

వివరాలు 5లో..

క్రెడిట్‌లతోనే డిగ్రీలు

ఎంఫిల్‌ను నిలిపివేయాలి

- పరిశోధనతో నాలుగేండ్ల యూజీ డిగ్రీల ఆనర్స్
- సైన్స్‌యేతర సబ్జెక్టుల్లో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్
- యూజీసీ నిపుణుల కమిటీ సిఫారసులు

నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో


కోర్సు కనీస వ్యవధితో సంబంధం లేకుండా, అవసరమైన అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్ (ఏబీసీ)లతో డిగ్రీలు ప్రదానం చేయాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నిపుణుల కమిటీ సిఫారసు చేసింది. అవసరమైన ఏబీసీలతో విద్యార్థి సర్టిఫికేట్, డిప్లొమా, డిగ్రీ వంటి అర్హతల అవార్డు కోసం పరిగణించబడవచ్చని పేర్కొంది. ఉన్నత విద్యా సంస్థలు ప్రదానం చేసే డిగ్రీలకు కొత్త నామకరణంపై ఐదుగురు సభ్యుల నిపుణుల కమిటీ సిఫార్సులను గురువారం యూజీసీ విడుదల చేసింది. ప్రోగ్రామ్‌లో పరిశోధనా భాగాలు పొందుపరచబడి ఉంటే, 'ఆనర్స్ విత్ రీసెర్చ్' అనే నామకరణంతో యుజి డిగ్రీలను ప్రదానం చేయడం సిఫారసులలో ఉన్నాయి. ఆర్ట్స్, హ్యుమానిటీస్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, మేనేజ్‌మెంట్, కామర్స్ మొదలైన సైన్స్-యేతర సబ్జెక్టుల్లో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ లేదా బిఎస్ డిగ్రీలను అందజేయాలి. దీని ప్రకారం, అండర్ గ్రాడ్యుయేట్ (యూజీ) స్థాయిలో స్పెషలైజేషన్ లేదా ప్రధాన సబ్జెక్ట్ విషయంలో విద్యార్థులకు అందించే డిగ్రీ సర్టిఫికేట్‌లోని ప్రోగ్రామ్ నామకరణాన్ని "బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్, బ్యాచిలర్ ఆఫ్ కామర్స్, బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ ఇన్ స్పెషలైజేషన్" అని కూడా రాయొచ్చని కమిటీ తెలిపింది.

విశ్వవిద్యాలయాలు ఒకటి, రెండు సంవత్సరాల పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లకు, కళలు, మేనేజ్‌మెంట్, కామర్స్, మానవీయ శాస్త్రాలు వంటి విభాగాలకు కూడా 'మాస్టర్ ఆఫ్ సైన్స్ (ఎంఎస్)' నామకరణాన్ని అనుసరించవచ్చని సూచిస్తున్నాయి. దీనితో పాటు ఎంఫిల్ ...5లో

రూ.1,000 నోట్లను ప్రవేశపెట్టం

రద్దుచేశాక.. రూ.2వేల నోట్లు సగమే రిటర్న్

- వృద్ధి రేటు 6.5 శాతానికి తగ్గొచ్చు
- వడ్డీరేట్లు యథాతథం :ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ వెల్లడి



ముంబయి : రూ.1,000 నోట్లను మళ్లీ ప్రవేశపెట్టే యోచన లేదని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. అదే విధంగా రూ.500 నోట్లను ఉపసంహరించుకునే యోచన లేదని స్పష్టం చేశారు. శక్తికాంత దాస్ అధ్యక్షతన మూడు రోజుల పాటు జరిగిన ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన సమీక్షా గురువారంతో ముగిసింది. మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) భేటీ వివరాలను శక్తికాంత మీడియాకు వెల్లడించారు. రూ.500 నోట్లను కూడా ...5లో

కేరళను తాకేశాయ్

నేడు ఆ రాష్ట్రమంతటా నైరుతి రుతుపవనాల వ్యాప్తి

- రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు
- పలు జిల్లాలకు వడగాల్పుల హెచ్చరిక



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నైరుతి రుతుపవనాలు కేరళ రాష్ట్రాన్ని తాకేశాయి. వచ్చే 48 గంటల్లో ఆ రాష్ట్రమంతటా అవి వ్యాప్తి చెందనున్నాయి. తమిళనాడు, కర్నాటకలోని కొన్ని భాగాలకూ విస్తరించనున్నాయి. ఉత్తర ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణ మీదుగా ఉత్తర ఇంటీరియల్ కర్నాటక వరకు వ్యాపించి ఉన్న ద్రోణి బలహీనపడింది. రాబోయే మూడు రోజుల పాటు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. కొన్ని ప్రాంతాల్లో గంటకు 30 కిలోమీటర్ల నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే అవకాశం ఉందని సూచించింది. తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ...5లో

సోమవారం గుండె గుబులు!

అత్యధిక గుండెపోటు రేటు ఆ రోజే : తాజా పరిశోధనలో వెల్లడి

న్యూఢిల్లీ : ప్రపంచవ్యాప్తంగా మారుతున్న జీవన పరిస్థితులతో గుండెపోటు ప్రమాదాలు తీవ్రమవుతున్నాయి. వయస్సుతో నిమిత్తం లేకుండా ఈ ప్రమాదాలు చోటు చేసుకుంటున్న సందర్భాలూ ఉంటున్నాయి. అయితే స్టెమీ గుండెపోటుకు సంబంధించి ఒక ఆసక్తికర విషయం తాజా పరిశోధనలో బయటకు వచ్చింది. స్టెమీ గుండెపోటుల అధిక రేటు వారం ప్రారంభంలో ఉంటుందని వెల్లడైంది. అందులోనూ సోమవారం అత్యధిక రేటును కలిగి ఉండటం గమనార్హం. మాంచెస్టర్‌లోని బ్రిటీష్ కార్డియోవాస్కులర్ సొసైటీ (బీసీఎస్) కాన్ఫరెన్సులో సమర్పించబడిన పరిశోధన దీనిని వెల్లడించింది. ఎస్‌టీ-సెగ్మెంట్ ఎలివేషన్ మయోకార్డియల్ ఇన్ఫార్క్షన్ (స్టెమీ) అనేది ఒక తీవ్రమైన గుండెపోటు. దీనిలో కరోనరి ఆర్టరీ పూర్తిగా నిరోధించబడుతుంది.

10 వేల మంది రోగుల డేటా పరిశీలన

బెల్ఫాస్ట్ హెల్త్ అండ్ సోషల్ కేర్ ట్రస్ట్, ఐర్లాండ్‌లోని రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్ నిర్వహించిన పరిశోధనలో " పని వారం ప్రారంభం, స్టెమీ సంభవం మధ్య బలమైన గణాంక సహసంబంధం ఉన్నది" అని డాక్టర్ జాక్ లాఫాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విధంగా స్టెమీ గుండెపోటు సోమవారం నాడు గరిష్టస్థాయికి చేరుకుంటుందని వివరించారు. ఈ ప్రమాదం ...5లో



సోమవారాలు ఎందుకు?

స్టెమీ మరియు పని వారం ప్రారంభం మధ్య పరస్పర సంబంధం గురించి ఈ అధ్యయనానికి నేతృత్వం వహించిన డాక్టర్ జాక్ లాఫాన్ వెల్లడించారు. అయితే, దీనికి గల కారణం ఇప్పటికీ అస్పష్టంగానే ఉన్నప్పటికీ.. శాస్త్రవేత్తలు మాత్రం ఈ దృగ్విషయం సిర్కాడియన్ రిథమ్ లేదా శరీరం నిద్ర మేల్కొనే చక్రానికి సంబంధించినదని భావిస్తున్నారు. ఈ అంశంపై మునుపటి పరిశోధన కూడా హృదయ సంబంధిత ఘటనలు సోమవారాల్లోనే ఎక్కువగా సంభవించే అవకాశం ఉన్నదని సూచించింది. 2005లో జరిపిన పరిశోధనలు ఈ సంఘటనలకు వారాంతంలో అతిగా మద్యపానం ప్రభావంగా పరిగణించబడ్డాయి. అయితే, ఇది నిరూపితం కాలేదు.

తెలంగాణకు 12 ,ఏపీకి ఐదు

తెలుగు రాష్ట్రాల్లో మెడికల్ కాలేజీలకు కేంద్రం ఆమోదం



- ఒక్కో కాలేజీలో 150 సీట్లు
- దేశవ్యాప్తంగా 50 కాలేజీలకు

ఆమోదం : కేంద్ర వైద్యారోగ్య మంత్రిత్వ శాఖ

నవతెలంగాణ' -న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణకు 12 , ఆంధ్రప్రదేశ్‌కు 5 కొత్త కాలేజీలకు కేంద్రం ఆమోదముద్ర వేసింది. గురువారం దేశంలో కొత్తగా మరో 50 వైద్య కళాశాలల ...5లో

రైలు ప్రమాదాలను నివారించలేమా.?

(మొదటిపేజీ తరువాయి)

ఉన్న చైనా, జపాన్ దేశాలు అనుసరిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం ఏమిటి? అన్న చర్చనీయాంశం అవుతోంది.

ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్

ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ (ఈఐ) అనేది ఒక సిగ్నలింగ్ వ్యవస్థ. దీనిలోని ఎలక్ట్రానిక్ భాగాలు సిగ్నలింగ్, పాయింట్లు, ట్రాక్ సర్క్యూట్లను నియంత్రించి అవి సరిగా పని చేసేలా చూస్తాయి. బాలాసోర్ వంటి దుర్ఘటనలు జరగకుండా నివారిస్తాయి. ఉదాహరణకు రెండు రైళ్లు ఒకే ట్రాక్ మీదికి ఎదురెదురుగా వస్తుంటే ఈఐ వెంటనే హెచ్చరికలు జారీ చేస్తుంది. కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ విషయానికి వస్తే ముందుగా ఆ లైనులో వెళ్లేందుకు సిగ్నల్ ఇచ్చి ఆ తర్వాత దానిని వెనక్కి తీసుకున్నారని ప్రాథమిక విచారణలో తేలింది. ఇలా జరగడానికి కారణమేమిటో తెలియరాలేదు. ఈఐ వైఫల్యం వల్లనే ఇలా జరిగి ఉండవచ్చునని భావిస్తున్నారు.

విజిలెన్స్ కంట్రోల్ పరికరం

ఒకవేళ రైలును నడిపే పైలట్, కో-పైలట్ ఇద్దరూ అస్వస్థతకు గురైతే రైలు దానంతట అదే నడిచేలా చేసేదే విజిలెన్స్ కంట్రోల్ పరికరం. మన దేశంలోని రైలు ఇంజిన్లలో వీటిని 2018లోనే ఏర్పాటు చేశారు. పైలట్ లేదా కో-పైలట్ ఎంత అప్రమత్తంగా ఉన్నాడో ఈ పరికరం ఎప్పటికప్పుడు నిశితంగా గమనిస్తూ ఉంటుంది. డ్రైవర్ ఒక నిమిషం పాటు అచేతనుడైతే ఈ పరికరం స్పందిస్తుంది. 16 సెకన్ల పాటు ఆడియో విజువల్ సిగ్నల్ పని చేస్తుంది. ఆ సమయంలో డ్రైవర్ స్పందించి బటన్ నొక్కాలి. అలా చేయని పక్షంలో ఆటోమాటిక్ ఎమర్జెన్సీ బ్రేకింగ్ వ్యవస్థ పని ప్రారంభిస్తుంది.

కవచం

కవచ్ అనేది స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందిన వ్యవస్థ. ప్రమాదకర పరిస్థితులలో సిగ్నల్‌ను దాటేందుకు, అధిక వేగాన్ని నియంత్రించేందుకు ఇది పైలట్లకు సహాయ పడుతుంది. తుపానులు వచ్చినా, పొగమంచు కురిసినా రైలు యథావిధిగా నడిచేందుకు దోహదపడుతుంది. రైలు ఏ దిశ నుండి వచ్చినా కవచ్ దానిని గుర్తిస్తుంది. పట్టాలపై వ్యతిరేక దిశ నుండి రైలు వస్తుంటే దానిని గమనించి పైలట్‌ను అప్రమత్తం చేస్తుంది. అయితే కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లో ఇలాంటి వ్యవస్థ ఏదీ లేదు.

ఇతర భద్రతా చర్యలు

'రక్షా కవచ్' అని పిలవబడే పరికరాన్ని కొంకణ్ రైల్వే అభివృద్ధి చేసింది. రైళ్లు అత్యంత వేగంతో ఎదురెదురుగా వస్తున్నప్పుడు అవి ఢీకొనకుండా ఈ పరికరం నివారిస్తుంది. సిగ్నలింగ్, ఇంటర్‌లాకింగ్ వ్యవస్థలు విఫలమైనప్పుడు ఇది పనిచేస్తుంది. మరో మాటలో చెప్పాలంటే ఈ పరికరం జీపీఎస్‌పై ఆధారపడి రూపొందించబడింది. ప్రస్తుతం ఈ పరికరాన్ని ఈశాన్య రైల్వేలో మాత్రమే ఉపయోగిస్తున్నారు. ఇక రైల్వే గేట్ల వద్ద అమర్చిన పరికరం పట్టాలు దాటే ప్రజలను అప్రమత్తం చేస్తూ ఉంటుంది. ప్రస్తుతం దీనిని 90 రైల్వే గేట్ల వద్ద అమర్చి పరీక్షిస్తున్నారు. కాగా రైలు పట్టాలు దెబ్బతిన్నాయా లేక బీటలు వారాయా అనే విషయాన్ని తెలుసుకునేందుకు యూఎస్‌ఎఫ్‌డీ పరికరాన్ని ఉపయోగిస్తున్నారు. దీనితో పాటు పట్టాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు అవసరమైన వ్యవస్థలూ ఉన్నాయి. లోకో పైలట్ ఎక్కువ వేగంతో రైలును నడిపినా, సిగ్నల్‌ను దాటే సమయంలో పొరపాటు చేసినా ప్రమాదాలు జరగకుండా చూసేందుకు టీపీడబ్ల్యూఎస్ వ్యవస్థ పని చేస్తుంది. ఇక జర్మన్ కంపెనీ తయారు చేసిన ఎల్‌హెచ్‌బీ బోగీలను మన రైల్వేలు విరివిగా ఉపయోగిస్తున్నాయి. వీటిని సురక్షితమైనవిగా భావిస్తారు. బాలాసోర్ ప్రమాదానికి గురైన రెండు రైళ్లకూ ఈ బోగీలే ఉన్నాయి. పైలట్ రైలు వేగాన్ని పెంచి, ఆ తర్వాత వెంటనే బ్రేకులు వేయడాన్ని నివారించేందుకు ఇంజిన్‌లో పీసీబీని ఏర్పాటు చేశారు. ఇన్ని భద్రతా చర్యలు ఉన్నప్పటికీ దేశంలో రైలు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.

ఇతర దేశాలలో ఏం చేస్తున్నారు?

అత్యంత వేగంగా నడిచే రైళ్లకు సంబంధించి చైనా, జపాన్, జర్మనీ దేశాలు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నాయి. మన దేశంలో కూడా ఇలాంటి పరిజ్ఞానాన్ని వినియోగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే భారతీయ రైల్వేలో ప్రపంచ శ్రేణి భద్రతా వ్యవస్థను ఉపయోగించడం పైన పలు ప్రశ్నలు ముందుకు వస్తున్నాయి.

యూరోపియన్ యూనియన్ దేశాలలో...

యూరోపియన్ యూనియన్ దేశాలలో సిగ్నలింగ్ వ్యవస్థ పటిష్టంగా ఉంటుంది. ఇందుకోసం ప్రామాణికమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. అత్యంత వేగంగా నడిచే రైళ్లకు ఈ పరిజ్ఞానం ఎంతగానో ఉపయోగకరంగా ఉంటోంది. సంప్రదాయ వ్యవస్థలకు భిన్నంగా అక్కడ రైళ్లను నియంత్రించే వ్యవస్థ పనిచేస్తోంది. కంప్యూటర్‌లో కనిపించే సమాచారం ఆధారంగానే డ్రైవర్లు రైలును నడుపుతారు. పట్టాల పక్కనే ఉండే సిగ్నల్స్‌ను వారు గమనించాల్సిన అవసరం ఉండదు. ట్రాక్ కండక్టర్లను ప్రతి వంద మీటర్లకు కేబుల్‌తో అనుసంధానం చేస్తారు. ఈ క్రాసింగ్ పాయింట్ల నుండి సిగ్నల్స్‌కు సమాచారం అందుతుంది. రైలు ఎక్కడ ఉన్నదీ స్టేషన్ మాస్టర్‌కు తేలికగా తెలిసిపోతుంది. సిగ్నల్ బాక్స్‌తో సమాంతరంగా పనిచేసే కంప్యూటర్లు పట్టాలపై రైళ్ల రాకపోకల సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలియజేస్తూ ఉంటాయి. రైలుకు ఏడు కిలోమీటర్ల దూరం వరకూ ఏం జరుగుతోందో డ్రైవర్ తెలుసుకునేందుకు ఈ పరిజ్ఞానం ఉపకరిస్తుంది.

జపాన్‌లో...

అర్థమవుతుంది. ప్రస్తుతం మన దేశంలో ముంబయి-అహ్మదాబాద్ హైస్పీడ్ రైల్ కారిడార్‌లో షింకాన్‌సేన్ టెక్నాలజీని వాడుతున్నారు. రైళ్లు పరస్పరం ఢీకొనకుండా నివారించేందుకు, ఒకవేళ వేగం పెరిగితే దానిని తగ్గించేందుకు ఈ పరిజ్ఞానం ఉపయోగపడుతుంది.

ఇంటర్ బైపీసీ విద్యార్థులకు ఆర్థిక చేయూత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్ బైపీసీ విద్యార్థులకు రెండేండ్లపాటు ఆర్థికంగా చేయూత నందించాలని మెటామైండ్ అకాడమి ప్రకటించింది. ఈ మేరకు ఆ సంస్థ డైరెక్టర్ మనోజ్‌కుమార్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా పేద బాలబాలికల్లో మొదటి వంద విద్యార్థులకు బైపీసీతోపాటు నీట్ కోచింగ్, హాస్టల్ వసతి కల్పిస్తామని తెలిపారు. ఉచిత రిజిస్ట్రేషన్, హాస్టల్ వసతి వంటి వివరాలకు 8522958575, 7032264910 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

రైతు రక్షణ కోసం 'కార్పొరేట్ క్విట్ ఇండియా' ఉద్యమం

- ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ విజ్జు కృష్ణన్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

దేశంలో రైతాంగం తీవ్ర సంక్షోభం ఎదుర్కొంటున్నదని అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ విజ్జుకృష్ణన్ ఆందోళన వ్యక్తం చేశారు. రైతు రక్షణ కోసం 'కార్పొరేట్ క్విట్ ఇండియా' నినాదంతో ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. అమెరికాలో ఒక రైతుపై 7,253 డాలర్లు ఖర్చుచేస్తే, యూరోపియన్ దేశాలు రైతుపై 1068 డాలర్లు ఖర్చు చేస్తున్నాయన్నారు. మనదేశంలో కేవలం 49 డాలర్లు మాత్రమే ఖర్చు చేస్తున్నారని తెలిపారు. 2014లో మోడీ రైతులకిచ్చిన హామీలను ఒకటి కూడా అమలు చేయలేదన్నారు. రైతులు పండించిన పంటకు మద్దతు ధర లభించడం లేదని చెప్పారు. ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల ధరల విపరీతంగా పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. యి. 2014 నుండి 2022 వరకు లక్షకు పైగా రైతులు, వ్యవసాయ కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందులో పల్లెల నుంచి పట్టణాలకు వలస వచ్చిన కార్మికులే ఉన్నారని తెలిపారు. వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో ఉందనడానికి ఆత్మహత్యలే నిదర్శనమన్నారు. రైతుల హక్కుల ను కాపాడాలంటూ మే 26 నుంచి జూన్ 15 వరకు సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతుల సమస్యలపై నిరసనలు, ర్యాలీలు, ఎంపీలకు మెమోరాండాలు ఇవ్వాలన్నారు. ఆగస్టు 1 నుంచి 15 వరకు రెండో దశ పోరాటాలను కొనసాగించాలని కోరారు. కార్పొరేట్ క్విట్ ఇండియా నినాదంతో పాదయాత్రలు, సైకిల్ యాత్రలు, ఇంటింటి ప్రచారం, కరపత్రాల పంపిణీ, సెమినార్లు నిర్వహించాలని సూచించారు. పార్లమెంటు నియోజక వర్గస్థాయిలో కార్పొరేట్ వ్యతిరేక మార్చ్ నిర్వహించాలని చెప్పారు. నవంబర్ 26, 28 తేదీల్లో స్థానిక సమస్యలపై కనీసం మూడు రోజులు రాత్రి, పగలు 'మహాపరావ్' నిర్వహించాలని పిలుపునిచ్చారు.

మహిళా హక్కుల రక్షణ, సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలి

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి



నవతెలంగాణ- ఖమ్మం

మహిళా హక్కుల రక్షణతో పాటు వారి సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవన్‌లో ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల ఐద్వా రాష్ట్ర జోనల్ క్లాసులు గురువారం నుంచి మూడు రోజులు జరగనున్నాయి. మాచర్ల భారతి అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో మల్లు లక్ష్మి పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ రెండోసారి అధికారంలోకి వచ్చాక మహిళలపై లైంగిక వేధింపులు పెరిగాయన్నారు. 2014 ముందు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ధరలు పెంచుతుందని గగ్గోలు పెట్టి అధికారంలోకి వచ్చిన బీజేపీ.. తానూ అదే పనిచేస్తూ సామాన్యుల నడ్డి విరుస్తుందని విమర్శించారు. ధరలు పెరగడం వల్ల అనేకమంది మహిళలు పోషక పదార్థాలు తినక రోగాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పిన నరేంద్ర మోడీ ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటు వాళ్లకు అప్పజెప్పి ఉన్న ఉద్యోగాలనే పీకేస్తున్నారని ఆరోపించారు. 2020 నాటికి పేదలందరికీ ఆవాస్ యోజన కింద ఇల్లు కట్టిస్తానని చెప్పిన మోడీ ఎక్కడా ఒక ఇల్లు కూడా మంజూరు చేయలేదన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలపై అత్యాచారాలు, హత్యలు, వేధింపులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా రెజ్లర్లపై బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్ లైంగిక వేధింపులకు పాల్పడ్డా మోడీ మాట్లాడకపోవడం విచారకరమన్నారు. రెజ్లర్ల న్యాయ పోరాటానికి ఐద్వా అండగా ఉంటుందని, మోడీ ఇప్పటికైనా వారికి న్యాయం చేయడానికి ముందుకు వచ్చి, ఎంపీపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొత్త పార్లమెంట్ భవనాన్ని భారత రాష్ట్రపతిగా ఉన్న మహిళతో ప్రారంభించకుండా మహిళలను అణగదొక్కుతున్నారన్నారు. రాష్ట్రంలో అనేక మంది పేదలు ఇల్లు లేక స్థలాలు లేక బాధపడుతున్నారని, ఇప్పటికే మూడు లక్షల మంది డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని, 40 వేల మంది ఇండ్ల స్థలాల కోసం అడుగుతున్నారని, వెంటనే వారందరికీ స్థలాలు ఇచ్చి ఇల్లు కట్టించాలని డిమాండ్ చేశారు. అనంతరం బుగ్గవీటి సరళ ప్రిన్సిపాల్‌గా 'తెలంగాణ ప్రజా పోరాటం మహిళల పాత్ర' అంశంపై ఐద్వా ఉపాధ్యక్షులు బత్తుల హైమావతి బోధించారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ఐద్వా అధ్యక్షులు బండి పద్మ, సంఘం రాష్ట్ర నాయకులు అఫ్రోజ్ సమీనా, ప్రభావతి, ఎం.రమణ, పయ్యావుల ప్రభావతి, నాగ, సులోచన, మెహ్రూనిసా బేగం, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పాలనే ఎజెండాగా...

- మహారాష్ట్రలో బీఆర్‌ఎస్ విస్తరణ సీఎం కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ మోడల్ పాలనే ఎజెండాగా మహారాష్ట్రలో బీఆర్‌ఎస్ విస్తరణను 288 నియోజకవర్గాల్లో చేపట్టాలని ఆ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ సూచించారు. ప్రతి గ్రామంలోనూ అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతో తొమ్మిది కమిటీలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. మహారాష్ట్ర నుంచి బీఆర్‌ఎస్‌లోకి చేరికలు పెద్దఎత్తున కొనసాగుతున్న నేపథ్యంలో పలువురు మహారాష్ట్ర నుండి సీఎం కేసీఆర్ సమక్షంలో పలువురు ఆ పార్టీ లో చేరారు. వారందరికీ సీఎం గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణలో రైతులు సహా అన్ని వర్గాల ప్రజలకందిస్తున్న సంక్షేమ పాలన మోడల్‌పై కరపత్రాలు, బుక్‌లెట్స్ , సోషల్ మీడియా, పోస్టర్స్, హోర్డింగ్స్ ద్వారా మహారాష్ట్రలో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ప్రజలకు కూడా తెలంగాణలో అమలవుతున్న పథకాలందించాలనే స్ఫూర్తితో బీఆర్‌ఎస్ పని చేస్తుందన్నారు.

పీస్‌రేట్ కార్మికులకు కనీస వేతనాలివ్వాలి

అన్‌మెన్డ్ కార్మికులను ఆర్టిజెన్లుగా గుర్తించాలి : యూఈఈయూ నేతల డిమాండ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

విద్యుత్ శాఖలో పనిచేస్తున్న పీస్‌రేట్ కార్మికులకు కనీస వేతనాలివ్వాలనీ, అన్‌మెన్డ్ కార్మికులను ఆర్టిజెన్లుగా గుర్తించాలని తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆ యూనియన్ సమావేశం జరిగింది. అందులో ఆ యూనియన్ అధ్యక్షులు కె.ఈశ్వర్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.స్వామి ఎల్‌ఎమ్, సహాయ ప్రధాన కార్యదర్శి జె. ప్రసాద్‌రాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.సుధాకర్, ట్రెజరర్ జె.బసవరాజు, రాష్ట్ర నాయ కులు కె.రమేశ్, టి.లక్ష్మయ్య, సత్యనారాయణ, నర్సిం హులు, బాలరాజు, వై.రాజా, టి.రత్న, మోహన్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యుత్ శాఖలో బిల్‌కలెక్టర్లు, మీటర్ రీడర్లు, అన్‌మెన్డ్ కార్మికులు, ట్రాన్స్‌ఫార్మర్ రిపేరింగ్ సెంటర్లలో పనిచేసే కార్మికులు, సెక్యూరిటీ గార్డులు, పీఏలు పనిచేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ శాఖలో చేసిన వేతన ఒప్పందం వీరిలో ఒక్కరికి కూడా వర్తించడం లేదని వాపోయారు. మీటర్ రీడింగ్, బిల్ కలెక్టర్లు కీలక పాత్ర పోషిస్తుండటంతో వల్లనే ఆ శాఖకు కస్టమర్ల నుంచి బిల్లులు సకాలంలో వసూలవుతున్నాయని చెప్పారు. అంతటి కీలకమైన వారిని రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు గుర్తించడం లేదని ప్రశ్నించారు. అన్‌మెన్డ్ కార్మికులకు తప్ప మిగిలిన కార్మికులందరికీ పీస్‌రేట్ పద్ధతిలో డబ్బులు చెల్లిస్తున్నారని చెప్పారు. నెలంతా కష్టపడితే రూ.3 వేల నుంచి రూ.4 వేలు కూడా రావడం లేదని తెలిపారు. ఆ జీతంతో ఎలా బతకాలో యాజమాన్యమే చెప్పాలని ప్రశ్నించారు. బిల్‌కలెక్టర్లు, మీటర్ రీడర్లు, పీఏలు, ఎస్‌పీఎం కార్మికులకు కనీస వేతనాల జీవో 11 ప్రకారం జీతాలివ్వాలని కోరారు. పీస్‌రేట్ అనే పదాన్ని తీసేయాలని విజ్ఞప్తి చేశారు. అన్‌మెన్డ్ కార్మికులను ఆర్టిజెన్లుగా గుర్తించాలనీ, అంత వరకు వారికి స్కిల్డ్ వేతనం రూ.26 వేలు చెల్లించాలని కోరారు. వారందరికీ ఈఎస్‌ఐ, ఈపీఎఫ్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సెక్యూరిటీ గార్డుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలి : కె. ఈశ్వరరావు

రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ, ఆలిండియా రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షులు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేయాలని తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూని యన్ రాష్ట్ర అధ్యక్షులు కె. ఈశ్వర్ రావు డిమాండ్ చేశారు.గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద ఆ యూనియన్ ఆధ్వర్యం లో నిరసన కార్యక్రమం చేపట్టారు. రెజ్లర్లపై లైంగిక దాడికి పాల్పడిన ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలి..అరెస్టు చేయాలి.., రేపిస్టులకు అండ నా? ..బాధితులపై కేసులా? సిగ్గుసిగ్గు...' అంటూ యూనియన్ నాయకులు నినాదాలు చేశారు. ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఈశ్వర్ రావు మాట్లాడుతూ.. ఒలిం పిక్స్‌లో పతకాలు తీసుకొచ్చిన రెజ్లర్లతో బ్రిజ్‌భూషణ్ అసభ్యకరంగా లైంగిక చర్యలకు పాల్పడటం దారుణమన్నారు. ప్రపంచ పోటీల్లో గాయపడ్డ క్రీడాకారిణిని పట్టుకుని తన లైంగిక కోరిక తీర్చితే వైద్య ఖర్చులన్నీ భరిస్తానని అతడు మాట్లాడటం దుర్మార్గమని విమర్శించారు. ఇలాంటి దుర్మార్గులకు కేంద్రంలోని మోడీ సర్కారు వంత పాడటాన్ని బట్టి బీజేపీకి మహిళల పట్ల ఎలాంటి వైఖరి ఉందో అర్థం అవుతున్నదన్నారు.

20న విద్యాదినోత్సవం నుంచే 'రాగిజావ'

- 25.26 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం
- మన ఊరు-మనబడి కింద వెయ్యి పాఠశాలల ప్రారంభం
- 20 వేల టీచర్లకు ట్యాబ్‌ల అందజేత
- 1,600 స్కూళ్లలో 4,800 డిజిటల్ తరగతులు : విద్యామంత్రి సబితా ఇంద్రారెడ్డి వెల్లడి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్


రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఈనెల 20న తెలంగాణ విద్యా దినోత్సవం నుంచే రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అల్పాహారంగా రాగిజావను అందించనున్నట్టు విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి వెల్లడించారు. ప్రతి రోజూ ప్రార్థనా సమయానికి ముందు విద్యార్థులకు 250 మిల్లీ లీటర్ల రాగి జావను అందిస్తామని తెలిపారు. దీని వల్ల 28,606 ప్రభుత్వ పాఠశాలల్లోని 25,26,907 మంది విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందని మంత్రి వివరించారు. గురువారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో విద్యాశాఖ పనితీరుపై సమీక్షించారు. ఈనెల 20న విద్యా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 'మన ఊరు-మన బడి', 'మన బస్తీ-మన బడి' కార్యక్రమం కింద సకల వసతులతో ఆధుని కీకరించిన వెయ్యి ప్రభుత్వ పాఠశాలలను మంత్రులు, శాసన సభ్యులు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్న 16,27,457 మంది విద్యార్థులకు మూడేసి చొప్పున వర్క్‌బుక్స్, ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న 12,39,415 మంది విద్యార్థులకు సబ్జెక్టుకు ఒక్కో నోటు పుస్తకం చొప్పున అందించనున్నట్టు వివరించారు.

పాఠశాలల్లో విద్యాప్రమాణాలను పెంపొందించేందు కు, సమాచార బదలా యింపు కోసం రాష్ట్రంలోని 20 వేల మంది ఉపాధ్యా యులకు ట్యాబ్‌లను అందిస్తామని తెలి పారు. రాష్ట్రంలోని 1,600 పాఠశాలల్లో నిర్మితమైన 4,800 డిజిటల్ తరగతులను విద్యా దినోత్సవం సందర్భంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆమె ఆదేశించారు. ఈ నెల 20న రాష్ట్ర వ్యాప్తంగా ప్రాథమిక పాఠశాల నుంచి విశ్వవిద్యాలయం స్థాయి వరకు సభలు, సమావేశాలను నిర్వహించాలని సూచించారు. విద్యా రంగంలో సాధించిన విజయాలను వివరించాలని కోరారు.

నాణ్యమైన విద్య అందించే బాధ్యత ప్రభుత్వానిదే

ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

- ఖాళీలను భర్తీ చేస్తేనే విద్యార్థులకు సరైన బోధన
- పర్యవేక్షణ అధికారుల కొరతను తీర్చాలి
- తరగతికో టీచరుంటేనే విద్యాప్రమాణాలు మెరగు
- సీపీఎస్‌ను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసి కేంద్రంపై ఒత్తిడి పెంచాలి
- కుటుంబ సంక్షేమ నిధి పథకానికి ఉపాధ్యాయుల్లో మంచి ఆదరణ : నవతెలంగాణతో టీఎస్‌యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి **చావ రవి**



మన ఊరు మనబడి పనులను త్వరగా పూర్తి చేయాలి

గురుకులాల తరహాలోనే సర్కారు బడుల్లో చదివే పేదలు, దళితులు, బడుగు, బలహీనవర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు బాగుపడాలంటే ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి, బదిలీలు చేపట్టాలి, ఖాళీ పోస్టులను చేయాలని కోరారు. పర్యవేక్షణ అధికారుల కొరతను తీర్చాల్సిన అవసరముందన్నారు. తరగతికో టీచర్ లేదంటే సబ్జెక్టుకో ఉపాధ్యాయుడు ఉంటేనే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరగవుతాయని సూచించారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నవతెలంగాణ ప్రతినిధి **బొల్లె జగదీశ్వర్**కు **చావ రవి** ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు...

దశాబ్ది ఉత్సవాల సందర్భంగా విద్యారంగంలో సాధించిన ప్రగతిపై మీరేమంటారు?

తెలంగాణ ఆవిర్భవించి తొమ్మిదేండ్లు పూర్తయి పదో వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు. రాష్ట్రంలో విద్యారంగానికి సంబంధించి చూస్తే మండల, జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలలను మాత్రం ఈ ప్రభుత్వం పట్టించుకున్న పరిస్థితి లేదు. కేజీ టు పీజీ విద్యావిధానాన్ని అమలు చేస్తామన్నారు. కామన్ స్కూల్ విధానం అమలవుతుందని ఆశించాం. మేం కూడా ఓ ముసాయిదా పత్రాన్ని రూపొందించి ప్రభుత్వానికి ఇచ్చాం. దాన్ని ప్రభుత్వం పట్టించుకోలేదు. ఏడాది తర్వాత కేజీ టు పీజీని గురుకులాలకు పరిమితం చేశారు. దాదాపు 750 కొత్త గురుకులాలను ఏర్పాటు చేశారు. గురుకులాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పిల్లలకు కొంత మంది ప్రతిభ కలిగిన విద్యార్థులకు రూ.1.25 లక్షలు ఖర్చు పెడుతూ నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. అన్ని గురుకులాల్లో కలిపి ఐదు లక్షల మంది చదువుతున్నారు. అత్యధికంగా దళితులు, బడుగు బలహీనవర్గాల పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకుంటున్నారు. వారికి నాణ్యమైన విద్య అందించే బాధ్యత ప్రభుత్వంపైనే ఉన్నది. గురుకులాలపైన్నే శ్రద్ధ పెడుతూ నిధులు, టీచర్ల నియామకాలను చేపడుతున్నది. కానీ ప్రభుత్వ, మండల, జిల్లా పరిషత్, గిరిజన ఆశ్రమ పాఠశాలలపై అలాంటి శ్రద్ధ పెట్టడం లేదు.

మన ఊరు మనబడి కార్యక్రమం ఎలా అమలవుతున్నది?

గిరిజన ఆశ్రమ పాఠశాలలకు 1,200 పోస్టులు కావాలని ప్రభుత్వాన్ని కోరితే ఇప్పటి వరకు అతీగతీ లేదు. మండల, జిల్లా పరిషత్ బడుల్లో 2017లో టీఆర్టీ ద్వారా 8,792 పోస్టులు భర్తీ చేశారు. ఇంకా 22 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటి భర్తీని పట్టించుకోవడం లేదు. సర్కారు బడుల్లో పర్యవేక్షణ పడకేసింది. ఇది ఉపాధ్యాయుల పంచాయతీ, సర్వీసు రూల్స్ సమస్య అంటూ ప్రభుత్వం వదిలేస్తున్నది. ప్రభుత్వ విద్యారంగాన్ని నిలబెడదాం అన్న ఆసక్తి లేదు. విద్యాశాఖ పట్ల సరైన ఆసక్తి ఉన్న అధికారుల్లేరు. తల్లిదండ్రుల డిమాండ్ మేరకు గతేడాది సమాంతరంగా ఇంగ్లీష్ మీడియాన్ని ప్రవేశపెట్టారు. పాఠశాలల్లో రూ.7,289 కోట్లతో మన ఊరు మనబడి పథకాన్ని ప్రారంభించారు. 12 రకాల మౌలిక వసతులు అభివృద్ధి చేస్తామన్నారు. 9,123 స్కూళ్లలో మొదటి దశలో బాగు చేస్తామన్నారు. ఇప్పటి వరకు ఏడాది గడిచింది, కానీ చాలా స్కూళ్లలో మౌలిక వసతుల కల్పన పూర్తి కాలేదు. చేయాలన్న స్థిర సంకల్పం ఉండడంతోపాటు అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలి. అవసరమైన నిధులు కేటాయించి త్వరగా పనులు పూర్తి చేయాలి. ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టారు కానీ బోధనకు అవసరమైన ఉపాధ్యాయులను నియమించలేదు, ఉన్న వారికి శిక్షణ ఇవ్వలేదు. హైకోర్టులో ఉన్న స్టే ఎత్తేసి బదిలీలు, పదోన్నతులు చేపట్టి కొత్త ఉపాధ్యాయ నియామకాలు చేపడితే వచ్చే విద్యాసంవత్సరం సజావుగా కొనసాగుతుంది. ధనిక రాష్ట్రం, మిగులు బడ్జెట్ అంటున్నారు. విద్యారంగానికి తెలంగాణ వచ్చినపుడు 14 శాతం నిధులు కేటాయిస్తే, ఇప్పుడు ఏడు శాతంలోపు ఉన్నది.

విద్యారంగ అభివృద్ధికి అనేక చర్యలు తీసుకుంటున్నా మని ప్రభుత్వం చెప్తున్నది. కానీ సర్కారు బడుల్లో ప్రమా ణాలు పడిపోతున్నాయి. దీనికి కారణమేమంటారు?

పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలిస్తే నాణ్యమైన విద్య అందదు. మౌలిక వసతులు పెరుగుతున్నాయి. పాఠశాలల్లో ఉపాధ్యాయుల్లేకపోతే విద్యార్థులకు చదువెలా వస్తుంది. పర్యవేక్షించే అధికారుల్లేకపోతే ఎలా.? ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలి. పర్యవేక్షణ అధికారుల కొరతను తీర్చాలి. అప్పుడే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయి. కొంతమంది ఉపాధ్యాయులు పనిచేయకుండా సొంత వ్యాపకాలు చూసుకునే వారిపై కఠిన చర్యలు తీసుకునే బాధ్యత ప్రభుత్వంపైనే ఉన్నది. అయితే కొందరు అధికారులు, ప్రజాప్రతినిధులు వారికి కొమ్ముకాస్తున్నారు. వారిని రక్షించుకుంటూ విద్యావ్యవస్థ పాడైపోయిందంటే ఉపయోగం లేదు. సరైన పర్యవేక్షణ వ్యవస్థ ఉంటే ఉపాధ్యాయులు సక్రమంగా పనిచేస్తారు. ఉపాధ్యాయుల్లో అలసత్వం పోగొట్టాలి. అప్పుడే విద్యావ్యవస్థ బాగుపడుతుంది.

రానున్నది ఎన్నికల కాలం. సీపీఎస్‌ను రద్దు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపైనే ఉన్నది. దీనిపై ఏమంటారు?

సీపీఎస్ విధానం వల్ల ఉద్యోగులకు, ప్రభుత్వానికి కూడా నష్టమే. ఉద్యోగుల నుంచి పది శాతం, రాష్ట్ర ప్రభుత్వం పది శాతం డబ్బును షేర్ మార్కెట్‌లో పెడుతున్నారు. ఉద్యోగుల డబ్బు జీపీఎఫ్‌లో ఉంటే ప్రభుత్వం వద్ద ఉన్నట్టే. అభివృద్ధి కార్యక్రమాలకు దాన్ని వాడుకోవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేస్తే ఉద్యోగులు, ఉపాధ్యాయుల్లో సానుకూల దృక్పథం వస్తుంది. పీఎఫ్ఆర్డీఏను రద్దు చేయాల్సింది కేంద్రం. అప్పుడే దేశవ్యాప్తంగా సీపీఎస్ విధానం రద్దవుతుంది. ఎంప్లాయ్ ఫ్రెండ్లీ ప్రభుత్వం కాబట్టి సీపీఎస్‌ను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసి ఆ తర్వాత కేంద్రంపై ఒత్తిడి పెంచాలి. రాజస్థాన్, పంజాబ్, ఛత్తీస్‌ఘడ్, హిమాచల్ ప్రదేశ్‌లో సీపీఎస్‌ను ఆయా ప్రభుత్వాలు రద్దు చేశాయి. అదే పద్ధతిలో సీపీఎస్‌ను రద్దు చేసి బీజేపీని పీఎఫ్ఆర్డీఏను రద్దు చేయాలంటూ ఒత్తిడి తేవాలి. రాబోయే ఎన్నికల్లో ఇది సీరియస్ ఎజెండా అంశంగా ఉంటుంది. బీజేపీని నమ్మే పరిస్థితిలో ఉద్యోగులు, ఉపాధ్యాయుల్లేరు. ఎందుకంటే ఆ పార్టీ సీపీఎస్‌ను రద్దు చేసే అవకాశం లేదు. త్రిపురలో అధికారంలోకి వచ్చిన ఆర్నెల్లలో పాత పెన్షన్ విధానాన్ని రద్దు చేసి సీపీఎస్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. అయితే కాంగ్రెస్ పార్టీ రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్‌లో సీపీఎస్ విధానాన్ని రద్దు చేసింది. తెలంగాణలో కూడా అధికారంలోకి వస్తే రద్దు చేస్తామని ప్రకటించింది. ఉద్యోగులకు మొదటి తేదీన జీతాలివ్వాలి. ట్రెజరీల్లో ఆమోదం పొందినా ఉద్యోగుల బిల్లులు మంజూరు కావడం లేదు. పీఆర్సీ జులై నుంచి అమలు కావాలి. ఫిట్‌మెంట్ ఇవ్వడం సాధ్యం కాకపోతే ఐఆర్ ఇవ్వాలి. ఉప్రయివేటు హెల్త్ ఇన్సూరెన్స్ ప్యాకేజీలున్నాయి. శ్లాబ్ రేటు పెట్టి ఉద్యోగుల ఆరోగ్య పథకం అమలు చేస్తే బాగుంటుంది. కానీ జీతంలో ఒక శాతం, రెండు శాతం వసూలు చేయడం సరికాదు.ఉద్యోగ, ఉపా ధ్యాయ సంఘాలతో చర్చించి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి.

తొమ్మిదేండ్ల కాలంలో టీఎస్‌యూటీఎఫ్ చేసిన ఉద్యమాలు, సామాజిక కార్యక్రమాల గురించి వివరించండి?

రాష్ట్రంలో ఐక్య ఉద్యమాలకు టీఎస్‌యూటీఎఫ్ చిరునామాగా మారింది. పోరాటాలకు దిక్సూచిగా ఉన్నది. ఇతర ఉపాధ్యాయులు కూడా టీఎస్‌యూటీఎఫ్‌ను ఆదరిస్తున్నారు. ఈ తొమ్మిదేండ్ల కాలంలో సభ్యత్వం రెట్టింపైంది. వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి టీఎస్‌యూటీఎఫ్ పూర్వ అధ్యక్షులు అలుగుబెల్లి నర్సిరెడ్డి ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల మద్దతుతో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గంలో విజయం సాధించకపోయినా గణనీయమైన ఓటింగ్‌ను పొందాం. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాడుతున్నాం. సందర్భాను సారం ఐక్య ఉద్యమాల్లో భాగస్వామ్యం అవుతున్నాం. 18 ఉపాధ్యాయ సంఘాలతో అతిపెద్ద ఐక్యవేదికగా యూఎస్‌పీసీ ఉన్నది. టీఎస్‌యూటీఎఫ్ సామాజిక కార్యక్రమాల్లో ముందున్నది. టీఎస్‌యూటీ ఎఫ్ కుటుంబ సంక్షేమ నిధి పథకాన్ని మే 2వ తేదీన ప్రారంభించాం. జులై 1వ తేదీ నుంచి ఇది అమలవుతుంది. ఇందులో ఐదు వేల మంది సభ్యులుగా ఉండాలని నిర్ణయించాం. వారిలో ఎవరైనా చనిపోతే ఒక్కొక్కరి నుంచి రూ.వంద చొప్పున వసూలు చేసి ఆ కుటుంబానికి రూ.ఐదు లక్షలిస్తాం. ఎక్కువ మంది సభ్యులుంటే ఎక్కువ డబ్బు అందించడానికి వీలవుతుంది. ఫ్యామిలీ వెల్ఫేర్ ఫండ్‌ను పరస్పర సహకారంతో ఒకరి కోసం అందరూ, అందరి కోసం ప్రతి ఒక్కరూ నినాదంతో అమలు చేస్తున్నాం. ఇది ఉపాధ్యాయుల్లో మంచి ఆదరణ పొందుతున్నది. ఇతర సంఘాల నుంచి ప్రశంసలు వస్తున్నాయి.

తెలంగాణలో సంక్షేమానికి స్వర్ణయుగం

ఆసరా, ఇతర పింఛన్లకే రూ.58వేల కోట్లు

రూ.5లక్షల కోట్లతో సంక్షేమ పథకాలు

దశాబ్ది ఉత్సవాల్లో నేడు సంక్షేమ రంగం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



స్వరాష్ట్రంలో సబ్బండ వర్గాలకు, ఆసరా అవసరమైన సకల జనులకు కనీస జీవన భద్రత కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ప్రతి ఏటా రూ.50 వేల కోట్లకుపైగా నిధులతో పలు రకాల ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నది. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సంక్షేమ రంగంపై ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ క్రమంలో సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనర్ పూర్తి వివరాలు వెల్లడిస్తూ ప్రకటన జారీచేశారు. పదేండ్లకు చేరుకున్న స్వరాష్ట్ర పాలనా కాలంలో దాదాపు రూ.5 లక్షల కోట్లను ఆసరా ఫించన్లు సహా పలు రకాల సంక్షేమ పథకాల కోసం రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. దేశానికే ఆదర్శంగా నిలిచిన ఆసరా ఫించన్లు, ఇతర సంక్షేమ పథకాలు పేదల్లో ఆర్థిక భరోసాను ఆత్మగౌరవాన్ని నింపాయి. ఆసరా పెన్షన్ కాకుండా...రైతులకు పంటపెట్టుబడి వంటి వ్యక్తిగత ఆర్థిక సాయం సామాజిక పెట్టుబడిగా మారింది. 'రూపాయి ప్రజల్లో తిరిగడం ద్వారా స్పిన్ ఆఫ్ ఎకానమీకి దారితీసింది. ప్రజల కొనుగోలు శక్తి పెరిగి తద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు దన్నుగా నిలిచింది.

ఎస్సీల సంక్షేమం



స్వతంత్ర భారతంలో ఈనాటికీ ఈ వివక్ష కొనసాగడం అత్యంత హేయమైన చర్యగా రాష్ట్ర ప్రభుత్వం భావించింది. అందుకు అనుగుణంగా ఎస్సీ కులాల అభివద్ధి దిశగా పలు సంక్షేమ అభివద్ధి పథకాలను అమలు చేస్తున్నది. ఈ నేపథ్యంలో ఎస్సీ కులాలను అటు సామాజిక వివక్ష నుంచి దూరం చేయడంతోపాటు, ఇటు ఆర్థిక స్వావలంబనను కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే దళితబంధు కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ పథకాన్ని ప్రవేశపెట్టి, విజయవంతంగా అమలు చేస్తున్నది. ఈ పథకం కింద ఎలాంటి బ్యాంకు లింకేజీగానీ, సెక్యూరిటీగానీ లేకుండా, లబ్ధిదారుడు తిరిగి చెల్లించాల్సిన అవసరం లేకుండానే రాష్ట్ర ప్రభుత్వమే రూ.10లక్షల గ్రాంటును ఉచితంగా అందజేస్తుంది. దళితులను స్వయం సమద్ధులుగా, వ్యాపార వర్గాలుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ ఏడాదిలో దీనికోసం రూ.17,700కోట్లను సర్కార్ కేటాయించింది.

ఎస్టీల సంక్షేమం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన పథకాలతో నేడు గిరిజనులు ఆత్మగౌరవంతో, భవిష్యత్ మీద భరోసాతో ఉన్నారు. గిరిజనుల్లోని అనేక తెగలు విద్యాధికులుగా, పారిశ్రామికవేత్తలుగా, వ్యాపారులుగా, రాజకీయాల్లో రాణిస్తూ అభివృద్ధి బాటలో పయనిస్తున్నారు. యావత్ దేశంలోనే నేడు తెలంగాణలో గిరిజనుల సంక్షేమం పరిఢవిల్లుతున్నది. ఎస్టీల కోసం ప్రత్యేక ప్రగతిని ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఎస్టీల కోసం ఖచ్చితంగా అత్యధిక నిధులను కేటాయించాలనే నిబంధనను పటిష్టంగా అమలు చేస్తున్నది. గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలను ఇనుమడింపజేసేందుకు వారి పండుగలైన సంత్ సేవాలాల్ జయంతి, కుమరంభీం జయంతి, వర్ధంతులు, బౌరాపూర్ జాతర, జంగుబాయి జాతర, నాచారం జాతరలకు ప్రభుత్వం ప్రతిఏటా నిధులు విడుదల చేస్తూ, అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నది. ప్రభుత్వం రెండేళ్ళకోసారి వచ్చే మేడారం జాతర కోసం ప్రతీ ఏటా రూ. 354 కోట్లను విడుదల చేస్తున్నది.

బీసీల సంక్షేమం

రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన తరగతుల్లోని ప్రతీ కులానికి ప్రత్యక్ష ప్రయోజనాలను చేకూర్చేలా ప్రవేశపెట్టిన పథకాలు ఆ కులాల్లో గుణాత్మక మార్పుకు దోహదం చేశాయి. రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన పథకాలతో సామాజికంగా, ఆర్థికంగా, విద్యా పరంగా మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు. కుల వృత్తులను బలోపేతం చేసే లక్ష్యంతో ప్రభుత్వం తెచ్చిన పథకాలతో ప్రతి పల్లె స్వయం సమృద్ధి సాధించి పల్లెలే ప్రగతికి పట్టుకొమ్మలనే నానుడిని నిజం చేస్తున్నాయి. పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల నుండి డే స్కాలర్‌షిప్‌లు, మహాత్మా జ్యోతిబా పూలే విదేశీ విద్యానిధి పథకాలు అమలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గొర్రెల పంపిణీ కార్యక్రమం ద్వారా రూ.5001.53 కోట్లు ఖర్చు చేసింది.

కల్యాణలక్ష్మి / షాదీ ముబారక్

ఆడపిల్ల పెండ్లి కోసం ఆర్థిక భారంతో కుంగిపోయే నిరుపేద కుటుంబాలను పెండ్లి ఖర్చుల అవస్థలనుంచి గట్టెక్కించడానికి రాష్ట్రంలోని ప్రతీ పేదింటి ఆడబిడ్డ పెళ్లికి ఆర్థిక సాయం చేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ వర్గాలకు 'కల్యాణలక్ష్మి' పథకాన్ని, మైనారిటీలకు షాదీముబారక్ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తున్నది. నేతన్నల జీవితాలలో వెలుగులు నింపేందుకు తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ, సహాయ కార్యక్రమాలను చేపట్టింది. చేనేత కార్మికులకు నూలు, రంగులపై కేంద్ర ప్రభుత్వం కేవలం 10 శాతం సబ్సిడీ ఇచ్చి చేతులు దులుపుకొంటే, తెలంగాణ ప్రభుత్వం చేనేత మిత్ర పథకం కింద 40 శాతం సబ్సిడీ అందిస్తున్నది.

మైనారిటీల సంక్షేమం

సర్వమత సమభావన పునాదిగా అన్నివర్గాలలో విశ్వాసాన్ని నెలకొల్పుతూ, ఎవరిపట్లా వివక్షా, ఉపేక్షా లేకుండా తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ ఫలాలను సర్వజనులకూ అందిస్తున్నది. మైనారిటీల అభివద్ధి కోసం అనేక పథకాలను ప్రభుత్వం అమలు చేస్తున్నది. సమాజంలో అణగారిన వర్గాలతో పాటు అగ్రవర్ణాల పేదలకు కూడా ప్రభుత్వం అండగా నిలుస్తోంది. దేవాలయాలను నమ్ముకొనిజీవనం సాగిస్తున్న నిరుపేద బ్రాహ్మణులకు ధూపదీప నైవేద్యం పథకం ద్వారా ఆదుకుంటున్నది. దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆలయాలలో విధులు నిర్వహించే అర్చకులకు ప్రభుత్వ ఖజానా నుంచి నెలనెలా వేతనాలు అందిస్తున్నది.

ఒరిస్సా రైలు ప్రమాదం పట్ల కేంద్రం నిర్లక్ష్య వైఖరి

క్విట్ ఇండియా డే సందర్భంగా దేశవ్యాప్త ఉద్యమం

- అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్



న్యూఢిల్లీ : ఒరిశా రైలు ప్రమాదం తర్వాత కూడా కేంద్రం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తు న్నదని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యూయూ) జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ విమర్శించారు. తెలంగాణ, ఏపీ భవన్‌లో మీడియాతో బి.వెంకట్ గురువారం మాట్లాడారు. కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదంలో మృతిచెందినవారిలో అత్యధికమంది జనరల్ బోగీల్లో వున్న పేదలు, కార్మికులు, కూలీలేనని తెలిపారు. వారిలోనూ వలస కార్మికులే అధికమని చెప్పారు. అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న కష్టజీవులు మరణిస్తే కేంద్రం కనికరం లేకుండా వ్యవహరి స్తున్నదనీ, వారి శ్రమతో వస్తున్న సంపద మీద ఉన్న ప్రేమ, వారి ప్రాణాలపై లేదని విమర్శించారు. సాధారణ ప్రజలు ఎక్కే రైళ్లను కుదిస్తూ సంపన్నులకు అనుకూలమైన రైళ్లను కేంద్రం ప్రారంభిస్తున్నదని విమర్శించారు. జనరల్ బోగీలను కుదించి ఏసీ బోగీలను ఏర్పాటుచేస్తున్నారని, రైల్వే వ్యవస్థను మోడీ ప్రభుత్వం ఉన్నత వర్గాల వారి కోసం మార్చేసిందని విమర్శించారు. రైలు ప్రమాదంలో చనిపోయిన వారికి రూ.10 లక్షల పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలు పెంచాలనీ, కరోనా అనంతరం రద్దు చేసిన సాధారణ ప్రజలు ఎక్కే పాసింజర్ రైళ్లను తిరిగి ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను పరిష్కరించాలని రైల్వే బోర్డు అధికారులను వ్యవసాయ కార్మిక సంఘాల బృందం కలిసే ప్రయత్నం చేస్తున్నదని తెలిపారు.

గత 50 రోజులుగా రెజ్లర్లు చేస్తున్న ఆందోళనను విస్మరించి దోషులకు అండగా నిలిచిన మోడీ ప్రభుత్వం చర్యలను వ్యవసాయ కార్మిక సంఘం తీవ్రంగా ఖండిస్తున్నదని అన్నారు.

కేంద్రం ప్రకటించిన ఎంఎస్‌పీ రైతులకు ఉపయోగకరంగా లేదు

స్వామినాథన్ కమిషన్ సిఫారసులకు అనుగు ణంగా రైతుల పంటలకు ఎంఎస్‌పీకి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయాన్ని ప్రయివేటీకరించేలా మోడీ ప్రభుత్వం కార్పొరేట్లు, కంపెనీలకు అనుకూలంగా వ్యవహరిస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై జాతీయ స్థాయిలో వ్యవసాయ కార్మిక సంఘం క్విట్ ఇండియా డే సందర్భంగా దేశవ్యాప్త ప్రచార ఉద్యమం నిర్వహిస్తుందని తెలిపారు.

అమలుకాని హామీలపై సమాధానాలు ఇవ్వండి

మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



నవతెలంగాణ-మిర్యాలగూడ

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు కాని విషయంపై దశాబ్ది ఉత్సవాల్లో ప్రజలకు సమాధానం చెప్పాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణ కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారని, అభివృద్ధి సంక్షేమం గురించి వివరిస్తూ గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. కానీ, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదని, వాటి విషయంపై ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తయ్యాయని చెబుతున్నారు కానీ.. పాలమూరు- రంగారెడ్డి, డిండి, ఉదయ సముద్రం, ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రాజెక్టుల పనులు పూర్తి కాలేదని చెప్పారు. ఈ పనుల పూర్తికి నిధులు మంజూరు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. నిధుల విడుదలలో జాప్యం చేయడంతోపాటు వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి కాలేదని చెప్పారు. లిఫ్టులు మరమ్మతులకు నోచుకోక శిథిలావస్థకు చేరుకుంటున్నాయని వాపోయారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అనేక ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఏకకాలంలో రుణమాఫీ అమలు చేసి రైతుల కష్టాలను తీర్చాలన్నారు.

పోడు భూముల సమస్యలను పరిష్కరించి సాగు చేస్తున్న ప్రతి రైతుకూ పట్టాలు ఇవ్వాలని కోరారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, మూడెకరాల భూ పంపిణీపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు నూకల జగదీష్ చంద్ర తదితరులు ఉన్నారు.

రైలు ప్రమాదాల నివారణలో బీజేపీ ప్రభుత్వం విఫలం

సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు



నవతెలంగాణ -ఆలేరుటౌన్

రైలు ప్రమాదాలను నివారించడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని, రైల్వే శాఖ నిర్లక్ష్యం కారణంగా ఒడిషా రాష్ట్రంలో జరిగిన ఘోర రైలు ప్రమాదానికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో గురువారం విలేకర్ల సమావేశంలో చెరుపల్లి మాట్లాడారు. రైలు ప్రమాదంలో వందలాది మంది ప్రయాణికులు ప్రాణం కోల్పోయారని ఆందోళన వ్యక్తం చేశారు. రైల్వేలలో ప్రయాణికుల రక్షణను కేంద్ర ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. రైల్వే వ్యవస్థలో మూడు లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. వాటిని భర్తీ చేయకుండా తాత్సారం చేయడం వల్ల ప్రజల ప్రాణాలు గాలిలో పెట్టిన దీపాలుగా మారుతున్నాయన్నారు. తొమ్మిదేండ్ల బీజేపీ పాలనలో మహిళలు, పేదల పట్ల నిర్లక్ష్యం కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

బీజేపీ ఎంపీ, రెజ్లింగ్ ఫెడరేషన్ చైర్మెన్ బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్ లైంగిక వేధింపులకు గురిచేశారని, అతన్ని అరెస్టు చేసి తమకు న్యాయం చేయాలని ఢిల్లీ నడివీధిలో మూడు నెలలుగా మహిళా రెజ్లర్లు ఆందోళన చేస్తున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. పైగా ఉద్యమాలను అణచి వేసేందుకు పోలీసుల చేత దాడులు చేయిస్తోందన్నారు. మహిళలపై లైంగికదాడులకు పాల్పడుతున్న బ్రిజ్ భూషణ్‌లాంటి కీచకులను బీజేపీ వెనుకేసుకొస్తోందని విమర్శించారు. దేశ ప్రజాతంత్ర శక్తులందరూ ఏకమై రెజ్లర్ల పోరాటానికి మద్దతుగా నిలవాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్ తదితరులు ఉన్నారు.

తెలంగాణ నర్సులకు ప్రతిష్టాత్మక అవార్డులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రానికి చెందిన పలువురు నర్సులు 'నేషనల్ ఫ్లోరెన్స్ నైటింగేల్ నర్సెస్ అవార్డు -2023'ను అందుకున్నారు. ది నేషనల్ ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, ది న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ఆఫ్ కర్ణాటక సంయుక్తాధ్వర్యంలో బెంగుళూరులో నిర్వహించిన అంతర్జాతీయ నర్సుల దినోత్సవంలో ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ పురస్కారాలను అందజేశారు. బాన్సువాడ ఏరియా హాస్పిటల్ హెడ్ నర్స్ ఆరోగ్య జ్యోతి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని సామాజిక వైద్యశాల స్టాఫ్ నర్సు కట్కూరి రాణి, నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట ఏరియా వైద్యశాల స్టాఫ్ నర్స్ ఉపత్ ఉన్నీసా, కేర్ హాస్పిటల్ వైస్ ప్రెసిడెంట్, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ కల్నల్ సంజుల వర్మ , హైదరాబాద్ సెయింట్ థెరిసా హాస్పిటల్ సిస్టర్ సరిత మేరీ పురస్కారాలు అందుకున్నవారిలో ఉన్నారు. వ్యక్తిగతంగా చేసిన సేవా కార్యక్రమాల నిర్వహణ ద్వారా నర్సులను అవార్డులకు ఎంపికైనట్టు నిర్వాహకులు తెలిపారు.

12 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్ల డౌన్‌లోడ్‌కు అవకాశం

- 4.12 లక్షల మంది విద్యార్థుల హాజరు
- 933 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 12 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 20 వరకు ఈ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహిస్తామని వివరించారు. విద్యార్థులు ఎఎవ.ఎ్రస్త.స్రశీజ.ఱఅ అధికారిక వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశముందని పేర్కొన్నారు. కాలేజీల ప్రిన్సిపాళ్లు కూడా కాలేజీ లాగిన్ నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకుని విద్యార్థులకు ఇవ్వొచ్చని సూచించారు. హాల్‌టికెట్లలో విద్యార్థుల ఫొటో, సంతకం, పేరు, మాధ్యమం, హాజరయ్యే సబ్జెక్టులు సరిగ్గా ఉన్నాయో లేదో సరిచూసుకోవాలని కోరారు. వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లలో ప్రిన్సిపాళ్ల సంతకం లేకున్నా పరీక్షలు రాయించాలని చీఫ్ సూపరింటెండెంట్లను ఆదేశించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం నుంచి 2,70,583 మంది, ద్వితీయ సంవత్సరం నుంచి 1,41,742 మంది కలిపి మొత్తం 4,12,325 మంది హాజరవుతున్నారని వివరించారు. ఈ పరీక్షల నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 933 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు.

వర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి

ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల జేఏసీ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లోని జేఎన్టీయూహెచ్‌లో జరిగిన రాష్ట్ర సదస్సులో ఆయన మాట్లాడారు. కాంట్రాక్ట్ అధ్యాపకులు అనేక సంవత్సరాల నుంచి విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తూ ఎంతో మంది విద్యార్థుల్ని తీర్చిదిద్దారని తెలిపారు. అలాగే పరిశోధనలు చేశారని.. పేటెంట్లు కూడా కాంట్రాక్ట్ అధ్యాపకులకు ఉన్నాయని గుర్తు చేశారు. యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు హైలీ క్వాలిఫైడ్స్ కాబట్టి వారిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. జస్టిస్(రిటైర్డ్) చంద్రకుమార్ మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ అధ్యాపకులు అడిగే దాంట్లో న్యాయం ఉన్నది కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం వారి డిమాండ్‌ను తీర్చాలని కోరారు. ప్రొఫెసర్ మల్లేశం మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ అధ్యాపకులకు రెగ్యులర్ అధ్యాపకులు మద్దతు ఉందని చెప్పారు.

న్యాయవాది జీపీఎల్ మూర్తి మాట్లాడుతూ.. యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల రెగ్యులరైజేషన్ చట్టం ప్రకారం సాధ్యమే అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు డాక్టర్ ఎం.రామేశ్వరరావు, డాక్టర్ శ్రీధర్ కుమార్‌లోధ్, రేష్మరెడ్డి, దశరథం, రాజేష్ ఖన్నా , కరుణాకర్ రెడ్డి, మధుశ్ర తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

నాడు పైప్ లైన్ నేడు డామ్ గండి

గత పక్షం రోజులుగా జరుగుతున్న పరిణామాలను చూసినప్పుడు ఉక్రెయిన్ సంక్షోభం కొత్త మలుపు తిరిగినట్లే కనిపిస్తోంది. ఉక్రెయిన్ వైపు నుంచి సరిహద్దులో రష్యా ప్రాంతంపై జరుపుతున్న డ్రోన్, ఫిరంగి దాడులు కొనసాగుతున్నాయి. ఈక్రమంలోనే ఒక నదిపై ఉన్న డామ్‌కు పడిన గండి అనుమానాలను ధృవీకరించేదిగా ఉంది. దీని గురించి భద్రతా మండలి అత్యవసర సమావేశం జరిపి ఆందోళన వెల్లడించింది. వరద బాధితుల

> స్వీడన్, డెన్మార్క్, జర్మనీ ఈ ఉదంతంపై ఇప్పటికే విచారణ జరుపుతున్నందున కొత్తగా ఐరాస జరపాల్సిన అవసరం లేదంటూ తరువాత ఐరాసతో పాటు అమెరికా విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మూడు దేశాలు కూడా ఉక్రెయిన్ సంక్షోభంలో దాన్ని సమర్థిస్తూ రష్యాను వ్యతిరేకించేవే అన్నది గమనించాలి. ఈ పూర్వరంగంలో వాటితో పాటు ఐరాస విచారణ కూడా జరిగి వివరాలను వెల్లడిస్తే వాటికి సాధికారత ఉంటుంది, ఆమోదించటానికి ప్రపంచ దేశాలకు సులభం అవుతుంది. అయినా అమెరికా, ఇతర దేశాలకు అంత భయమెందుకు?

కోసం ఐరాస, రెడ్ క్రాస్ ముందుకు రాలేదని జెలెన్‌స్కీ ఆరోపించాడు. ఈ ఉదంతం మరో నోర్డ్‌స్టీమ్ విద్రోహం అని కొందరు వర్ణించారు. పుతిన్ సేనల అదుపులో సగం, ఉక్రెయిన్ దళాల ఆధీనంలో మరో సగం ఉన్న ఖేర్సన్ నగరం, పరిసరాల్లో ఉన్న నోవా కఖోవా డామ్‌కు ఈనెల ఆరున పడిన గండి ఆ నగరంతో పాటు ఇతర ప్రాంతాలను ముంచెత్తింది. ఆరువందల చదరపు కిలోమీటర్ల ప్రాంతంలో నీరు ప్రవేశించి వేలాది మంది నిర్వాసితులు కాగా పది మంది వరకు మరణించినట్లు వార్తలు. దేశంలోని అతి పెద్ద ఈ రిజర్వాయర్ నుంచి పద్దెనిమిది అడుగుల వరద పారింది. దీంతో ఉక్రెయిన్‌లోని అనేక ప్రాంతాలకు మంచి నీటి సరఫరా నిలిచిపోయింది. ఈ రిజర్వాయర్ నుంచే రష్యన్‌లు అదుపులో ఉన్న ఐరోపాలోని అతి పెద్దదైన జపోరిఝియా అణువిద్యుత్ కేంద్రంలోని విభాగాలను చల్లబరిచేందుకు అవసరమైన నీటి సరఫరా జరుగుతుంది. డామ్‌కు గండిపడటంతో ఇప్పుడు దాని భద్రతకు ముప్పు ఏర్పడినట్లు భావిస్తున్నారు. గండి దానంతట అదే పడిందా లేక ఎవరైనా కావాలని గండి కొట్టారా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఉక్రెయిన్ ఈ దుండగానికి పాల్పడి తమ మీద నెపం మోపేందుకు పూనుకుందని రష్యా చెబుతున్నది. కాదు తమ మీద దాడుల్లో భాగంగా పుతిన్ సేనలే గండి కొట్టినట్లు ఉక్రెయిన్ ఆరోపించింది. మొత్తం మీద రెండు దేశాల అదుపులో ఉన్న జనం ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడైనా గండ్లు పడితే అవి ఆకస్మికంగా జరగవు. కనుక ఇది విద్రోహం తప్ప మరొకటి కాదన్నది స్పష్టం. క్రిమియా వంతెన పేల్చివేతతో తమకు సంబంధం లేదని బుకాయించిన ఉక్రెయిన్ అనేక నెలల తరువాత తమ ప్రమేయంతోనే జరిగినట్లు అంగీకరించింది.



గతేడాది ఫిబ్రవరిలో మొదలైన రష్యా సైనిక చర్య 470రోజులో ప్రవేశించింది. ఎప్పుడేం జరుగుతుందో ఏ దళాలు ఏ రూపంలో విరుచుకుపడతాయో అన్నట్లుగా పరిస్థితి ఉండగా డామ్‌కు గండిపడింది. సరిగ్గా ఇది జరిగినప్పుడే అమెరికా పత్రిక వాషింగ్టన్ పోస్టు రాసిన ఒక కథనంలో గతేడాది రష్యా నుంచి ఐరోపా దేశాలకు గ్యాస్, చమురు సరఫరా చేసే నోర్డ్ స్ట్రీమ్ పైప్‌లైన్ల విధ్వంసం వెనుక ఉక్రెయిన్ హస్తం ఉందని పేర్కొన్నది. ఉక్రెయిన్ మిలిటరీ రూపొందించిన ఒక పథకం ప్రకారమే జరిగినట్లు అమెరికన్లు జర్మనీ, ఇతర ఐరోపా దేశాలకు తెలిపారని ఆ పత్రిక పేర్కొన్నది. నిజానికి వాస్తవాలు అమెరికన్లకు తెలియవంటే ఎవరూ నమ్మరు. వెల్లడి కాకూడనే లక్ష్యంతోనే పైప్‌లైన్ల విధ్వంసం గురించి దర్యాప్తు జరపాలని మార్చి నెలాఖరులో రష్యా భద్రతా మండలిలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని అమెరికా అడ్డుకుంది. ఒక స్వతంత్ర అంతర్జాతీయ దర్యాప్తు జరపాలని రష్యా, చైనా, బ్రెజిల్ ఓటు చేశాయి, అమెరికాతో సహా పన్నెండు దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉండటంతో నిష్ఫలమైంది. చిత్రం ఏమిటంటే ఈ దేశాలలో కొన్ని పైప్‌లైన్ విద్రోహ చర్యను ఖండించాయి. నిజాల నిగ్గు తేల్చాలని బల్లగుద్ది మరీ వాదించాయి. ఐరాస తరఫున విచారణ జరపాలన్న డిమాండ్ దగ్గరకు వచ్చే సరికి తోక ముడిచాయి. స్వీడన్, డెన్మార్క్, జర్మనీ ఈ ఉదంతంపై ఇప్పటికే విచారణ జరుపుతున్నందున కొత్తగా ఐరాస జరపాల్సిన అవసరం లేదంటూ తరువాత ఐరాసతో పాటు అమెరికా విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మూడు దేశాలు కూడా ఉక్రెయిన్ సంక్షోభంలో దాన్ని సమర్థిస్తూ రష్యాను వ్యతిరేకించేవే అన్నది గమనించాలి. ఈ పూర్వరంగంలో వాటితో పాటు ఐరాస విచారణ కూడా జరిగి వివరాలను వెల్లడిస్తే వాటికి సాధికారత ఉంటుంది, ఆమోదించటానికి ప్రపంచ దేశాలకు సులభం అవుతుంది. అయినా అమెరికా, ఇతర దేశాలకు అంత భయమెందుకు? ఐరాస విచారణను అడ్డుకోవటం అంటే దేన్నో దాచేందుకు లేదా దోషులను కాపాడేందుకు చూస్తున్నారన్న సందేహాలు తలెత్తుతున్నాయి. ఇది ద్వంద్వ ప్రమాణం తప్ప మరొకటి కాదు. పైప్‌లైన్ విచారణనే అడ్డుకున్న వారు డామ్ గండి విద్రోహం గురించి నిజాల నిగ్గుతేల్చేందుకు అంగీకరిస్తారా?

సింగోల్ : రాజ్యాంగం మీద సర్జికల్ స్ట్రైక్!

అన్ని విషయాలలో వివాదాస్పదమవుతున్న ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు నూతన భవన ప్రారంభోత్సవ విషయంలోనూ విమర్శలకు గురైంది. ముఖ్యమైన ప్రతిపక్ష పార్టీలన్నీ ఆ కార్యక్రమాన్ని బహిష్కరించాయి. పరువు కాపాడుకునే ప్రయత్నంలో కేంద్ర హోంమంత్రి విలేకరులకు సింగోల్ విషయం వెల్లడించారు. ఎవరికీ తెలియని ఒక అప్రధానమైన సింగోల్‌ను ఎందుకు తెరమీదికి తెచ్చారూ? అంటే... నూతన పార్లమెంటు ప్రారంభోత్సవ వివాదాన్ని కప్పిపుచ్చుకోవడానికి! నూతన పార్లమెంటు భవనానికి ప్రధాని శంఖుస్థాపన చేసినప్పుడే దేశం భగ్గుమంది. అశోక చక్రంపై నిర్మించిన కొత్త సింహాలు రౌద్రంగా ఉన్నాయన్న విమర్శలొచ్చాయి. ఇప్పుడు మళ్ళీ ఆ భవన ప్రారంభోత్సవం కూడా ఆయనే చేయడం వల్ల విపక్షాలే కాదు, దేశ ప్రజలు సైతం కినుక వహించారు. ఎందుకంటే పార్లమెంటు వ్యవస్థలో మొదటిస్థానం దేశాధ్యక్షులది. తర్వాత రాజ్యసభది. ఆ తర్వాత లోక్‌సభది. ఆ వరుసక్రమంలో లోక్‌సభ నాయకుడిగా ప్రధానిది మూడోస్థానం. మొదటివారిని వదిలేసి, మూడోస్థానంలో ఉన్నవారు ప్రారంభించడం ఏమిటని విపక్షాలు నిరసన తెలియజేశాయి. మొత్తానికి మొత్తంగా కార్యక్రమాన్నే బహిష్కరించాయి.

దేశాధ్యక్షులంటే సుప్రీం కమాండర్ ఆఫ్ ద ఆర్మ్‌డ్ ఫోర్సెస్ – సైన్యాధినేత ఎవరో వారే దేశాధినేత అవుతారు. పార్లమెంటులో ఉభయ సభల్ని ఉద్దేశించి ప్రసంగించేది కూడా దేశాధ్యక్షులే. ఇక్కడ లింగభేదం ఉండదు. అధ్యక్ష స్థానంలో ఉన్నది గిరిజన మహిళనా? భర్తలేని మహిళనా అని చూడగూడదు. మత మౌఢ్య వ్యవస్థలో మాత్రమే అధ్యక్షులవారిది ఏ కులం? ఏమతం? భర్త లేదా భార్య జీవించి ఉన్నారా లేదా – అనేవి చూసుకుంటారేమోగానీ, ప్రజాస్వామ్య వ్యవస్థలో వాటిని పక్కన పెట్టాల్సిందే! భారత రాజ్యాంగ స్థానంలో మనువాదాన్ని ప్రతిష్ఠించాలని కలలు కంటున్న ఆరెస్సెస్–బీజేపీ వారి విధానాలు ఈ విధంగా అస్తవ్యస్తంగానే ఉంటాయి. మనువాదులు ఏర్పరిచిన నిచ్చెనమెట్ల కుల సంస్కృతి ప్రకారం ప్రస్తుత ప్రధాని అగ్రవర్ణంవాడు కాదు. పూజలకు అతను ఎలా పనికొచ్చాడూ? పైగా హిందూ ధర్మం ప్రకారం ఏ పూజలైనా సతీసమేతంగా చేయాలి. మరి ఈ ప్రధాని అలా చేయలేదు కదా? వారి ధర్మం ప్రకారం ఒంటిగా చేసిన పూజలు, సాష్టాంగ ప్రమాణాలు అన్నీ మంచి ఫలితాలనిస్తాయా? ఇవి సామాన్యుల అనుమానాలు...

మనది ప్రజాస్వామ్య దేశం గనుక, అన్ని మతాలకూ సమానమైన విలువ నివ్వాలి. అలాంటప్పుడు ఏ ఒక్క మతానుసారం హోమాలు, పూజలు ఎలా నిర్వహిస్తారూ? ఛార్టెడ్ ప్లేన్ పంపి తమిళనాడులోని ఆధీనం మఠానికి చెందిన సాధువులను ఢిల్లీకి పిలిపించుకున్నారు కదా? మరి ఇతర మతాల ప్రతినిధుల్ని నామమాత్రంగానైనా పిలవలేదే? అసలైతే ప్రజాస్వామ్య వ్యవస్థలో మతాల్ని మత సంబంధమైన పూజాకార్యక్రమాల్ని పక్కనపెట్టి, వాటికి అతీతంగా వ్యవహరించాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం ఆ విషయాన్ని అతిక్రమించింది. సింగోల్ అంటే రాజదండం అనీ, అది తన చేతికి వచ్చింది గనుక, తనకు పట్టాభిషేకం జరిగిందనీ... ఇక అధికారమంతా తనదే అని ప్రధాని భావిస్తూ ఉండొచ్చు. ఒకప్పుడు నెహ్రూ చేతిలో ఉన్న రాజదండం ఈ రోజు తన చేతిలో కొచ్చిందని సంబరపడుతూ ఉండొచ్చు. అసలు విషయమేమంటే, ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజదండానికి గానీ, రాచరికానికి గాని ఎలాంటి విలువా లేదు... ఉండదు!




డాక్టర్ దేవరాజు మహారాజు

చాలా శ్రద్ధగా గమనించాల్సిన విషయం ఒకటుంది. అలహాబాదు మ్యూజియంలో అప్పుడు పనిచేసిన క్యూరేటర్ ఓంకార్ ఆనందరావు వాంఖేడే చెప్పిన దాని ప్రకారం అది "పండిట్ జవహర్‌లాల్ నెహ్రూకు బహుమతిగా వచ్చిన ఒక బంగారు చేతికర్ర" మాత్రమే. నెహ్రూ తన వస్తువుల్ని మ్యూజియంకు బహూకరించినప్పటి నుండి అంటే 1952 నుండి అది అక్కడే అలహాబాదు మ్యూజియంలో ఉంది. ఇప్పుడు అక్కడ ఉన్నది ఆధీనం మఠంవారిచ్చిన సింగోల్‌కు ప్రతిరూపం. ఒరిజనల్ సింగోల్, ఢిల్లీ నేషనల్ మ్యూజియంలో ఉంది. నెహ్రూజీ దాన్ని తన స్వంత ఆస్తిగా దాచుకున్నాడని అధికార పార్టీవారు చెప్పడం అబద్ధం. ఎందుకంటే ఆ ఒరిజినల్ సింగోల్‌నే ఢిల్లీ నేషనల్ మ్యూజియం నుండి తెప్పించి మోడీగారు పూజలు చేసి కొత్త పార్లమెంట్‌లో ప్రతిష్ఠించారు.

ఏది ఏమైనా ప్రొఫెసర్ మాధవన్ కె. పలట్ చెప్పిన విషయం ఈ దేశ ప్రజలు నమ్మితీరాలి. ఆయన చరిత్ర పరిశోధకుడు మాత్రమే కాక, ఎన్నిక చేసిన నెహ్రూ రచనలకు (సెలెక్టెడ్ వర్క్స్ ఆఫ్ జవహర్‌లాల్ నెహ్రూ) సంపాదకుడు.

> అధికార మార్పిడికి చిహ్నంగా సింగోల్‌ను నెహ్రూ స్వీకరించలేదు. అధికార మార్పిడి అంటే బ్రిటిష్ రాజు ఛార్లెస్-6 నుండి నాటి తొలి భారత రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్‌ల మధ్య జరగాలి. కానీ జరగలేదు. ప్రజాస్వామ్యంలో దేశాధ్యక్షుడే దేశానికి అధిపతి. ప్రధాని కాదు. అది నెహ్రూ సమయంలోనైనా లేక ఇప్పుడు మోడీ సమయంలోనైనా పద్ధతి పద్ధతే. అలా జరగనప్పుడు దానికి ఏ విలువూ ఉండదు. కాంగ్రెస్ నుండి తాము అధికారం హస్తగతం చేసుకున్నామని ఆరెస్సెస్ - బీజేపీలు సంబరాలు చేసుకుంటే చేసుకోవచ్చు.



అంతే కాదు, నెహ్రూ మెమోరియల్ ఫండ్‌కు ట్రస్టీ కూడా! "సింగోల్ మౌంట్ బాటెన్‌కు అందించి, మళ్ళీ తీసుకొచ్చి నెహ్రూకు ఇచ్చారనడం శుద్ధ అబద్ధం! అందుకు ఏ ఆధారమూ లేదు" అని ప్రొఫెసర్ మాధవన్ కె. పలట్ కొట్టిపడేశారు. ఇవన్నీ కేంద్ర గృహమంత్రిత్వశాఖ అల్లిన తప్పుడు కథలని ఆయన కరన్ థాపర్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తేల్చిచెప్పారు. అలహాబాదులోని ఆనందనిలయం నెహ్రూ కుటుంబీకుల స్వంత ఆస్తి. కాలక్రమంలో అది మ్యూజియం అయ్యింది. నెహ్రూ వస్తువులు, వచ్చిన బహుమతులు అన్నీ అందులో భద్రపరిచారు. ఇందిరాగాంధీ వచ్చాక ఆనందనిలయాన్ని జాతికి అంకితం చేశారు. అప్పటినుండి అది పబ్లిక్ ప్రాపర్టీ అయ్యింది. నేటి ప్రభుత్వ పెద్దలు నెహ్రూ విలువను తగ్గించడానికి అనేక ప్రయత్నాలు చేస్తున్నట్టే... ఈ విషయంలో కూడా చేశారు. నెహ్రూ కావాలని తన ఆధీనంలో ఉంచుకున్నాడనీ, తన చేతికర్ర అని చెప్పుకున్నాడనీ అభాండాలు వేస్తున్నారు.

అధికార మార్పిడికి చిహ్నంగా సింగోల్‌ను నెహ్రూ స్వీకరించలేదు. అధికార మార్పిడి అంటే బ్రిటిష్ రాజు ఛార్లెస్–6 నుండి నాటి తొలి భారత రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్‌ల మధ్య జరగాలి. కానీ జరగలేదు. ప్రజాస్వామ్యంలో దేశాధ్యక్షుడే దేశానికి అధిపతి. ప్రధాని కాదు. అది నెహ్రూ సమయంలోనైనా లేక ఇప్పుడు మోడీ సమయంలోనైనా పద్ధతి పద్ధతే. అలా జరగనప్పుడు దానికి ఏ విలువూ ఉండదు. కాంగ్రెస్ నుండి తాము అధికారం హస్తగతం చేసుకున్నామని ఆరెస్సెస్ – బీజేపీలు సంబరాలు చేసుకుంటే చేసుకోవచ్చు. నూతన పార్లమెంట్ భవనంలో హోమాలు, పూజలు, సాష్టాంగ ప్రమాణాలూ చేసి మనువాదం పట్ల తమ భక్తి ప్రపత్తులు చాటుకుంటే చాటుకోవచ్చు. అవన్నీ ఈ దేశ ప్రజల దృష్టిలో అప్రజాస్వామికమైనవి. రాజ్యాంగానికి విరుద్ధంగా ఒక మతానికి సంబంధించిన కార్యక్రమాలు జరిపించడం అసలు ఎవరూ హర్షించరు.

తిరువదుతిరై అధీనం మఠంవారు 14 ఆగస్టు 1947న నెహ్రూజీకి సింగోల్ బహూకరించినప్పుడు ఇందిరాగాంధీ, పద్మజానాయుడు ఇద్దరూ అక్కడే ఉన్నారు. ఒకవేళ అది అధికార మార్పిడికి చిహ్నం – అని అనుకుని ఉంటే, వారు ఎన్నో చోట్ల, ఎన్నోసార్లు దాని గురించి మాట్లాడేవారు, రాసేవారు. వారు ఆ పని చేయలేదు. చరిత్రకారులెవరూ ఆ సంఘటనకు ప్రాధాన్యమివ్వలేదు. అదీగాక సి. రాజగోపాలాచారి (రాజాజీ) మనుమడు రాజమోహన్‌గాంధీ ఎప్పుడూ ఎక్కడా సింగోల్ గురించి రాయలేదు. ఎందుకంటే ఆయన రాజాజీ మనుమడు మాత్రమే కాదు. ప్రసిద్ధ చరిత్ర కారుడు. అంత ప్రాముఖ్యమున్న విషయమైతే ఆయన ఆ విషయాన్ని ఎందుకు వదిలేస్తారూ? గోపాల్‌కృష్ణ గాంధీ అయితే అసలు ఆ విషయమే తనకు తెలియదన్నాడు. ఈ సోదరులు పార్లమెంట్ వ్యవస్థలో ఉన్నవారు. ఇటు రాజాజీ అటు గాంధీజీ కుటుంబాలకు చెందినవారు. వారెందుకు అధికార మార్పిడికి చిహ్నం అయిన సింగోల్ ప్రసక్తి ఎక్కడా తీసుకురాలేదూ? అంటే ఇది నేటి కేంద్ర హోమ్ మినిష్టర్ వండి వార్చిన అబద్ధాల వంటకం అని తేలిపోయింది. ఈ వాస్తవాలన్నీ తెలిశాక కేంద్ర గృహమంత్రి మాటల్లో నిజమెంతో తేటతెల్లమయ్యింది.

1. అలహాబాదు మ్యూజియంలో ఉన్నది ఒరిజనల్ సింగోల్ కాదు. దాని ప్రతిరూపం మాత్రమే! ఒరిజినల్ సింగోల్ ఢిల్లీ నేషనల్ మ్యూజియంలో ఉంది. దాన్ని నెహ్రూ తన స్వంత ఆస్తిగా దాచిపెట్టుకోలేదు.

2. అది తన బంగారు చేతికర్ర అని ఎప్పుడూ ఎక్కడా చెప్పుకోలేదు.

3. అధికార మార్పిడి జరిగినప్పుడు స్వీకరించింది అని చెప్పడానికి వీలేలేదు. నెహ్రూజీకి అందిన ఎన్నో బహుమతులలో ఇది ఒకటి!

4. ఇప్పుడు అధికారం ఎవరి నుండి ఎవరికి మారిందనీ? బీజేపీ–మోడీ ప్రభుత్వం గత తొమ్మిదేండ్లుగా అధికారంలోనే ఉంది. ఇదంతా వృధా ప్రయాస.

5. పెరిగిన ధరలు, నిరుద్యోగం, బ్యాంకు దోపిడీ గాళ్ళు, ప్రయివేటుకు పెద్దపీట, మహిళా రెజిలర్ల లైంగిక హింస, పతనమైన రూపాయి విలువ, ఆకలిసూచి, కనీవినీ ఎరుగని రైలు ప్రమాదాలు వంటి ఎన్నెన్నో అంశాల నుండి దేశ ప్రజల దృష్టి మరల్చడానికి – మ్యూజియంలో ఓ మూలపడి ఉన్న వస్తువును తెచ్చి ఈ ప్రభుత్వ పెద్దలు సంచలన వ్యాఖ్యలు చేశారన్నమాట.

6. గత ప్రభుత్వం ఏం చేసిందని మాటి మాటికి ప్రశ్నించే ఈ దేశ ప్రధాని ఇదిగో ఇలాంటి గొప్ప గొప్ప కార్యక్రమాలు చేసి చూపుతున్నారు.

ఆగస్టు 14, 1947 సాయంత్రం, గవర్నర్ జనరల్, చివరి వైస్రాయ్ అయిన మౌంట్ బాటెన్ – కరాచి నుండి ఢిల్లీ పాలం విమానాశ్రయంలో దిగాడు. ఆయన అప్పుడే పాకిస్థాన్ నుండి తిరిగివచ్చాడు. ఎందుకంటే, ఆ దేశానికి కూడా స్వాతంత్ర్యం వచ్చింది ఆరోజే. మళ్ళీ ఆ రోజు రాత్రి ఢిల్లీ పార్లమెంటులో ఉండాలి. అక్కడ రాత్రి 11.30కు నెహ్రూజీ తొలిసారి ప్రసంగించబోతున్నారు. అంతటి ముఖ్యమైన కార్యక్రమాలమధ్య ఆధీనం మఠం వారు మౌంట్ బాటెన్‌ను కలిసి సింగోల్ ఇచ్చారనడం వందశాతం అబద్ధం. వైస్రాయ్ అంటే మామూలు విషయం కాదు. ఏ నిముషానికి ఎవరు వచ్చి వెళ్ళారన్నది అంతా రికార్డు ఉంటుంది. ఆ సాయంత్రం తమిళనాడు మఠాధిపతులు మౌంట్ బాటెన్ దగ్గరికి వచ్చిన రికార్డేది లేదు. అదంతా ఇప్పటి ఈ గృహమంత్రి సృష్టించిన రికార్డు! అంతా గమనిస్తే, మరొక విషయం తోస్తుంది. అబద్ధాలతోనైనా... ఏదో విధంగా తమిళనాడులో నేటి స్టాలిన్ ప్రభుత్వాన్ని కదిలించాలన్న పథకాలు సిద్ధమవుతున్నాయేమో!

చివరగా ఇంకా ఒక ఆధారం ఉంది. డొమినిక్యు లిపిరి; లార్రి కొల్లిన్స్‌లు కలిసి ఇండియన్ ఇండిపెండెన్స్ మీద 'ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్' అనే ఒక పెద్ద గ్రంథం రచించారు. అందులో అసలు సింగోల్ ప్రసక్తే లేదు. అధికార మార్పిడికి సింగోల్ చిహ్నమైతే,ఆ రచయితలు దాని గురించి తప్పక రాసి ఉండేవారు కదా? 10–12 శతాబ్దాల నాటి చోళ రాజుల సింగోల్‌ను తవ్వితీసి ఈ 21వ శతాబ్దానికి తీసుకొచ్చారంటే ఏమనుకోవాలి? ఈ సింగోల్ – నేటి ప్రజాస్వామ్య వ్యవస్థ మీద ఒక 'సర్జికల్ స్ట్రైక్' అని అనుకోవాల్సి ఉంటుంది.

– వ్యాసకర్త: కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త.



'నయా కహాని'

ఏం బామ్మర్ది ఎలక్షన్ దగ్గర కొస్తున్నా కొద్ది మనిషివి కంటికి కనిపించకుండా పోతివి. ఏంది కథ ఏం నడుస్తుంది.

ఏముంది బావ పోయినసారి కంటే గీసారి ఇంకా ఎక్కువ సీట్లు గెలవనీంకె తిప్పలపడుతున్నాం.

ఖాళీగుంటే పార్టీ యూత్ ప్రెసిడెంట్ కుర్చీనుండి ఖాళీ చేయిస్తామంటున్నారే.

అందుకే ఇంగా బయట యాడ కనిపిస్తలేను.

అగో బావుంది గీ ముచ్చట. అవును గాని జరిగ్రా ఒక ముచ్చట చెప్పాలే నీకు.

ఏందీ బావ రేషన్, పింఛను గాని ఇస్తలేరా ఏందీ?

ఏ నువ్వుండగా నాకేం ఫికర్ కాని, మన బాయి కాడా పొలం దగ్గర మన శీనుగాడి అదే నీ దోస్తుది ఎనిమిది గుంటల భూమి ఉంది కదా అది నాపోంటి పట్టా చేపియరాదు. నేనిచ్చే ధరకెట్లా వాడు అమ్మడు. రాళ్ళు పాతి లొల్లి చేస్తా, ఎట్లా ఎమ్మెల్యే నీ మాట ఇంటడుకదా మళ్ళోచ్చే ఎలక్షన్స్ లా గీ ఛాయిస్ దొరుకుతదో లేదో... ఏమంటావ్?

ఏం మాట్లాడుతున్నావ్ బావ పోయినసారే స్కీమ్‌లా పేర్లతో మనం చేసింది పెద్ద తప్పు. నీకు కావాల్సినోల్లకే ఇప్పించుకున్నావ్ అని ఊరంతా గుసుగుతుంటే ఆ లొల్లి సరిపోదని మళ్ళా కొత్త లొల్లి తెచ్చి పెడ్తావ్. అయినా ఇది అసలే ఎలక్షన్లా టైమ్.

అందుకేరా బామ్మర్ది దొరికినప్పుడే దోసుకోవాలే అంటున్నా. వేడిగున్నప్పుడు అన్నం తింటేనే మంచిగుంటది.

నేను చెప్పేది సమజ్ అయ్యిందా. ఇప్పుడు నువ్వేది అడిగినా కాదనరు.

సర్లే చూద్దాం తీయ్. అవును గానీ వచ్చే ఎలక్షన్లా ఛాయిస్ ఉంటదో లేదో అంటున్నావేంది బావా కండువా ఏమైనా మార్చుకున్నావా ఏంది?... మార్చుకుంటే చెప్పు తీసుకున్నదంతా ఇచ్చేదువు గానీ.

సరే గీ ముచ్చట్లన్ని తర్వాత మాట్లడ్తా, పార్టీ మేనిఫెస్టో ప్రిపేర్ చేసుకోవాలే.

అందుకు ప్రజల అభిప్రాయం, అవసరాలు, సమస్యలు తెల్సుకోవడానికి పోతున్నా తర్వాత గలుస్తా...

జరగారదే... ఆ భూమి సంగతేమి తియ్యను గాని నిమళ్ళంగా కూసో.

గీదింత ముచ్చటకు ఎండలా పడి యాడంటా తిరుగుతావ్.

అవసరాలు, అభిప్రాయలు, సమస్యలని ఏవో పెద్ద పెద్ద మాటలు మాట్లాడపడితివి. మన ఇళ్ళకాల అంతా అభివృద్దే అని పేపర్లా, టివి లా గంతా పెద్దగా చూపిస్తుర్రు. న్యూస్ చూసేటట్టు లేవు గదా నువ్వు.

అది గాదు బావా ఇంక ఏమైనా సమస్యలు,

పాతవి ఇంకా ఇప్పటికి పూర్తికానివి ఇసోంటివి ఏమైనా ఉంటాయేమో అని.

ఓ గట్లనా సరే గాని ఒకవేళ మళ్ళా గెలిస్తే మొదట ఏం చేద్దాం అనుకుంటున్నారు. ఏముంది బావా రాష్ట్రన్నంతా లిక్కర్‌తో లీడ్ చేస్తున్నాం అన్నా సంగతి నీకు ఎరుకనే గదా! ఈ మేధావులు, పక్క పార్టీలు దుమ్మెత్తి పోస్తున్నారు. ప్రజలను తాగుబోతులను చేస్తున్నారు, రోగాల బారిన పడేస్తున్నారు అది ఇది అని తిడుతూ ఓర్వలేకపోతున్నారు. అదే లీడ్ చేసే లిక్కరు, లిస్టులో లీస్టకి పోతే అభివృద్ధికి అప్పులు చేయాల్సి ఒస్తదేమోనే....

ఓస్ గింతేనా... తాగి ఆరోగ్యం చెడిపోయినళ్ళకు ఆసుపత్రిలో ఫ్రీ ట్రీట్ మెంట్ కింద కొత్త స్కీమ్ బెట్టుర్రి. ఎట్లాగో ప్రజల సొమ్మును కాజేయటంలో ప్రావీణ్యులు కాబట్టి లిక్కర్ మీద ధర పెంచుండ్రి.

నరం లేని నాలుక ఆగుతాదా ఏందీ...

సలహా ఇస్తున్నట్లే అనిపిస్తున్నా తిట్టినట్టు వినిపిస్తుందేందీ బావా..

అరే నేను నిన్నెందుకు తిడ్తరా, చెప్పు ఇంకేమ్ చేద్దాం అనుకుంటున్నారు.

ఇంకేముంది బావా, జర పోరాగండ్లు గుస్సయితున్నట్టు కనిపిస్తున్నది ఏదో ఓ భృతి పేరుమీద సహాయం చేయాలే, అమ్మలక్కలకు ఏం కావాలో తెలుసుకోని ఆలోచించుకొని కొత్తగా ఏదైనా చేయాలి.

అట్లనా ఆ భృతితోనా స్థితిగతులేం మారావ్ గాని, జీవితాలను నిలబెట్టే పనులేమైనా ఉంటే చేయండి.

పొద్దుమూకే దాకా ఫోన్లనే ఉంటారని కొత్త తెలివితోనా నెల నెల రిచార్జులు, రిచార్జులకు లోన్లులిచ్చే హామిలుగిట్లా ఏమైనా ప్రిపేర్ చేస్తున్నరా ఏంది?

నెల జీతం కోసం జీవితం అంతా త్యాగం చేస్తుర్రు గాళ్ళ ఆశల మీద నీళ్ళు సల్లకుండ్రి...

ఏంది బావో... అన్ని తీసుకుంటూనే తిరుగుబాటు చేస్తున్నట్టున్నావ్...

ఏందీ కథ పక్క పార్టీలేమైనా కమీషన్ ఇస్తామన్నారా ఏందీ..?

ఏ ఊకోరా... అన్నింటిని తప్పుపట్టట్లే... రేపటి తరాన్ని నిలబెట్టేది మీరే గదరా ఉచిత పథకాల పేర్లతో ఊరిస్తే మీకు ఉపాదేట్లా, ఉన్నోడు ఉన్నోడుగానే వెనకేసుకుంటాడు గాని లేనోడేమైపోతాడేమో అని ఫికరు. ఏమైనా ప్రజల సమస్యలు శాశ్వతంగా పోగొట్టే పథకం తెస్తే ఈ తిప్పలన్నీ ఉండవుగా!

- పి.సుష్మ

గ్రామీణ ఉపాధి చట్టానికి ఉరేస్తున్న బీజేపీ

'తిండైనా పెట్టండి .పనైనా చూపండి' అనే డిమాండ్‌తో వామపక్షాలు దేశవ్యాప్తంగా చేసిన ప్రజా పోరాటాల ఫలితంగా యూపీఏ కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతంలో ప్రతి కుటుంబానికి వంద రోజుల పని గ్యారెంటీ చేస్తూ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చింది. నేడు 716 జిల్లాలు, 7168 బ్లాకులు/మండలాలు, 2,69,453 గ్రామ పంచాయతీలలో ఈ చట్టం అమలవుతున్నది. 90శాతం కేంద్ర ప్రభుత్వం, 10శాతం రాష్ట్ర ప్రభుత్వం కేటాయించే నిధులతో ఈ చట్టం ద్వారా ఉపాధి పనిని చూపాలి. ఇప్పటికే 32 కోట్ల మంది గ్రామీణ పేదలు దరఖాస్తు పెట్టుకొని ఉన్నారు. కానీ రెండోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం గ్రామీణ ప్రాంత భూస్వాములు, పెట్టుబడిదారుల ఒత్తిడి మేరకు ఈ చట్టం ప్రకారం పేదలకు పని కల్పించడానికి సిద్ధపడటం లేదు. చట్ట ప్రకారం దరఖాస్తు పెట్టుకున్న కూలీలకు పని కల్పించడం, చేసిన పనికి వేతనాలు చెల్లించడం, పనికి వచ్చిన కూలీలకు మస్టరు వేయడం, కొత్త పనులు ఎంపిక చేయడం, కొత్తగా జాబ్ కార్డులు ఇవ్వడం, పేర్లు మార్పులు చేర్పులు చేయడం వంటి అనేక అంశాలు రాష్ట్ర ప్రభుత్వం చేతిలో ఉన్నది. ఈ అధికారాలు అన్నింటిని కేంద్ర ప్రభుత్వం నేషనల్ మొబైల్ మానిటరింగ్ సర్వీస్ (ఎన్ఎంఎంఎస్) మొబైల్ యాప్ పేరుతో తన చేతిలోకి తీసుకున్నది. కూలీల జాబ్‌కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ మొబైల్ నెంబరు ఆన్‌లైన్ అనుసంధానం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు ఇచ్చింది. పని ప్రదేశంలో ఉదయం ఏడు గంటలకు, సాయంత్రం ఐదు గంటలకు కూలీల ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేస్తేనే చేసిన పనికి వేతనాలు ఇస్తామని నిబంధన విధించింది. ఇది చర్య రాజ్యాంగంలోని ఫెడరల్ వ్యవస్థ స్ఫూర్తికి వ్యతిరేకమైనది. గతంలో ఉన్న పనుల సంఖ్యను గురించి కేంద్ర ప్రభుత్వం చెప్పిన 20 పనులు మాత్రమే ఎంపిక చేయాలని నిర్దేశించింది. ఇంటర్నెట్ సర్వీస్, బ్యాంక్ అకౌంట్లు, ఆధార్ కార్డులు, ఫోన్ నెంబర్లులేని రిమోట్ ప్రాంతాలలో ఉన్న గ్రామాలు, ఆదివాసీ గిరిజన ప్రాంతాల ప్రజలు ప్రభుత్వం కల్పించే పనికి అనివార్యంగా దూరమయ్యే ప్రమాదం ఏర్పడింది. పని చేసిన దగ్గర కూలీల ఫొటోలు అప్‌లోడ్ చేసేటప్పుడు సిస్టంలో టెక్నికల్ సమస్యలు ఎదురై ఫొటో అప్‌లోడ్ కాకుంటే వేతనాలు ఆటోమేటిక్‌గా ఆగిపోతున్నాయి కూలీల వేతనాలు చెల్లించాలి అనే చట్టం డైరెక్షన్ దీని వల్ల అమలు కావడం లేదు నాలుగు వారాల నుండి పది వారాల వరకు కోట్లాది రూపాయల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ చర్య రాజ్యాంగంలోని ఫెడరల్ వ్యవస్థ స్ఫూర్తికి పూర్తిగా వ్యతిరేకమైనది. రాష్ట్రాల హక్కులను ప్రత్యక్షంగా హరించడమే.



బి. ప్రసాద్

కూలీలకు పని తగ్గించారు- కాంట్రాక్టర్లకు పెంచారు

గ్రామీణ ఉపాధి పనిలో చట్ట ప్రకారం యంత్రాలు వాడకూడదు. అన్‌స్కిల్ లేబర్‌కు మాత్రమే పని కల్పించాలి అని ఉన్న డైరెక్షన్ నాటి కాంగ్రెస్ నేడు మోడీ ప్రభుత్వాలు ప్రజాధనాన్ని గ్రామీణ ప్రాంత పేదలకు డైరెక్టుగా ఇవ్వడం తట్టుకోలేని గ్రామీణ భూస్వామ్య కాంట్రాక్టర్ల వత్తిడికి లొంగిపోయాయి. పదిశాతంగా ఉన్న మెటీరియల్ కాంపోనెంట్ నిధులను యూపీఏ కాంగ్రెస్ ప్రభుత్వం 22శాతానికి పెంచింది. మోడీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత దీనిని 49శాతానికి పెంచారు. దీనితో ప్రజలకు ఉపాధి కల్పించాలని లక్ష్యంతో కేటాయించిన నిధులలో అధిక భాగం సీసీ రోడ్లు, రైతు వేదికలు, కల్లాలు, వైకుంఠధామాలు, అంగన్‌వాడీ బిల్డింగులు, స్వచ్ఛ భారత్ బాత్రూముల నిర్మాణాలు వంటి కాంట్రాక్ట్ పనులకు నిధులను డైవర్ట్ చేసి కాంట్రాక్టర్ల జేబులు నింపుతున్నారు. విరివిగా యంత్రాలను వాడుతున్నారు. మరొకవైపు మోడీ ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులను భారీగా కోత విధిస్తూ వస్తున్నది. 2021–2022లో 98,467 లక్షల కోట్ల రూపాయలు ఉన్న బడ్జెట్ 2023–24 నాటికి 63,000 లక్షల కోట్లకు కుదించింది. ఫలితంగా దేశవ్యాప్తంగా 15కోట్ల 78లక్షల జాబ్ కార్డులలోని పేర్ల నమోదు చేసుకున్న 32కోట్ల మంది కూలీలు ఉంటే కేవలం 9.95కోట్ల జాబ్ కార్డులలోని 15.78కోట్ల మంది కూలీలకు మాత్రమే పని కల్పించినట్లుగా గత సంవత్సర ప్రభుత్వ రికార్డులు



చెబుతున్నాయి. అంటే 50శాతం మందికి కూడా కేంద్ర ప్రభుత్వం పని చూప లేకపోయింది. రాష్ట్రంలో కూడా ఇదే స్థితి నెలకొన్నది. 57.17లక్షల జాబు కార్డులలో కోటి 20లక్షల మందికి పైగా పని కోసం పేర్లు నమోదు చేసుకొని ఉంటే కేవలం 36.73లక్షల జాబ్ కార్డుల లోని 65లక్షల మందికి మాత్రమే పని చూపినట్లుగా రికార్డులు చెబుతున్నాయి. పని చేయడానికి సిద్ధంగా ఉన్న పేదలందరికీ పని కల్పించుటలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలం అవుతున్నాయి. పని కావాలని అడిగిన ప్రతి ఒక్కరికి పని కల్పించాలి అనే చట్టం డైరెక్షన్‌ను అమలు చేయకుండా ప్రభుత్వాలు ఉల్లం ఘిస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం బడ్జెట్‌లో నిధులు కోత విధించడమే.

అమలు కానీ కనీస వేతనం - కనపడని కనీస సౌకర్యాలు

నిత్యావసర సరుకుల ధరలు, ద్రవ్యోల్బణం పెరుగుదల కనుగుణంగా కనీస వేతనాలను కేంద్ర ప్రభుత్వం పెంచడం లేదు. గత సంవత్సరం రోజు కూలీ 245 ఉన్నదాన్ని రూ.272కు పెంచింది. ఇది కూడా మన రాష్ట్రంలో ఎక్కడ అమలు కావడం లేదు. మీటరు లోతు, మూడు మీటర్లు వెడల్పు, పొడవు క్యూబిక్ మీటర్లు తవ్వితేనే చట్ట ప్రకారం వేతనాలు వస్తాయని అధికారులు చెబుతున్నారు. ఆచరణలో దొంగ కొలతలు వేసి వేతనాల్లో భారీకోత విధిస్తున్నారు. రాష్ట్ర అధికారులు చెప్పే లెక్కల ప్రకారం కనీస వేతనం యావరేజ్ కూలీ రూ.125 దాటడం లేదు. విడివిడిగా పరిశీలన చేస్తే కూలి పొందుతున్న వారే అధికంగా ఉన్నారు. మార్చి, ఏప్రిల్, మే, జూన్ నెలల్లో 20 నుండి 60శాతం వరకు కనీస వేతనానికి అదనంగా ఇచ్చే సమ్మర్ అలవెన్స్, ఐదు కిలోమీటర్ల వరకు పని ప్రదేశానికి వెళ్లి రావడానికి ఇచ్చే లోకల్ ఆటో చార్జీలు, గడ్డపార సాన పట్టుకోడానికి ఇచ్చే చార్జీలను ప్రభుత్వం ఎత్తివేసింది. అర కొరగా పడే కూలి రోజువారి ఖర్చులకు సరిపోక పోగా అదనంగా కూలీలు తమ జేబులో నుండి పెట్టుబడి పెట్టుకుంటే తప్ప ఉపాధి పని చేసే అవకాశం లేదు. మరొకవైపు చట్ట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం కల్పించాల్సిన నీడకు టెంట్, తాగడానికి మంచినీళ్లు, ఏదైనా ప్రమాదాలు జరిగితే ప్రథమ చికిత్సకు మెడికల్ కిట్టు, చిన్నపిల్లల సంరక్షణకు ఆయాను ఉంచాల్సిన పద్ధతిని అమలు చేయడం లేదు. ప్రతి సంవత్సరం దంపతులకు పార, గడ్డపార, తట్ట, కొడవలి, గొడ్డలి వంటి పనిముట్లను ఇవ్వడం ఆపేశారు. వారం వారం పేమెంట్, పేస్లిప్ ఇవ్వడం కనుమరుగయ్యాయి. ఎంత కూలీ పడుతుంది. డబ్బులెప్పుడు వస్తాయి అనేది కూలీలకు తెలియకుండా అయిపోయింది. గత సంవత్సరం చేసిన పనికి నేటికీ అమౌంట్ రాక ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక కూలీలు ఇబ్బంది పడుతు న్నారు. వాస్తవ పరిస్థితి ఇలా ఉంటే గ్రామాల్లో కూలీలు పనికి దొరకడం లేదని, కూలీ రేట్లు పెరుగుదల రైతు వ్యవసాయ పెట్టుబడికి భారంగా మారిందని భూస్వాములు గగ్గోలు పెడు తున్నారు. ఉపాధి పనులను వ్యవసా యానికి అనుసంధానం చేయాలని భూస్వాముల వాదనను రాష్ట్ర ప్రభుత్వం భుజాన వేసుకోవడం అర్థరహితమైనది.

వామపక్ష ప్రభుత్వాల మాదిరి 'పట్టణ ఉపాధి' పెట్టాలి

అధికారంలో ఉన్న పాలకులు తమ అవసరాల కోసం గ్రామీణ ప్రాంతాలను పట్టణాల్లో విలీనం చేయడం వలన గ్రామీణ ఉపాధి హామీ పనికి దూరం అవుతున్నారు తెలంగాణ రాష్ట్రంలో 702 గ్రామాలను పట్టణ ప్రాంతాల్లో విలీనం చేయడం వలన సుమారుగా మూడు లక్షల మంది కూలీలు ఉపాధి పనికి దూరమయ్యారు. దేశంలో పట్టణ ప్రాంతాలలో పేదలకు ఉపాధి పని అమలు చేస్తున్న రాష్ట్రాల వివరాలు కావాలని సీపీఐ(ఎం) ఎంపీ శివదాసన్ రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర పట్టణ సహాయం మంత్రి కౌసిల్ కిషోర్ రాతపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో వామపక్షాలు అధికారంలో ఉన్న కేరళలో కేరళ అయంకాలి పట్టణ ఉపాధి కార్యక్రమం - 2010, త్రిపుర పట్టణ ఉపాధి కార్యక్రమం-2009, పశ్చిమ బెంగాల్ పట్టణ ఉపాధి పథకం- 2010లను వామపక్ష ప్రభుత్వాలు తీసు కొచ్చాయని కేంద్ర ప్రభుత్వం డబ్బులు ఇవ్వకున్నా రాష్ట్ర ప్రభుత్వాలే తమ బడ్జెట్లో నిధులు కేటాయించి అమలు చేస్తున్నాయని చెప్పారు. వీటితో పాటుగా ఒడిశా, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్ 2010 నుండి, రాజస్థాన్‌లో 2022 నుండి అక్కడ ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని పేర్కొన్నారు. పట్టణ పేదలకు ఉపాధి హామీ పని పెట్టాలని కేంద్ర ప్రభుత్వా నికి లేఖ రాసిన తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావడానికి మాత్రం ఆలోచన చేయకపోవడం విచారకరం. పట్టణ పేదల పట్ల చిత్తశుద్ధి ఉంటే తక్షణమే, పట్టణ పేదలకు పని కల్పించడానికి ప్రత్యేక చట్టాన్ని తేవాలి. రోజు కూలీ రూ.600, పనిదినాలు 200రోజులకు పెంచే విధంగా కేంద్రం మీద ఒత్తిడి తీసుకురావాలి. •



ఏదో సాధించాలనే తపన చాలా మందిలో ఉంటుంది. తమ కాళ్ళపై తాము నిలబడాలనే కోరిక ప్రతి మహిళకు ఉంటుంది. 'నువ్వేం చేస్తాం' అంటూ నిరుత్సాహపరిచే వారే ఎక్కువగా తారసపడుతుంటారు. 'నువ్వు చెయ్యి, అండగా మేముంటాం' అనే వారు చాలా తక్కువ. మహిళలకు ఇలాంటి భరోసా ఇచ్చే వారు దొరకడమే కష్టం. ఇక వారు చెయ్యాలనుకుంటుంది వ్యాపారమైతే... నష్టాలొస్తే ఎవరు భరిస్తారు..? అందుకే కుటుంబ సభ్యులు కూడా తొందరగా ఒప్పుకోరు. అలాంటి మహిళలకు అండగా నిలిచింది వుయ్ హబ్. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఔత్సాహిక మహిళా పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు దీన్ని ఏర్పాటు చేశారు. దీని నేతృత్వంలో ఎందరో మహిళలు వ్యాపారాలు ప్రారంభించి తామేంటో నిరూపించుకుంటున్నారు. అలాంటి వారిలో కొందరి అభిప్రాయాలు దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నేటి మానవిలో...

బిజినెస్ ఉమెన్‌కు భరోసా

అంచలంచలుగా ఎదిగేలా...



2015లో కరీంనగర్‌లోని ప్రగతి నగర్‌లో బ్యూటీ స్కూల్ స్థాపించాను. అప్పటి నుండి అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటూ సంస్థను అభివృద్ధి చేసుకుంటూ వచ్చాను. 2019లో బ్యూటీ ప్రొడక్ట్ ఉత్పత్తి కూడా ప్రారంభించాను. విదేశీ కస్టమర్లు ఐదు కోట్ల ఉత్పత్తులకి ఆర్డర్ ఇచ్చారు. కానీ వచ్చి సంస్థ వాతావరణాన్ని చూసి ఫ్యాక్టరీ పూర్తి హంగులతో వుంటే తప్ప ఆర్డర్ ఇవ్వలేమని వెనక్కు వెళ్ళిపోయారు. దాంతో తెలిసిన వారి ద్వారా పాత ఇల్లొకటి తొమ్మిదేండ్లకు లీజుకు తీసుకొని ఫ్యాక్టరీ ప్రారంభించా. అప్పటి నుండి అంచెలంచెలుగా ఎంతో కొంత ఉన్నతి సాధిస్తూనే ఉన్నాను. అదే సమయంలో వుయ్ హబ్ వారు హర్ ఎండ్ నౌ ప్రోగ్రాంకి నన్ను ఎంపిక చేశారు. వాళ్ళు బిజినెస్‌లో అనేక మెళకువల గురించి ఆన్‌లైన్ ట్రైనింగ్ ఇచ్చారు. అలాగే నేను బ్రాండింగ్‌లో ఎదుర్కొంటున్న ఇబ్బందులు గమనించి వారే ఆర్థిక సహాయంతో బ్రాండిగ్ క్రియేట్ చేశారు. ఆ సమయంలో ట్రైనింగ్ ఇచ్చిన జర్మనీ యూనివర్సిటీ వారు వివిధ రాష్ట్రాలనుంచి ఒక్కొక్క పారిశ్రామికవేత్తను ఎన్నుకుని వారి గురించి 'వుయ్ మీన్ బిజినెస్' అనే పుస్తకం వేశారు. అందులో తెలంగాణా నుంచి ఎంపికైన ఏకైక మహిళను నేనే. అంతేకాదు తెలంగాణా స్టేట్ మోడల్ స్కూల్స్‌కి స్కిల్ డెవలప్ మెంట్ ప్రోగ్రామ్స్ ఎస్సెసర్‌గా నన్ను రెగ్యులర్‌గా ఆహ్వానిస్తారు. నా దగ్గర ట్రైనింగ్ తీసుకున్న వారిలో 20మంది వరకు నా స్కూల్లోనే పని చేస్తున్నారు. నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ వారు నిర్వహించే బ్యూటీ కోర్సు ప్రోగ్రాంలకు ఎగ్జామినర్‌గా కూడా నన్ను పిలుస్తుంటారు. అలాగే లైంగిక వేధింపుల నిరోధక కమిటీలో సభ్యురాలిగా కూడా ఉన్నాను. మైక్రో స్మాల్ అండ్ మీడియమ్ ఎంటర్ ప్రైజస్ అండర్ మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్ ఎఫైర్స్ వారు వారి ప్రోగ్రాములకు, క్లాసులు నడపటానికి, వర్క్ షాపులకు నన్ను ఆహ్వానిస్తుంటారు. ఇప్పటి వరకు ఓ వ్యాపారవేత్తగా సుమారు 16 అవార్డులు అందుకున్నాను.

- శైలజ

నా ఆశయాన్ని సార్థకం చేసుకున్నా



నేను ఫార్మసీలో ఉస్మానియా యూనివర్సిటీ నుండి పి.హెచ్‌డీ పట్టా పొందాను. నాలుగేండ్ల కిందట అనుకోకుండా వి హబ్ వాళ్ళు పెట్టిన ఓ సెమినార్‌కు అనుకోకుండా వెళ్ళాను. ప్రభుత్వానికి సంబంధించినది కదా పేపర్ ప్లేట్స్ బిజినెస్ అంటే సపోర్ట్ చేస్తారేమో అని అడిగాని. కానీ అక్కడ ఉండే శకుంతల మేడమ్ 'నా చదువు, సామర్థ్యాన్ని తెలుసుకొని ఈ సంస్థ కేవలం చేస్తున్న వ్యాపారానికే కాదు, మీకేమైనా కొత్త ఆలోచనలునా మేము కచ్చితంగా సపోర్ట్ చేస్తాం' అన్నారు. అప్పటికే ఏడాది నుంచి ఆరోగ్యానికి సంబంధించిన కెమికల్స్, ప్రిజర్వేటివ్స్ లేకుండా ఆలోవేరా, ఆమ్లా జ్యూస్ ఇంట్లో తయారుచేస్తున్నాను. వీటిని అందరికీ అందుబాటులోకి తెచ్చేలా వ్యాపారం చేయాలనే ఆలోచన వుందని చెప్పాను. వెంటనే ఆరునెలల శిక్షణతో పాటు దానికి కావల్సిన సహకారం చేశారు. అప్పటి నుంచి దీనిపై ఎంతో పరిశోధన చేశాను. మన పాత సాంప్రదాయ విజ్ఞానానికి శాస్త్రీయ పద్ధతులు జోడించి ఉత్పత్తులు తయారు చేస్తున్నాను. వంటింటి మూలికలు, ఆకుకూరలు, కూరగాయలతో పోషిక విలువలతో కూడిన, రోగానిరోధక శక్తిని పెంపొందించే సహజ ఉత్పత్తులను తయారు చేస్తున్నాను. మొదట్లో బిసినెస్‌పై ఎలాంటి అవగాహన లేదు. ప్రొడెక్ట్ ఉత్పత్తి, మార్కెటింగ్ ఇలా అన్నింట్లో వుయ్ హబ్ నాకు సపోర్ట్ చేస్తూనే వుంది. ఆర్థిక స్థోమత పెద్దగా ఉన్న కుటుంబం కాదు మాది. వి హబ్ వారిచ్చిన లక్ష రూపాలయ రివాల్వింగ్ ఫండ్‌తోనే నా వ్యాపారాన్ని మొదలుపెట్టాను. పిల్లలు, మహిళల ఆరోగ్యానికి ఉపయోగపడే ఆర్గానిక్ పదార్థాలతో ఉత్పత్తులను తయారు చేస్తున్నాను. రెండు రకాల ఉత్పత్తులతో ప్రారంభమైన వ్యాపారం ఇప్పుడు 21 రకాలను కష్టమర్లకు అందిస్తున్నాను. నా ఆశయాన్ని సార్థకం చేసుకోవటానికి ప్రతీ అడుగులో తోడు ఉంటున్న ఈ సంస్థకి నా హృదయ పూర్వక ధన్యవాదములు.

- కల్పన గజ్జల

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు 2014 - 2023

నా ఎదుగుదలకు దోహదం...



వ్యాపారం చేయాలనే సంకల్పం బలంగా ఏర్పరచుకున్నాక పనితనం పట్టుదల కలిగిన నేను అందులో నైపుణ్యాలను ఆకళింపు చేసుకోవాలనుకున్నాను. మల్బరి సాగు, పట్టుపురుగుల పెంపకం ఎలా చేయాలో బెంగుళూరుకు వెళ్ళి శిక్షణ తీసుకున్నాను. ఇందుకు వుయ్ హబ్ నిర్వహించిన శిక్షణ ఎంతో ఉపయోగపడింది. అకౌంటింగ్, మార్కెటింగ్, బ్యాంకింగ్ వంటి అంశాలపై అవగాహనకు క్షుణ్ణంగా అధ్యయనం చేయడానికి తోడ్పడ్డాయి. రెండు ఎకరాల పొలంలో నెలకు 60 నుంచి 70 వేల వరకు సంపాదించ వచ్చని గ్రహించి స్వయంగా కొన్నాళ్ళు మల్బరి మొక్కల పెంపకం చూసి వచ్చి పట్టుపురుగుల పెంపకం మొదలు పెట్టాను. 2014లో మొదలు పెట్టిన మొదటి సాగులో నాకు వచ్చిన మొదటి లాభం నలభై వేలు. తర్వాత క్రమంగా పెంపకాన్ని దశల వారీగా పెంచాను. సేంద్రీయ పద్ధతిలో పట్టుపురుగులను పెంచి పట్టుదారం ఉత్పత్తికి దోహదం చేసే SR Silks నిర్వహణలో కొత్తగా పట్టుపురుగుల పెంపకం చేపట్టే వారందరికీ మార్గదర్శకం అనిపించుకున్నాను. మహిళలు ఏ రంగంలో నైనా రాణించగలరు అని నిరూపిస్తూ పట్టుపురుగుల పెంపకంలో తనదైన విశిష్ఠ స్థానాన్ని ఏర్పరుచుకున్న నాకు వుయ్ హబ్ గుర్తింపు పొందిన మహిళగా, తెలంగాణలో ఆటోమేటిక్ రీలింగ్ రీలింగ్ మెషీన్ పొందిన తొలి మహిళగా తనదైన ప్రత్యేక స్థానాన్ని దక్కించుకున్నాను. అందుకు వుయ్ హబ్‌కు ఎన్నటికీ ఋణపడి ఉంటాను.

- శిల్ప నెదురుగొమ్ముల,
సిల్క్ ఇండియా వ్యవస్థాపకులు

సహకారం మరువలేనిది



మాది నిజామాబాద్ జిల్లా, మాక్లూర్ మండలం. కుటుంబం ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో నా వ్యాపారం మొదలుపెట్టాను. మొదట కీ చైన్స్, పౌచెస్‌తో వ్యాపారం ప్రారంభించిన తర్వాత గాజుల తయారీపై దృష్టి కేంద్రీకరించాను. ఇప్పుడు ఈ వ్యాపారం ఇరు రాష్ట్రాలకు వ్యాపించి పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టింది. దుకాణ దారులు ఆర్డర్లు ఇవ్వడం మొదలు పెట్టారు. ఇంతలో మాకూ ఆ కళ నేర్పమని ఎందరో మహిళలు ముందుకు వచ్చారు. ఒకప్పుడు రెండువేల కోసం చెప్పులరిగేలా తిరిగినా అప్పు పుట్టలేదు. ఇప్పుడు రెండు వేలు, రెండు లక్షలు కాదు, పది లక్షలిస్తామని, కాదు కాదు పదిహేను లక్షలిస్తామంటూ బ్యాంక్ వాళ్ళే నా దగ్గరకి వస్తున్నారు. చిన్నప్పుడు సరదాగా నేర్చుకున్న చేతి కళను, ఆత్మవిశ్వాసాన్నే పెట్టుబడిగా పెట్టి సాగించిన ప్రస్థానం ప్రస్తుతం శాఖోపశాఖలుగా విస్తరించింది. వందలాది మంది మహిళలకు శిక్షణ ఇచ్చి తీర్చిదిద్దగలుగుతున్నాను. అంతేకాదు రెండు రాష్ట్రాలలో ప్రభుత్వాల తరపున వందల మందికి శిక్షణ ఇచ్చే ఏకైక ఫాకల్టీగా మారారు. మధ్యతరగతి కుటుంబంలో పుట్టినా, కట్టుబాట్లు, అడ్డంకులు, అవాంతరాలు అడుగడుగునా అడ్డుపడుతున్నా ధైర్యంతో ముందడుగేసానంటే దానికి ముఖ్య కారణం వుయ్ హబ్ ఇచ్చిన సహకారం. వారు వ్యాపారం విస్తరించడానికి అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తూ దిశానిర్దేశం చేస్తున్నారు.

- ఉజ్మా బేగం



సేకరణ : అక్షరయాన్ టీం

పాలమూర్ అంటే మైగ్రేషన్..

ఇప్పుడు ఇరిగేషన్

(మొదటిపేజీ తరువాయి)

చేయడం గొప్ప విషయమన్నారు.

పుట్టిన ఊరు రుణం తీర్చు తీర్చుకోవాలని, నేటి యువతకు టెక్నాలజీ అందుబాటులో ఉందన్నారు. నేడు టెక్నాలజీ ఉన్న వాళ్లే ధనవంతులుగా ఎదుగుతున్నారని, అందరూ ఈ అవకాశాలు ఉపయోగించుకోవాలన్నారు. 120 మందికి ఉద్యోగాలు ఇస్తున్న సెయింట్ డైరెక్టర్ మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. విద్య మనిషిని ఒక స్థాయికి తీసుకుపోతుందన్నారు. మాట్లాడే నైపుణ్యం ఉంటే ప్రపంచంలో ఎక్కడైనా ఎదగొచ్చన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ప్రపంచంతో పోటీ పడే విధంగా గురుకుల విద్యార్థులను తయారు చేస్తున్నామని చెప్పారు. రూ.9500 కోట్ల పెట్టుబడితో అమర్ రాజా కంపెనీ రాబోతుందని, లక్షలాది మందికి ఉపాధి దొరుకుతుందని తెలిపారు. తెలంగాణకు పెట్టుబడులు వెల్లువలా వస్తున్నాయన్నారు.

కాంగ్రెస్‌కు ఓటు వేస్తే మళ్లీ రూ.200 పింఛన్, 3 గంటల కరెంటు వస్తుందన్నారు. 'ఏ రంగంలో చర్చకు వస్తరో రండి.. మీరు చేసిన ఉద్ధారకమేంది.. మేం చెడగొట్టిందేది.. మేము అన్నీ బాగుచేశాం. కానీ నోటికి వచ్చిన బూతులు మాట్లాడుతున్నారు. జడ్చర్లలో కాంగ్రెస్ చేసిన అభివృద్ధి కనిపిస్తలేదు..” అని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న 50 ఏండ్లలో రాష్ట్రంలో సక్రమంగా పనిచేస్తే ఈ సమస్యలెందుకుంటాయి.. ఈ యాత్రలెందుకంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ పిలుపు మేరకు మిషన్ కాకతీయలో బాగు చేసుకున్న చెరువుల కాడ నిండిన నీళ్లను చూస్తూ పండుగ చేసుకున్నామన్నారు. మహబూబ్‌నగర్‌కు హెలికాప్టర్‌లో వస్తూ పైనుంచి చూస్తుంటే ఎర్రటి ఎండాకాలంలో నిండుకుండల్లా మారి.. మత్తళ్లు దుంకుతున్నయ్.. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఉద్దండాపూర్, కరివెన ప్రాజెక్టును చూపించారు.. ఈ ప్రాజెక్టులు నిండితే 1.44 లక్షల ఎకరాలకు నీళ్ల రాబోతున్నాయి.. ఒకసారి కృష్ణా నీరు జడ్చర్లకు వస్తే దశాబ్దాల పాలమూరు గోస పీడపోతుందని చెప్పారు.

బీజేపీ వాళ్ల కృష్ణా జలాలు పంచకపోయినా వాయువేగంతో పూర్తి చేసుకుంటూ ఆగస్టు, సెప్టెంబర్ నాటికి కరివెన, ఆ తర్వాత ఉద్దండాపూర్ నిండి జడ్చర్ల నియోజకవర్గం సస్యశ్యామలం అవుతుందని చెప్పారు. కేసీఆర్ నాయకత్వంలో పోరాడి సాధించుకున్న తెలంగాణ దేశంలో అభివృద్ధి సూచికలో ముందు వరుసలో ఉందన్నారు. ప్రతిపక్షాల రాజకీయ నాయకుల విమర్శలను పట్టించుకోబోమని.. భాజాప్త దశాబ్ది ఉత్సవాలు నిర్వహించి అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

క్రెడిట్‌లతోనే డిగ్రీలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రోగ్రామ్‌ను రద్దు చేయాలని కమిటీ సిఫార్సు చేసింది. సైన్సెస్, ఇంజనీరింగ్, టెక్నాలజీ, ఆర్ట్స్, హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, మేనేజ్‌మెంట్, కామర్స్ వంటి అండర్ గ్రాడ్యుయేట్ (యూజీ), పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) స్థాయిలలోని అన్ని విభాగాలకు ఈ నామకరణం వర్తిస్తుంది. మాస్టర్స్ ఏడాదికి అనుమతి ఇవ్వాలని, అంతర్జాతీయ నిబంధనలకనుగుణంగా డిగ్రీలు ఉండాలని సూచించింది. నిపుణుల కమిటీ తన తాజా సిఫారసులకనుగుణంగా నామకరణాన్ని సవరించే కసరత్తును చేపట్టేందుకు, అవసరాల ఆధారంగా సంబంధిత నియంత్రణ అధికారుల నుండి నామినీలతో ఒక స్టాండింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని కోరింది. ఈ సిఫారసులపై విశ్వవిద్యాలయాలు సలహాలను పంపవచ్చని కమిటీ తెలిపింది.

సోమవారం 'గుండె' గుబులు!

(మొదటిపేజీ తరువాయి)

ఆదివారం కూడా ఊహించిన దాని కంటే ఎక్కువగా ఉన్నట్టు కనుగొనటం గమనార్హం. బెల్ఫాస్ట్ హెల్త్ అండ్ సోషల్ కేర్ ట్రస్ట్, ఐర్లాండ్‌లోని రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్ వైద్యులు 2013 నుంచి 2018 సంవత్సరాల మధ్య ఐర్లాండ్‌లోని పది వేల మంది రోగుల డేటాను పరిశీలించారు. ఈ ఐదేండ్లలో స్టెమీ ఫలితంగా ఆస్పత్రులలో చేరిన రోగులు చుట్టూ ఈ డేటా కేంద్రీకృతమై ఉండటం గమనార్హం.

రూ.1,000 నోట్లను ప్రవేశపెట్టం

(మొదటిపేజీ తరువాయి)

ఉపసంహరించుకుంటారనే ఊహాగానాలను ఆయన కొట్టిపారేశారు. రెపో రేటును వరుసగా రెండో సారి 6.50శాతం వద్దే కొనసాగించాలని నిర్ణయించామన్నారు. రూ.2000 నోట్లలో రూ.1.80 లక్షల విలువైన నోట్లు వెనక్కి వచ్చేశాయని శక్తికాంత వెల్లడించారు. ఇది ఆ కరెన్సీలో 50 శాతమన్నారు. రూ.2000 నోట్లను మార్కెట్ నుంచి ఉపసంహరించుకుంటున్నట్టు మే 19న ఆర్‌బీఐ ప్రకటించిన విషయం తెలిసిందే. కేవలం 15 రోజుల్లోనే సగం కరెన్సీ బ్యాంకులకు తిరిగి వచ్చిందన్నారు. 2023 మార్చి 31 నాటికి రూ.3.62 లక్షల కోట్ల విలువ చేసే రూ.2,000 నోట్లు చెలామణిలో ఉన్నాయి. రూ.2000 నోట్ల మార్పిడికి ఈ ఏడాది సెప్టెంబర్ 30 వరకు గడువు ఇచ్చిన విషయాన్ని శక్తికాంత గుర్తు చేశారు. ప్రస్తుత పరిస్థితి ప్రకారం బ్యాంకు ఖాతాల్లో డిపాజిట్ల రూపంలో 85 శాతం కరెన్సీ వెనక్కి వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. అలాగని చివరి క్షణం వరకూ పెద్ద నోటు మార్పిడి లేదా డిపాజిట్ కోసం వేచి ఉండొద్దని ప్రజలకు ఆయన సూచించారు. నగదు మార్పిడికి సరిపడ కరెన్సీ బ్యాంక్‌ల వద్ద అందుబాటులో ఉందన్నారు. ఎలాంటి పత్రాలు లేకుండా ఒక్క రోజు రూ.20,000 వరకు రూ.2వేల నోట్లను మార్పిడి చేసుకునే వెసులుబాటు కల్పించింది. ప్రస్తుత 2023-24లో వృద్ధి 6.5 శాతంగా ఉండొచ్చని ఆర్‌బీఐ అంచనా వేసిందని శక్తికాంత పేర్కొన్నారు. 2022-23లో 7.2 శాతంగా, ఇంతక్రితం 2021-22లో 9.1 శాతంగా నమోదయ్యింది. దీంతో పోల్చితే ప్రస్తుత ఏడాదిలో వృద్ధి రేటు తగ్గనుందని స్పష్టమవుతోంది.

సమీక్షా ప్రధానాంశాలు..

- రెపో రేటు యథాతథంగా 6.5 శాతంగా కొనసాగింపు.
- 2023-24లో ద్రవ్యోల్బణం సూచీ 5.1 శాతంగా ఉండొచ్చని అంచనా.
- 2023-24లో వృద్ధి 6.5 శాతంగా ఉండొచ్చు.
- తొలి త్రైమాసికం (క్యూ1)లో 8%, క్యూ2లో 6.5%, క్యూ3లో 6%, క్యూ4లో 5.7 శాతంగా అంచనా.
- బ్యాంక్‌లు రూపే ప్రీపెయిడ్ ఫారెక్స్ కార్డ్‌లను జారీ చేయవచ్చు.
- జూన్ 22న ఎంపీసీ భేటీ మినెట్స్ వెల్లడి.
- తదుపరి ఆర్‌బీఐ ఎంపీసీ భేటీ ఆగస్టు 8-10న నిర్వహణ.

వడ్డీ రేట్లు యథాతథం

వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగిస్తూ రిజర్వ్ బ్యాంక్ నిర్ణయం తీసుకుంది. ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అధ్యక్షతన మూడు రోజుల పాటు జరిగిన ద్రవ్య పరపతి విధాన సమీక్షలో రెపో రేటును 6.50శాతం వద్దే కొనసాగించాలని నిర్ణయించారు. దీంతో మరోసారి రుణ గ్రహీతలకు స్వల్ప ఉపశమనం లభించింది. స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ (ఎస్‌డీఎఫ్) రేటును 6.25 శాతం, మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ రేటును 6.75 శాతం వద్దే కొనసాగించాలని ఆర్‌బీఐ నిర్ణయించింది. గత ఏప్రిల్ సమీక్షాలోనూ వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పు చేయలేదు. అంతక్రితం మాత్రం 2022 మే నుంచి వరుసగా ఆరు దఫాల్లో కీలక వడ్డీ రేట్లను 250 బేసిస్ పాయింట్లు పెంచింది. దీంతో ప్రస్తుతం వడ్డీ రేట్లు అధిక స్థాయిలోనే ఉన్నాయనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల రిటైల్ ద్రవ్యోల్బణం కొంత తగ్గినట్లు గణంకాలు రావడంతో ఆర్‌బీఐ వడ్డీ రేట్ల పెంపును నిలిపివేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత వృద్ధి రేటు 6.5 శాతంగా ఉండొచ్చని ఆర్‌బీఐ అంచనా వేసింది. ఇంతక్రితం ఏడాది 7.2 శాతంగా నమోదయిన విషయం తెలిసిందే.

తెలంగాణకు 12 ,ఏపీకి ఐదు

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపింది. తెలంగాణలోని మేడ్చల్, వరంగల్, భూపాలపల్లి, కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, ఆసిఫాబాద్, నిర్మల్, సిరిసిల్ల, వికారాబాద్, జనగాం, హైదరాబాద్ లో కొత్త కళాశాలల ఏర్పాటుకు కేంద్రం ఆమోదించింది. మేడ్చల్- మల్కాజిగిరిలో అరుంధతి ట్రస్ట్, మేడ్చల్లో సీఎంఆర్ ట్రస్ట్, వరంగల్ కొలంబో ట్రస్ట ఆధ్వర్యంలో వైద్య కళాశాలలు ఏర్పాటు కానున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల, రాజమహేంద్రవరం, విజయనగరం జిల్లాల్లో మెడికల్ కాలేజీలు ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఏర్పాటు కానున్నాయి. మిగిలిన అన్ని కాలేజీలను ప్రభుత్వమే ఏర్పాటు చేసేందుకు ఆమోదం తెలిపింది. 2023-24 విద్యా సంవత్సరం నుంచి ఒక్కో కాలేజీలో 150 సీట్లతో మొదలవుతాయని కేంద్ర వైద్యారోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది.

రసాయన శాస్త్రానికి పీరియాడిక్ టేబుల్ వెన్నెముక

- దాన్ని తిరిగి చేర్చాలి
- తొలగింపులో హేతుబద్ధత లేదు...: డాక్టర్ కోయ వెంకటేశ్వరరావు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కింది తరగతుల్లో రసాయనశాస్త్రం సిలబస్‌లో పీరియాడిక్ టేబుల్‌ను తిరిగి చేర్చాలని న్యూసైన్స్ కళాశాల రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కోయ వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం ఎస్వీకే మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్.వినయకుమార్ సమన్వయకర్తగా 'కెమిస్ట్రీ సిలబస్ నుంచి పీరియాడిక్ టేబుల్ తొలగింపా?' అనే అంశంపై వెబినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పీరియాడిక్ టేబుల్ అనేది... రసాయనశాస్త్రానికి వెన్నుముక లాంటిదని తెలిపారు. సిలబస్ తగ్గింపు పేరుతో దాన్ని తొలగించడంలో ఎలాంటి హేతుబద్ధత లేదని స్పష్టం చేశారు. ఆ తొలగింపునకు ఎన్‌సీఈఆర్టీ ఇచ్చిన వివరణ భావదారిద్ర్యంగా ఉందని విమర్శించారు. సిలబస్ ఎక్కువా?, తక్కువా? అనే దాని కన్నా దాన్ని ఒక క్రమమైన పద్ధతిలో ఇస్తే అది ఉపాధ్యాయులకు, విద్యార్థులకు సులువుగా ఉంటుందని సూచించారు. పాఠ్యపుస్తకాల రచనలో ఎన్‌సీఈఆర్టీ ఢిల్లీ పరిసరాల్లో కేవలం పది మందిని మాత్రమే వినియోగించుకుంటూ దేశవ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులను పక్కన పెడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రసాయనశాస్త్రంలో పీరియాడిక్ టేబుల్ అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్నదని ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు తెలిపారు. సిలబస్ తగ్గింపు అంటున్న ఎన్‌సీఈఆర్టీ 2005కు ముందున్న సిలబస్‌లో సగం కూడా ప్రస్తుతం లేదని గుర్తుపెట్టుకోవాలని కోరారు. రసాయనశాస్త్రానికి ప్రాథమికాంశాలైన మూలకాలు తదితర విషయాలను సులభతరంగా అర్థం చేసుకునేందుకు పీరియాడిక్ టేబుల్ ఉపయోగపడుతున్నదని తెలిపారు. మిలియన్ల పదార్థాల ధర్మాలను గుర్తించుకోవడం కష్టమనీ, వాటి ధర్మాల పోలికల చొప్పున గుంపుల వారీగా వర్గీకరించే శాస్త్రవేత్తల కృషితో వచ్చిందే ఈ పీరియాడిక్ టేబుల్ అని తెలిపారు. ఇది తప్పనిసరిగా కింది తరగతుల్లో పదే పదే నేర్చుకోవాల్సిన అంశమని నొక్కి చెప్పారు. ఈ విషయంలో ఎన్‌సీఈఆర్టీ అనాలోచిత చర్యకు పాల్పడిందన్నారు. ఇప్పటికే దేశం చదువుల్లో వెనకబడిందనీ, ఇలాంటి పరిస్థితే కొనసాగితే... ఆర్థికంగానూ దెబ్బతింటామని హెచ్చరించారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని ఇప్పటికీ తెలంగాణ అమలు చేయడం లేదనీ, భవిష్యత్తులోనూ అమలు చేయకపోవచ్చని తెలిపారు.

ఆర్థిక సహాయం పథకానికి దరఖాస్తు గడువు పెంచాలి

- తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వృత్తికులాలకు ఆర్థిక సహాయం పథకానికి దరఖాస్తు చేసుకునే గడువును పెంచాలనీ, అర్హులైన వారందరికీ ఆర్థిక సహాయం అందించాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు గురువారం ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య ఆధ్వర్యంలో నాయకులు రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శికి వినతిపత్రం సమర్పించారు. ఆధునీకరణ, పనిముట్లు, ముడిసరుకుల కొనుగోలు కోసం రూ.లక్ష ఆర్థిక సహాయం చేస్తామంటూ ప్రకటించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ నెల ఆరు నుంచి వచ్చే నెల ఏడో ఆరో తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకునేందుకు గడువిచ్చారని చెప్పారు. దరఖాస్తుదారులు కులం, ఆదాయం, ఆధార్, రేషన్ కార్డులను జతపర్చాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అత్యంత వెనుకబడిన వారిలో అత్యధికులు నిరక్షరాస్యు లనీ, అందువల్ల సర్టిఫికెట్లను సిద్ధం చేసుకునేందుకు కొంత సమయం పట్టే అవకాశముందని తెలిపారు. ఈ నేపథ్యంలో గడువును జూలై 10 వరకు పొడిగించాలని కోరారు.

అగ్ని ప్రైమ్ బాలిస్టిక్ మిస్సైల్ పరీక్ష సక్సెస్

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. రేడార్, టెలిమెట్రీ, ఎలక్ట్రో ఆప్టికల్ ట్రాకింగ్ సిస్టమ్స్‌ను వేర్వేరు ప్రాంతాల్లో మోహరించి ఈ పరీక్షను కొనసాగించారు. క్షిపణికి చెందిన ఫ్లయిట్ డేటాను పూర్తిగా సేకరించారు.డీఆర్డీవోకు చెందిన సీనియర్ అధికారులు, స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ అధికారులు ఈ పరీక్షను ప్రత్యక్షంగా వీక్షించారు. అగ్ని ప్రైమ్ క్షిపణి పరీక్ష విజయవంతమైన నేపథ్యంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ డీఆర్డీవో అధికారులను అభినందించారు.

జాలరిగా మంత్రి ఎర్రబెల్లి..

నవతెలంగాణ-పెద్దవంగర

నిత్యం జనంతో మమేకమయ్యే మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మృగశిర కార్తె వేళ జాలరీగా మారారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలు నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా జరుగుతున్నాయి. గురువారం 'ఊరూరా చెరువు' పండుగా సందర్భంగా మహబూబాబాద్ జిల్లాలోని పలు గ్రామాల్లో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పర్యటించారు. అందులో భాగంగా మరిపెడ మండలంలోని గంట్లకుంట గ్రామంలో మత్స్యకారులు చేపలు పట్టడం మంత్రి కంటపడింది. వెంటనే కాన్వాయ్ ఆపిన మంత్రి, జాలర్లతో కలిసి చెరువులోకి దిగారు. వల పట్టి, చేపలు పడుతూ సంబరపడ్డారు. అనంతరం వారితో ముచ్చటించి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మత్స్యకారుల ఆదాయం మార్గంపై ఆరా తీశారు. సీఎం కేసీఆర్ చొరవతోనే తెలంగాణకు పూర్వవైభవం వచ్చిందన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపిన కేసీఆర్ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు.

ఆహార భద్రత సూచీలో కేరళ టాప్

(మొదటిపేజీ తరువాయి)

వరుసగా నాలుగో స్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో మణిపూర్, సిక్కిం రాష్ట్రాలు ఉన్నాయి. గతేడాది కూడా ఈ మూడు రాష్ట్రాలు అవే స్థానాల్లో ఉన్నాయి. కేంద్రపాలిత ప్రాంతాల్లో జమ్మూకాశ్మీర్, ఢిల్లీ, చండీగఢ్‌లు వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. గతేడాది కూడా ఈ మూడు కేంద్రపాలిత ప్రాంతాలు ఇవే స్థానాలలో ఉండటం గమనార్హం.

జిల్లాల కోసం ఉద్దేశించిన ఈట్ రైట్ ఛాలెంజ్-ఫేజ్ 2 విజేతలను కూడా కేంద్ర మంత్రి సత్కరించారు. ఇందులో అనేక జిల్లాలు తమిళనాడు, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, యూపీ, మహారాష్ట్రల నుంచి ఉన్నాయి. ఇవి అసాధారణ ఫలితాలను సాధించాయి. పాల్గొన్న 260 జిల్లాలలో 31 విజయవంతంగా 75 శాతం లేదా అంతకంటే ఎక్కువ స్కోర్‌ను సాధించాయి. ఆహార భద్రత సూచిక ఆహార భద్రతకు సంబంధించిన వివిధ అంశాలలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పనితీరును అంచనా వేస్తుంది. ఇందులో మానవ వనరులు, సంస్థాగత సమాచారం, సమ్మతి, ఆహార పరీక్ష సౌకర్యం, శిక్షణ, సామర్థ్యం పెంపుదల, వినియోగదారుల సాధికారత వంటివి ఉన్నాయి.

కేరళను తాకేశాయ్

(మొదటిపేజీ తరువాయి)



ప్లానింగ్ సొసైటీ నివేదిక ప్రకారం రాష్ట్రంలో గురువారం రాత్రి పది గంటల వరకు 54 ప్రాంతాల్లో వర్షం పడింది. వికారాబాద్ జిల్లా మోమిన్ పేటలో అత్యధికంగా 2.23 సెంటీమీటర్ల వాన పడింది.

పలు జిల్లాలకు వడగాల్పుల హెచ్చరిక

రాష్ట్రంలో పలు జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఆ జాబితాలో ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్, కొమ్రంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాలున్నాయి. వడగాల్పులు వీయనున్న నేపథ్యంలో ఆయా జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. గురువారం కొమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కుంచవల్లిలో అత్యధికంగా 45.9 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. రవీంద్రనగర్(కొమ్రంభీమ్ ఆసిఫాబాద్)45.5, కేతేపల్లి(నల్లగొండ) 45.1 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

'నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి'

నవతెలంగాణ- సంతోష్ నగర్

సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఐఎస్ సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్ రెడ్డి అన్నారు. శ్రీనివాస్ కాలనీలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు గురువారం కార్పొరేటర్ శంకు స్థాపన చేసి మాట్లాడారు. డివిజన్ పరిధిలోని రోడ్లు, డ్రైనేజీ, మంచినీరు, తదితర మౌలిక సదుపాయాలను మెరుగు పరిచేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసు కుంటూ..వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కార్పొరేటర్ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో స్థానికులు నాగరాజు, గిరిధర్ రెడ్డి, నాగార్జున రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు లబ్ధిదారులతో మంత్రి ముఖాముఖి



నవతెలంగాణ - చైతన్యపురి

తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిదారులతో శుక్రవారం విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నట్లు మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ తెలిపారు. ఈ కార్యక్రమం ఆర్కేపురంలోని కిన్నెర గ్రాండ్ (ఓల్డ్ స్వాగత్ ఫంక్షన్ హాల్) అష్టలక్ష్మి దేవాలయం రోడ్డులో జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, పార్టీ అనుబంధ సంస్థల నాయకులు, వివిధ సంస్థల చైర్మన్లు, డైరెక్టర్లు, యువజన విభాగం నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు, లబ్ధిదారులు, పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్వర్ రెడ్డి
- పీర్జాదిగూడలో మిరాకిల్ ఆస్పత్రిని ప్రారంభించిన మంత్రి



నవతెలంగాణ-బోడుప్పల్

మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంతకండ్ల జగదీశ్వర్ రెడ్డి అన్నారు. మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన మిరాకిల్ చిన్న పిల్లలు, మహిళల ఆస్పత్రిని గురువారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న రాజధాని శివారు ప్రాంతాలలో ప్రజలకు అవసరమైన మెరుగైన వైద్యం అందించాలనే సంకల్పంతో మిరాకిల్ హాస్పిటల్ యాజమాన్యం ఇక్కడ ఆసుపత్రిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని వర్గాల వారికి వైద్యం అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని మిరాకిల్ హాస్పిటల్ యాజమాన్యానికి మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ జక్క వెంకట్ రెడ్డి, ప్రముఖ ప్రొడ్యూసర్ దిల్ రాజు, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ రాజీవ్ సాగర్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బండారు లక్ష్మా రెడ్డి, ఆస్పత్రి సీఈవో వర ప్రసాద్, స్థానిక కార్పొరేటర్లు ఎంపల్ల అనంత్ రెడ్డి, అమర్ సింగ్, డాక్టర్ సూహస్, డాక్టర్ సాత్వీక్, డాక్టర్ వివేక్, డాక్టర్ సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను ప్రారంభించిన మంత్రి

నవతెలంగాణ -ఎల్బీనగర్



తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రంగారెడ్డి జిల్లా మత్స్య శాఖ ఆధ్వర్యంలో గురువారం సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించినారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నాడు చేపల కోసం ఆంధ్ర మీద ఆధారపడే వాళ్ళమని, నేడు మన చెరువుల్లోనే చేపలు పుష్కలంగా లభిస్తున్నాయన్నారు. ఇది సీఎం కేసీఆర్ సాధించిన ఘనత అని కొనియాడారు. మిషన్ కాకతీయ ద్వారా 27 వేల పై చిలుకు చెరువుల్లో మూడేండ్లలో రూ.10వేల కోట్లు ఖర్చు పెట్టి పూడికతీత పనులు చేపట్టినట్లు తెలిపారు. ఫలితంగా అన్ని చెరువులలో ఎండ కాలం కూడా నీళ్లు ఉన్నాయన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో భూగర్భ జలాలు భారీగా పెరిగి 5 మీటర్ల పైకి నీరు వచ్చిందన్నారు. గంగ పుత్రులు, మత్స్య కారులు, ముదిరాజ్ కులస్తుల కోసం 2016-17లో 45 చెరువుల్లో ఉచితంగా చేపలు వదిలే కార్యక్రమం చేపడితే..నేడు జిల్లాలో 765 చెరువులల్లో చేప పిల్లలు ,రొయ్యలు వదులుతున్నట్లు తెలిపారు.

ఇబ్రహీంపట్నం చెరువులో రూ.4 కోట్ల ఆదాయం లభిస్తుందని చెప్పారు. దీంతో పాటు రావిర్యాల చెరువు నిండి పంట పొలాల్లోకి నీరు చేరిందన్నారు. ప్రభుత్వం మత్స్యకారులకు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తూ 75 శాతం సబ్సిడీతో.. 900 కోట్లతో వాహనాలు సమకూర్చి వారి జీవన ప్రమాణాలు మెరుగు పర్చేందుకు కృషి చేస్తుందని వివరించారు.

ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను స్థానికులు సందర్శించి వంటకాలను ఆస్వాదించాలని సూచించారు. గతంలో 5 వేల టన్నుల మత్స్య సంపద ఉత్పత్తి అయితే.. నేడు 9 వేల టన్నుల ఉత్పత్తి అవుతుందన్నారు. అంతేకాదు రూ.138 కోట్ల ఆదాయం కూడా వస్తుందని హర్షం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, జడ్పీ చైర్ పర్సన్ అనితా రెడ్డి, ఎమ్మెల్సీ యెగ్గే మల్లేశం, జిల్లా ఫిషరీష్ అధికారి సుకృతి, అధికారులు, మత్స్యకారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధికి కృషి చేస్తా



- కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి

నవతెలంగాణ-వనస్థలిపురం

కాలనీల అభివృద్ధికి కృషి చేస్తానని బీఎస్‌రెడ్డి నగర్ డివిజన్ జీహెచ్ఎంసీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి అన్నారు. బీఎస్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సెల్ఫ్ ఫైనాన్స్ కాలనీలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం జీహెచ్ఎంసీ డీఈ దామోదరరావుతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. కాలనీల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ చంద్రశేఖర్ రెడ్డి, కాలనీ అధ్యక్షులు వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షులు నిట్టా కృష్ణా, ప్రభాకర్ రెడ్డి, నాయకులు పవన్ రెడ్డి, శ్రావణ్ రెడ్డి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వివాహాలు జరిపించడం అభినందనీయం



నవతెలంగాణ- చైతన్యపురి



ఉచిత వివాహాలను జరిపించడం అభినందనీయమని హైదరాబాద్ సిటీ అడిషనల్ డీసీపీ పోల విజయ కుమార్, మార్కెటింగ్ శాఖ అడిషనల్ డైరెక్టర్ పి. రవికుమార్‌లు అన్నారు. జగిని ఫర్నిచర్స్ అధినేత జగిని శ్రీనివాస్ గుప్త, అమ్మ ఫౌండేషన్ చైర్మన్ నాగమళ్ళ అనిల్ కుమార్ గుప్త ఆధ్వర్యంలో గురువారం ఆర్యవైశ్య భవన్‌లో 100వ ఉచిత వివాహం వికలాంగులు లలిత-శ్రీనివాస్, గంట వ్యవధిలోనే జడ్చర్లకు చెందిన నిరుపేద జంట కవిత, వేణుల వివాహాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వివాహాలకు ముఖ్య అతిథిగా హైదరాబాద్ సిటీ అడిషనల్ డీసీపీ పోల విజయ కుమార్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా జగిని శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ ఆర్థిక స్థోమత లేని నిరుపేద యువతీ యువకులు మమ్ములను సంప్రదిస్తే..అన్నీ తామై పెళ్లి జరిపిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ సేవకులు ఊర రమేష్, పెద్ది శ్రీనివాస్ గుప్త, నాగిళ్ళ శ్రీనివాస్, సురేష్, బాలరాజ్ గుప్త, నాల్ల సాయి చంద్ పాల్గొన్నారు.

'కంటి వెలుగును వినియోగించుకోవాలి'

నవతెలంగాణ- బడంగ్ పేట్



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహా రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధి బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న 19వ డివిజన్ లోకాయుక్త కాలనీ కమ్యూనిటీ హాల్లో గురువారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కార్పొరేటర్ రామోజీ అమిత శ్రీశైలం చారితో పాటు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కంటి వెలుగు కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్ రెడ్డి, మోతి లాల్, మనోహర్, ధన్వంతర్ రెడ్డి, భాను పాల్గొన్నారు.

చేతివృత్తులను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యం



నవతెలంగాణ-బడంగ్

అనేక సంత్సరాలుగా ఆర్థికంగా వెనుకబడిన చేతి వృత్తుల వారిని ఆదుకోవడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు తిమ్మని గిరీష్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సీఎం కేసీఆర్ నాయకత్వంలో చేతి వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న పేద కుటుంబాలను ఆదుకోవడానికి రూ.1,00,000 (లక్ష రూపాయలు) ప్రత్యేక పథకం కింద ఆర్థిక సహాయం ఇవ్వనున్నట్లు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి చెప్పడం హర్ష నీయమన్నారు. తెలంగాణ కులవృత్తి దారులకు 1లక్ష రూపాయల సబ్సిడీ రుణాల కోసం WWW TS OBMMSBC.cgg.gov.in ఆన్లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 9న సీఎం కేసీఆర్ లాంఛనంగా ప్రారంభించనున్న ప్రారంభించనున్నట్లు తెలిపారు. చివరి తేదీ 20-06-2023 వరకు ఉంటుందని పేర్కొన్నారు. మీ సేవా ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆధార్ కార్డు, కులం, కొత్త ఆదాయ సర్టిఫికెట్ -2023, నివాస ధృవ పత్రం, రేషన్ కార్డు, ఒకఫోటో జత చేయాలన్నారు. ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మత్స్యకారుల ఉపాధి అవకాశాలు ఎంతో మెరుగు

నవతెలంగాణ-బేగంపేట్




- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత మత్స్యకారులు ఎంతో సంతోషంగా ఉన్నారని రాష్ట్ర పశు సంవర్థక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం తూప్రాన్ మత్స్యకార సొసైటీ సభ్యులు ప్రతి ఏడాదీ మాదిరిగానే మగశిర కార్తె సందర్భంగా మంత్రికి చేపలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత అన్ని చెరువులను మిషన్ కాకతీయ ద్వారా పునరుద్ధరించుకోవడం వల్ల నేడు చెరువులన్నీ నీటితో కళకళ లాడుతున్నాయన్నారు. ఉచిత చేప పిల్లల పంపిణీతో మత్స్య సంపద గణనీయంగా పెరగడంతో మత్స్య కారుల ఉపాధి అవకాశాలు ఎంతో మెరుగయ్యా యని తెలిపారు. మత్స్యకారులు సంతోషంగా ఉండాల న్నదే సీఎం లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్య సొసైటీ డైరెక్టర్ దేవేందర్, సభ్యులు నర్సింగ్ రావు, షాధ కోటేశ్వరరావు, పోచయ్య, చంద్రయ్య, భిక్షపతిపాల్గొన్నారు.

డ్రయినేజీ పనులకు శంకుస్థాపన

నవతెలంగాణ - ఘట్కేసర్



ఘట్కేసర్ మండల్ ఔషాపూర్ గ్రామం వేణుగోపాల్ నగర్ కాలనీలో చేపట్టిన డ్రైనేజీ పనులకు గురువారం ఎంపీపీ సుదర్శన్ రెడి శంకుస్థాసన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. రెండున్నర లక్షల నిధులతో డ్రైనేజీ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలలో డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కావేరి మచ్చేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ ఐలయ్య యాదవ్, వార్డు సభ్యులు పద్మ, వీరేష్, శ్రీనివాస్, నాయకులు మచ్చేందర్ రెడ్డి, దయాకర్ రెడ్డి, వామన్ రెడ్డి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

మిస్ అయిన మొబైల్స్ బాధితులకు అందజేత

నవతెలంగాణ -వనస్థలిపురం



మిస్ అయిన పది మొబైల్ ఫోన్లను పోలీసులు కనిపెట్టి బాధితులకు అప్పగించారు. ఈ ఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. వనస్థలిపురం పోలీస్ స్టేషన్ సీఐ జలంధర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..కనిపించకుండా పోయిన రెండు లక్షలు విలువ గల 10 మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ ఇంటర్నేషనల్ మొబైల్ ఎక్విప్ మెంట్ ద్వారా తెలుసు కున్నాం. తర్వాత వాటిని బాధితులకు అప్పగించినట్లు సీఐ జలంధర్ రెడ్డి తెలిపారు.

బాలాజీనగర్‌లో తీరిన ట్రాఫిక్ కష్టాలు



నవతెలంగాణ-వనస్థలిపురం

బీఎస్‌రెడ్డి నగర్ డివిజన్ బాలాజీ నగర్ కాలనీలో ట్రాఫిక్ కష్టాలు తీరాయి. కాలనీ ఎంట్రన్స్‌లో సౌత్ ఈస్ట్ బేకరీ దగ్గర బాలాజీ నగర్‌కు వచ్చే దారిలో రెండు వైపుల బైకులు పార్క్ చేయడం ద్వారా ఏర్పడే ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ బుధవారం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి ఆధ్వర్యంలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని కలిసిన విషయం తెలిసిందే..ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం వనస్థలిపురం ట్రాఫిక్ సీఐ నాగార్జున, ఆర్ఐ రంగా నాయక్‌లు తమ సిబ్బందితో వచ్చి పార్క్ చేసిన బైకులు అన్ని పక్కన పెట్టించి.. కాలనీ లోపలకు వాహనాలు వచ్చే విధంగా మార్కింగ్ చేయించి, భారీకేడ్లు ఏర్పాటు చేశారు. తర్వాత అక్కడ ఉన్న షాపు యజమానులకు పార్కింగ్ పైన కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం బాలాజీ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బుడ్డా లచ్చిరెడ్డి, జనరల్ సెక్రెటరీ ముడుపు సందీప్ రెడ్డిలు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డిలకు హృదయపూర్వక ధన్యవాదములు తెలియజేశారు.

డివిజన్ సమస్యలు పరిష్కరిస్తా

- మేయర్ పారిజాత నర్సింహారెడ్డి



నవతెలంగాణ- బడంగ్‌పేట్


బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అన్ని డివిజన్లలోని సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు కృషిచేస్తానని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 23వ డివిజన్‌లో గురువారం కార్పొరేటర్ రాళ్లగూడం సంతోషి శ్రీనివాస్ రెడ్డితో కలిసి మేయర్ సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. త్వరగా రోడ్డు పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు రాళ్లగూడెం శ్రీనివాస్ రెడ్డి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలోంచి పుస్తెలతాడు అపహరణ

నవతెలంగాణ - వనస్థలిపురం

విధులు నిర్వహించుకుని తిరిగి ఇంటికి వెళ్తున్న ఓ మహిళ మెడలోంచి గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు చైన్ స్నాచింగ్ పాల్పడిన ఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. వనస్థలిపురం సీఐ జలంధర్ రెడ్డి పర్యవేక్షణలో డిటెక్టివ్ సీఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్జీవోస్ కాలనీ లేబర్ అడ్డా 8వ రోడ్డులో నివసిస్తున్న అనుశెట్టి సీతామాలక్ష్మి స్థానిక ఎన్జీవోస్ కాలనీ బట్టల దుకాణంలో విధులు నిర్వహిస్తుంది. ఎప్పటిలాగానే బుధవారం రాత్రి తొమ్మిది గంటలకు షాపు నుంచి ఇంటికి బయలుదేరి వస్తుండగా...మార్గమధ్యలో ద్విచక్ర వాహనంపై వచ్చిన గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు ఆమె మెడలోని 8 గ్రాములు విలువ గల పుస్తెల తాడుని లాక్కొని పారిపోయారు. వెంటనే ఆమె వనస్థలిపురం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అనాథ అమ్మాయి పెండ్లికి ఉప్పల ఫౌండేషన్ చేయూత



నవతెలంగాణ -నాగోల్

ఓ అనాథ అమ్మాయి పెళ్లికి ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, ఉప్పల్ ఫౌండేషన్ చైర్మన్ ,జాతీయ కార్యదర్శి ఉప్పల్ శ్రీనివాస గుప్త సహాయ, సహకారాలు అందించి చేయూతనిచ్చారు. హైదరాబాద్‌లోని నాగోల్‌లో ఉన్న ఉప్పల శ్రీనివాస్ గుప్త క్యాంప్ కార్యాలయంలో గురువారం సిద్దిపేట జిల్లా, పొన్నాల గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన ఓ అనాథ అమ్మాయి భూమిక.. తన మిత్రురాలు రజితతో కలిసి తన వివాహానికి సాయం అందించాలని ఉప్పల్ శ్రీనివాస గుప్తను కోరింది. ఈ సందర్భంగా ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉప్పల శ్రీనివాస్ గుప్త వారి సతీమణి, ఉప్పల ఫౌండేషన్ కో-చైర్ పర్సన్ ఉప్పల స్వప్న చేతుల మీదుగా మంగళ సూత్రం, మెట్టెలు, చీర, గాజులను అందజేశారు.

కళలు, కళాకారులను
గౌరవించే సంస్కృతి తెలంగాణ ప్రభుత్వానిది

- ఎమ్మెల్సీ తక్కల్లపల్లి రవీందర్రావు, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మెన్ శ్రీనివాస్ గుప్త



నవతెలంగాణ- నాగోల్

తెలంగాణ ప్రాంత కళలు, కళాకారులను గౌరవించే సాంస్కృతి తెలంగాణ ప్రభుత్వానికి ఉందని శాసన మండలి సభ్యులు తక్కలపల్లి రవీందర్రావు, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస గుప్తలు అన్నారు. హైదరాబాద్ నగరంలోని రవీంద్రభారతిలో కె.వి రమణమూర్తి కూతురు రాయవరపు భువన కళా వేదిక ఆధ్వర్యంలో గురువారం జరిగిన కళా సేవ పురస్కారాలు 2023 ప్రధానోత్సవ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తర్వాత వివిధ కళాకారులు, కళలలో ప్రతిభ కనబరిచిన వారందరికీ కళా వేదిక పురస్కారాలను, ప్రశంస పత్రాలను అందజేసి వారిని సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస గుప్తను ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం బంగారు బాటలో నడుస్తుందన్నారు. సంక్షేమ పథకాల అమలులో రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే నెంబర్ వన్ గా నిలిచిందని కొనియాడారు. తెలంగాణ ఉద్యమంలో పాటలు ఎంతో కీలకపాత్ర పోషించాయని గుర్తుచేశారు. తెలంగాణ భాష, యాస, సాంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకుందామని ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రవీందర్రావు, మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తలు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ దర్శకులు సినీ నటులు కుంచె రఘు, ఇన్నా మేనేజింగ్ డైరెక్టర్ జి. శ్రీను, ఇతర నటులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

ధనార్జనే ధ్యేయంగా పని చేస్తున్న ప్రభుత్వాలు



నవతెలంగాణ, బడంగ్‌పేట్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ..ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తున్నాయని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహా రెడ్డి విమర్శించారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధి జల్‌పల్లి మున్సిపాలిటీలోని సందేశ్ నగర్ కాలనీలో గురువారం బీఆర్ఎస్ పార్టీ నుండి కొందరు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి, టీపీసీసీ కార్యదర్శి ఎల్మేటి అమరేందర్ రెడ్డిలతో పాటు మేయర్ పారిజాత నర్సింహా రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ స్థానిక నాయకులు అహ్మద్ బాయ్ ఆధ్వర్యంలో సుమారు 150 మంది మైనార్టీ సోదరులు, మహిళలు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు నచ్చకనే పార్టీలు మారుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాదిక్, ఒబీద్, యూసుఫ్ ఖాద్రి, ఫజిల్ ఖాద్రి, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

పదిలో లిటిల్ ఏంజెల్స్ కాన్వెంట్ స్కూల్ అద్భుత విజయాలు

నవతెలంగాణ - సిటీ బ్యూరో



పదో తరగతి పరీక్షా ఫలితాలలో తమ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని లిటిల్ ఏంజెల్స్ కాన్వెంట్ స్కూల్ డైరెక్టర్ డాక్టర్ అన్నపూర్ణ, డైరెక్టర్, ప్రిన్సిపాల్ నరేందర్ రెడ్డిలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా స్కూల్ నందు ఐఐటీ అండ్ మెడిసిన్ ఫౌండేషన్, కంప్యూటర్ ల్యాబ్ లో మంచి అనుభవం ఉన్న ఉపాధ్యాయులు ఉన్నారని చెప్పారు. తల్లీదండ్రుల ప్రోత్సాహంతో ఉపాధ్యాయులు ప్రతీ విద్యార్థి పట్ల శ్రద్ధ వహించడంతో పాటు పిల్లలకు ఒకటి రెండు సార్లు పాఠాలు చెప్పడం, విద్యార్థులకు క్వాలిటీతో కూడిన విద్యను అందించడం వలన ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని వివరించారు. ఉపాధ్యాయులు పాఠాలు బోధించేటప్పుడు విద్యార్థులు చాలా ఆసక్తిగా శ్రద్ధతో వినేవారని చెప్పారు. కారణం ఏమిటంటే విద్యార్థులను ఆటపాటలతో ఉత్తేజపరుస్తూ మానసిక ఇబ్బందులు లేకుండా చదువు చెప్పేవారని తెలిపారు. అంతేకాదు విద్యార్థులకు జీవిత లక్ష్యాలను నిర్దేశిస్తూ వారి భవిష్యత్‌కు బాటలు వేస్తున్నామని చెప్పారు. పిల్లలు ఇష్టపడి చదివి ఉన్నత స్థానంలో స్థిరపడితే ఉపాధ్యాయులుగా మాకు, వారి తల్లీదండ్రులు ఎంతో సంతోషిస్తారని అన్నారు. పదో తరగతి పరీక్షా ఫలితాలలో వైభవ్ కుమార్ రెడ్డి 10/10, హాసిని 10/10, శ్రీయ 9.8, నవీన్ 9.7, రిషిత 9.5, అజయ్ కుమార్ 9.3, రమ్యశ్రీ 9.3, కుషాల్ సాయి 9.3, మణికంఠ 9.2 సాధించినట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లీదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్ జనగామ నూతన కార్యవర్గం ఏర్పాటు



నవతెలంగాణ-సిటీబ్యూరో

పబ్లిక్ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్ జనగామ జిల్లా నూతన కార్యవర్గంను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జనగామ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రశాంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశానికి అసోసియేషన్ సెంట్రల్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ కత్తి జనార్దన్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పూర్ణచందర్, రాష్ట్ర సలహాదారులు డాక్టర్ కిరణ్, డాక్టర్ ప్రవీణ్, వర్కింగ్ కమిటీ ప్రతినిధులు డాక్టర్ నిఖిల్, డాక్టర్ వంశీ, డాక్టర్ శశికాంత్, డాక్టర్ అశోక్ పాటు జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డాక్టర్ సుధీర్, డాక్టర్ అశోక్, డాక్టర్ రవీందర్, డాక్టర్ భాస్కర్ హాజరై నూతన కార్య వర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జన గామ డీ అండ్‌హెచ్ఓ డాక్టర్ ప్రశాంత్ మాట్లాడుతూ పబ్లిక్ హెల్త్ డాక్టర్లు పేద ప్రజలకు చిత్తశుద్ధితో వైద్య సేవలు అం దించి జనగామ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కత్తి జనార్దన్ మాట్లాడుతూ నూతన కార్యవర్గం ఐక్యంగా ఉండి వైద్యుల సమస్య లను పరిష్కరించడంలో చురుకుగా పని చేయాలని కోరారు.

నూతన కార్యవర్గం ఇలా..

అధ్యక్షులుగా డాక్టర్ రాజమౌళి, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ప్రవీణ్, కోశాధికారిగా డాక్టర్ హరి, ఉపాధ్యక్షులు-1గా డాక్టర్ ప్రణీత, ఉపాధ్యక్షులు-2గా డాక్టర్ కమల్ హాసన్, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ విజయ్ కిరణ్, నామినేటెడ్ ప్రతినిదులుగా డాక్టర్ రవితేజ, డాక్టర్ రాజు, డాక్టర్ ఆదినారాయణ, డాక్టర్ విష్ణు, డాక్టర్ సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ మానస, డాక్టర్ శ్రీవిద్య, డాక్టర్ జ్యోతి, డాక్టర్ సంధ్య, డాక్టర్ కిషోర్, డాక్టర్ జనార్ధన్, డాక్టర్ ఇంజమామ్ అలీ ఉన్నారు.

'విద్యాలయాల్లో మౌలిక వసతులు కల్పించాలి'

నవతెలంగాణ- బడంగ్‌ట్

విద్యా సంత్సరం ప్రారంభంలోనే విద్యాలయాల్లో మౌలిక వసతులు , విద్యా వాలంటీర్లను నియమించాలని మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇంచార్జి అందెల శ్రీరాములు యాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్ గుల్ లోని పలు కాలనీవాసులతో జన్ సంపర్క్ అభియాన్ అనే ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభం అవుతున్నాయని..విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులను అందుబాటులోకి తీసుకొనిరావాలన్నారు.అనంతరం జన్ సంపర్క్ అభియాన్ లో భాగంగా కేంద్ర పథకాలతో పాటు ప్రధాని మోడీ అమలు చేసిన పథకాలు, దేశ భద్రత, యువతకు భరోసా ఇచ్చే కార్యక్రమాలను వివరించారు. తర్వాత కాలనీలోని డ్రెయినేజీ, రోడ్లు, మంచినీటి సరఫరాను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి, కార్పొరేటర్ గుడెపు ఇంద్రసేన, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ 7
మల్కాజిగిరి
శుక్రవారం 09 జూన్ 2023

వెస్ట్ వెంకటాపురంలో కార్పొరేటర్, అధికారుల పర్యటన

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్ రావు ఆదేశాల మేరకు గురువారం వెంకటాపురం డివిజన్ కార్పొరేటర్ సబితా అనిల్ కిశోర్ అధికారులతో కలిసి డివిజన్ పరిధిలోని వెస్ట్ వెంకటాపురం రోడ్డు నెం.10లో పర్యటించారు. ఈ సందర్భంగా నాలా డీసిల్టింగ్ పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నాలా పూడికతీత పనులు ముమ్మరం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ విజయశ్రీ, డీఈ కార్తీక్, ఏఈ అరుణ్, బీఆర్ఎస్ నాయకులు భాస్కర్, సంతోష్, లోకేష్, జనార్దన్, కుట్టి, ప్రబాకర్, మల్లు, ప్రబాకర్, మోస్, ప్రబాకర్, శ్యామ్ సుందర్, రఘుపతి రెడ్డి, లక్ష్మి, కల్పన, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారుల ఆగడాలకు ముకుతాడు

నవతెలంగాణ-జవహర్‌నగర్



కబ్జాదారుల ఆగడాలకు ముకుతాడు వేస్తామనీ, సర్కారు భూముల జోలికొస్తే క్రిమినల్ చర్యలు తప్పవని గిర్దావర్ విశ్వనాథ్ హెచ్చరించారు. గురువారం కార్పొరేషన్‌లోని సర్వే నెం.226 టామటా తోటలో ప్రభుత్వ సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ కార్పొరేషన్‌లోని ప్రభుత్వ భూముల పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. కబ్జాదారుల కదలికలపై నిఘా ఉంచామని చెప్పారు. ఇప్పటికే కొంత మంది అక్రమార్కులపై క్రిమినల్ కేసులు నమోదు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సహాయకుడు నాగరాజ్ పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి

- 11న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలు
- హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-సిటీబ్యూరో



తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిర్వహించనున్న గ్రూప్ -1 ప్రిలిమినరీ పరీక్ష-2023 సజావుగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. గురువారం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని ఆడిటోరియంలో గ్రూప్-1 నిర్వహణపై అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రిలిమ్స్ పరీక్షకు జిల్లాలో 50,808 మంది అభ్యర్థులు హాజరు అవుతారని తెలిపారు. అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా 109 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకున్న అడ్మిట్ కార్డుతో పాటు గుర్తింపు కార్డును తప్పనిసరిగా వెంట తీసుకురావాలన్నారు. పరీక్షా కేంద్రాలను ఒకరోజు ముందుగా శానిటైజ్ చేయాలని సంబంధిత అధికారులకు తెలియజేశారు. ఉదయం 8.30 నుంచి 10.15 గంటల వరకు మాత్రమే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారని చెప్పారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, పర్సులు పరీక్షా సెంటర్లలోకి అనుమతించరని స్పష్టం చేశారు. వైద్య ఆరోగ్యశాఖ ఏఎన్ఎంతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలనీ, పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖను కోరారు. వెన్యూ సూపెర్‌వైజర్లు ప్రవేశ ద్వారం వద్ద శానిటైజర్‌ను అభ్యర్థులకు అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్ష సమయంలో ఎలాంటి విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి సమస్య లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద వెన్యూ సూపర్‌వైజర్లతో పాటు 109 మంది లోకల్ ఇన్స్‌పెక్షన్ ఆఫీసర్లు ఉంటారనీ, 30 మంది రూట్ ఆఫీసర్లను నియమించినట్టు తెలిపారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో పై అధికారులను సంప్రదించాలని సూచించారు. పోలీస్ సంయుక్త కమిషనర్ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఇంటర్నెట్ సెంటర్లను మూసివేస్తామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద అభ్యర్థులను స్కానింగ్ చేయడానికి ముగ్గురు మగ పోలీసులు, ఇద్దరు ఉమెన్ పోలీసులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారి సూర్యలత, డీసీపీ బాబు రావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కులను హరిస్తున్న బీజేపీ విధానాలను ఐక్యంగా ప్రతిఘటించాలి



నవతెలంగాణ-కాప్రా

దళితులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను హరిస్తున్న బీజేపీ మతోన్మాద విధానాలను ఐక్యంగా ప్రతిఘటించాలని డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ పిలుపునిచ్చారు. ఈసీఐఎల్ కార్యాలయంలో జిల్లా స్థాయి సమావేశం జిల్లా అధ్యక్షుడు గాలం లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మారుపాక అనిల్ కుమార్ మాట్లాడుతూ దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కులం, మతం పేరుతో విద్వేషాలు రెచ్చగొడుతూ ప్రజల మధ్య చిచ్చు పెడుతుందన్నారు. రాజ్యాంగాన్ని తీసివేసి మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయటానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తుందన్నారు. దళితులు ప్రతి ఒక్కరూ తీవ్రంగా ప్రతిఘటించాలన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ రిజర్వేషన్ల ప్రకారం ఖాళీ ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలన్నారు. ప్రభు త్వ రంగాన్ని ప్రయివేటు పరం చేస్తున్న బీజేపీ విధానాలు దళితుల సామాజిక న్యాయానికి పూర్తి వ్యతిరేకంగా ఉందన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ రెండో విడత దళిత బంధు నియోజకవర్గానికి 1500 మందికి ఇవ్వాలనీ, ఇంటి స్థలం ఉన్న వారికి సొంత ఇల్లు నిర్మించుకోవడానికి రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళిత బంధు పేరుతో ఎస్సీ కార్పొరేషన్‌లో పెండింగ్ రుణాలు విడుదల చేయడం లేద న్నారు. 2021-22 పెండింగ్ రుణాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో బాధితు లకు రావాల్సిన ఎక్స్ గ్రేషియో కొంతకాలంగా పెండింగు లో ఉంచి నిర్లక్ష్యం చేస్తుందన్నారు. జూన్ 16, 17, 18 తేదీల్లో వరంగల్‌లో రాష్ట్ర స్థాయి రాజకీయ విజ్ఞాన శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు ఆయన చెప్పారు. మొత్తం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం ద్వారా రిజర్వే షన్లు రద్దు కావడంతో సామాజిక న్యాయాన్ని సమాధి చేస్తుందన్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టి సమాజంలో అశా ంతిని సృష్టించడం ద్వారా దేశ ప్రజల మధ్య విభజనను రెచ్చగొడుతుందన్నారు. నూతన విద్యా విధానం పేరిట రిజర్వేషన్లు రద్దు చేసి డబ్బులున్న కొందరికి ఉన్నత విద్యను అందిస్తూ తిరిగి మనువాద విద్యా విధానాన్ని ప్రవేశపెడు తుందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి వై.ఉషశ్రీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.రాములు, జిల్లా కార్యదర్శి కె.సహదేవ్, కె.సుగుణ, పి.రాధిక, యాదగిరి, రమేష్, భిక్షపతి, నర్సింగరావు, కనకయ్య సాయిలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మేలు



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు ఎంతో మేలు జరుగుతుందని కాంగ్రెస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు నందికంటి శ్రీధర్ అన్నారు. గురువారం నందికంటి శ్రావణ్ కుమార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముత్తూట్ ఎంజార్జ్ ఫౌండేషన్ సంస్థ వారి సౌజన్యంతో మౌలాలి డివిజన్ పరిధిలోని ఆడమ్స్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ వైద్య శిబిరంలో కిడ్నీ, గుండె, లివర్, షుగర్, బీపీ తదితర వ్యాధులతో బాధపడుతున్న రోగులకు ఉచిత వైద్య పరీక్షలు చేయనున్నట్టు తెలిపారు. ఈ డివిజన్‌లో మరో రెండు రోజులు పాటు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ నెల 9వ తేదీన భరత్ నగర్ కమ్యూనిటీ హాల్, 10న గాంధీ నగర్ కమ్యూనిటీ హాల్ వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామనీ, వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీ బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు వంశీ ముదిరాజ్, కంటెస్టెడ్ కార్పొరేటర్ ఉమామహేశ్వరి వినోద్ యాదవ్, బీసీ సెల్ చైర్మన్ వినోద్ యాదవ్, మీడియా కన్వీనర్ గుత్తి రామచందర్, ఎస్సీ సెల్ చైర్మన్ సానాది శంకర్, శ్రీనివాస్ గౌడ్, రాములు, నరసింహ, కిరణ్, ముక్తార్, చక్రం, సలీం, అమిత్ భాయ్, అరుణ్, నర్సింగ్, విట్టల్ ముదిరాజ్, సూర్య ప్రకాష్, వేణు, చంద్రకళ, భాగ్యరాణి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలిని నమ్మించి బంగారం ఎత్తుకెళ్లిన నకిలీ వైద్యుడు

నవతెలంగాణ-బేగంపేట్

గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ వైద్యుడు చేతివాటం ప్రదర్శించాడు. నిమ్స్ ఆస్పత్రిలో సర్జన్ అని వృద్ధురాలిని నమ్మించిన వ్యక్తి ఆమె మెడపై ఉన్న బంగారాన్ని వెతికెళ్లినట్టు గోపాలపురం డీఐ వేణు గోపాల్ తెలిపారు. బుధవారం సాయంత్రం బాధితురాలు పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసింది. డీఐ వివరాల ప్రకారం 30 వేల విలువైన బంగారు ఆభరణాలతో పాటు సెల్ ఫోన్‌ను అపహరించినట్టు పోలీసులు తెలిపారు. సుజాత అనే మహిళను రైల్‌లో పరిచయం చేసుకున్న సదరు వ్యక్తి వైద్యుడినని చెప్పడంతో సుజాత తనకు ఉన్న ఆరోగ్య సమస్యను అతనికి వివరించింది. ఇద్దరూ సికింద్రాబాద్ వరకు ఒకే రైల్లో ప్రయాణం చేశారు. సుజాత తన సమస్యలకు సంబంధించి చికిత్స నిమిత్తం తనను కలిసేందుకు గురుద్వారా వద్ద ఉన్న సాయి వినాయక లాడ్జిలోకి రమ్మని చెప్పడంతో ఆమె అక్కడికి వెళ్లింది. అనంతరం ఆమెకు మత్తుమందు ఇచ్చి మెడ పై ఉన్న 10 గ్రాముల బంగారంతో పాటు సెల్ ఫోన్ను లాక్కుని పారిపోయాడు. విషయం గమనించిన రాజ్య సిబ్బంది పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీసీ కెమెరాల ద్వారా దర్యాప్తు ప్రారంభించారు.

రాజధాని కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ప్రయివేటు లిమిటెడ్ బ్యాంకు ప్రారంభం

నవతెలంగాణ-కాప్రా

ఏఎస్ రావు డివిజన్‌లోని మహేష్ నగర్‌లో రాజధాని కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ప్రైవేట్ లిమిటెడ్ వారి నూతన బ్యాంకు బ్రాంచ్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాజధాని బ్యాంకు చైర్మన్ వేమిరెడ్డి నరసింహారెడ్డి, వైస్ చైర్మన్ జైపాల్ రెడ్డి, డైరెక్టర్లు బి.ఆర్.రెడ్డి, విజయ గోపాల్ రెడ్డి, వీణ, ఘనశ్యామ్ భాటి, క్రాంతి రెడ్డి, నిర్మలాదేవి, నర్సింగరావు శ్రీరాములు, జనరల్ మేనేజర్ ఆదినారాయణ రెడ్డి, కుషాయిగూడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, స్థానిక కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ పావని మణిపాల్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



భర్త మరణంతో భార్య మనస్థాపం

- మల్కారం చెరువులో దూకి ఆత్మహత్యాయత్నం
- కాపాడిన కానిస్టేబుల్ ఇంతియాజ్

నవతెలంగాణ-జవహర్‌నగర్



భర్త మరణం తట్టుకోలేకక భార్య మనస్థాపానికి గురై మల్కారం చెరువులో దూకి ఆత్మహత్యయత్నానికి పాల్పడిం ది. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకా రం కార్పొరేషన్‌లోని వైఎస్సార్నగర్‌కు చెందిన మమత నలుగురు కుమార్తెలతో కలిసి నివాసం ఉంటుంది. కొంత కాలంగా అనారోగ్యానికి గురైన భర్త సుమంత్ ఇటీవలె మరణించాడు. భర్త మరణంతో నలుగురు ఆడపిల్లలను సాదలేక ఆర్థిక ఇబ్బందులకు లోనవుతుంది. కూలీ పను లు చేస్తూ జీవనం సాగించే మమతకు ఇంట్లో గడవడమే కష్టంగా మారింది. దీంతో మనస్థాపానికి గురై మల్కారం చెరువులో దూకి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. స్థాని కంగా చేపలు పడుతున్న జాలరులు గమనించి వెంటనే 100కు డయల్ చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న కానిస్టేబుల్ ఇంతియాజ్ మహిళను కాపాడి బయటకు తీశాడు. అపస్మారస్థితిలోకి వెళ్ళిన మమతను 108లో గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడా ఉందని తెలిపారు. మహిళ ప్రాణాలను కాపాడిన కానిస్టేబుల్ ఇంతియాజును పోలీసు అధికారులు, జవహర్‌నగర్ ప్రజలు అభినందిస్తున్నారు.

నాగారంలో ఘనంగా చెరువుల పండుగ

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్



రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చెరువుల పండుగ దినోత్సవం సందర్భంగా అన్నారాయన చెరువు వద్ద ఘనంగా బతుకమ్మ, బోనాలు కార్యక్రమం నిర్వహించి, సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ బి.మల్లేష్ యాదవ్, కౌన్సిలర్లు బిజ్జ శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు అన్నంరాజు సురేష్, శ్రీనివాస్, కౌకుంట్ల కృష్ణారెడ్డి, దయాకర్, కార్యాలయం మేనేజర్ చంద్రశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామ్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి

- తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు

నవతెలంగాణ-జవహర్‌నగర్

మాయమాటలు చెప్పి ఓ వ్యక్తి మైనర్‌పై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లి ఫిర్యాదుతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీతారాం వివరాల ప్రకారం దమ్మాయిగూడలో అనిల్ అనే ట్రావెల్స్ వ్యాపారం నడిపిస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి చిన్నప్పటి నుంచి పరిచయం ఉన్న మహిళ బోడుప్పల్‌లో నివాసం ఉంటుంది. అదే పరిచయంతో ఆమెతో తరచూ మాట్లాడుతుండటంతో మహిళ కూతురుపై కన్నేశాడు. అదను చూసి మైనర్‌పై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



నవతెలంగాణ-నాచారం

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పల్లవి గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్ సీఓఓ మల్కా యశస్వి అన్నారు. ఎకో భారత్ ప్రాజెక్ట్‌లో భాగంగా శ్రీ అవని ఎంటర్ప్రైజెస్‌తో కలిసి బయోడిగ్రేడబుల్ బ్యాగ్స్‌ను గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, పల్లవి గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ చైర్మన్ మల్కా కొమరయ్య చేతుల మీదుగా ఆవిష్కరించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి పౌరుడూ పాటుపడాలన్నారు. సమాజంలో ప్లాస్టిక్ వాడకం విపరీతంగా పెరిగిపోయి పర్యావరణ సమతుల్యత ప్రమాద స్థితిలో పడిందన్నారు. పర్యావరణ పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గుర్తు చేస్తూ పర్యావరణానికి హాని చేయని బ్యాగ్స్ విడుదల చేసిన ఎకో భారత్ బయోడిగ్రేడబుల్ బ్యాగ్స్ మార్కెట్లోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడినప్పుడే సమాజంలో పర్యావరణం రక్షించబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గద్వాల్ మున్సిపల్ చైర్మన్ బి.ఎస్ కేశవ్, సినీ నటుడు చిత్రం శ్రీను, చిట్టి బాబు, గడ్డం నవీన్, సింధు, మాళవిక, చెన్నయ్య రమేష్ నాయుడు, శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.

పేద విద్యార్థిని ఎంబీబీఎస్ చదువుకు బీఎల్ఆర్ ట్రస్ట్ చేయూత

నవతెలంగాణ-నాచారం



కష్ట జీవుల కన్న బిడ్డలు కలలు నెరవేర్చేందుకు బీఎల్ఆర్ ట్రస్ట్ అన్ని విధాల ఆదుకుంటుందని ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మల్లాపూర్ నెహ్రూనగర్‌కు చెందిన ఆటో నడుపుకుని జీవనం కొనసాగించే నరసింహారావు కుమార్తె గీతాంజలి ఎంబీబీఎస్ ఖమ్మం మెడికల్ కాలేజీ లో మొదటి సంవత్సరం పూర్తి చేసుకుంది. రెండో సంవ త్సరం ఫీజును రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్వర్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గీతాంజలి ఎంబీబీఎస్ చదువు పూర్తి చేసేంత వరకు బీఎల్ఆర్ ట్రస్టు అండగా ఉంటుందని హామీ ఇచ్చిన ప్రకారం మొదటి సంవత్సరం ఫీజులను ఖమ్మం మమతా కాలేజీకి అందజేసి, రెండో సంవత్సరం ఫీజులను మంత్రి సమక్షంలో ఇచ్చారు. గీతాంజలి మెడిసిన్ పూర్తి చేసి తాను పొందిన సహాయాన్ని కృతజ్ఞత ా‌గా పేద, మధ్య తరగతి ప్రజలకు ఉచితంగా వైద్య సేవల ను అందిం చాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, బీఎల్ఆర్ ట్రస్ట్ ప్రతినిధులు కటార్ల భాస్కర్, మహేష్‌గౌడ్, స్థానిక నాయకులు బాబు, నరేష్, కాల్వల అంజి, ప్రవీణ్, దీపక్ పాల్గొన్నారు.

డ్రగ్ కంట్రోల్ అధికారుల మెరుపు దాడులు

- పలు మెడికల్ షాపుల లైసెన్స్‌లు రద్దు

నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలో మెడికల్ దుకాణాలపై డ్రగ్ కంట్రోల్ విభాగం అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. ఈక్రమంలో అధిక ధరలు, నాణ్యత లేని మందుల అమ్మకాలను గుర్తించిన అధికారులు పలు మెడికల్ దుకాణాల లైసెన్స్‌లను శాశ్వతంగా, మరికొన్నింటికి తాత్కాలికంగా రద్దు చేశారు. ఇందర్‌బాగ్ కోఠిలోని గణేష్ ఫార్మాసూటికల్స్, అంబర్‌పేట బయోస్పియర్ ఎంటర్‌ప్రైజెస్, నాంపల్లి సర్దార్ మెడికల్ హాల్, అక్షయ మెడికల్ అండ్ జనరల్ స్టోర్, హైదరాబాద్ మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్(నాంపల్లి), లంగర్‌హౌజ్‌లోని ఆర్ఎస్ మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్, చార్మినార్ భారత్ మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్, హుమాయూన్‌నగర్ అల్-హమ్రా మెడికల్ అండ్ జనరల్ స్టోర్‌తోపాటు ఉప్పల్ శ్రీ అయ్యప్ప మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్, గౌలిగూడ గోకుల్ మెడికల్ షాప్, చార్మినార్ మీరా మెడికల్ షాప్, మంగర్‌బస్తీ లైఫ్ ఫార్మా ఇలా పలు మెడికల్ షాపులపై డ్రగ్ కంట్రోల్ అధికారులు దాడులు నిర్వహించారు. వీటిలో కొన్నింటి లైసెన్స్‌లను రెండు రోజుల నుంచి వారం రోజులపాటు రద్దుచేయగా, మరికొన్నింటి లైసెన్స్‌లను శాశ్వతంగా రద్దు చేశారు.

నవతెలంగాణ 8
హైదరాబాద్
శుక్రవారం 09 జూన్ 2023

ముషీరాబాద్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే ముఠాగోపాల్



నవతెలంగాణ-అడిక్‌మెట్

ముషీరాబాద్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తాం అని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. నియో జకవర్గం లోని అడిక్ మెట్ డివిజన్ ఎస్వీఎస్ స్కూల్ పక్క లైన్‌లో రూ15 లక్షల వ్యయంతో విడీసీసీ రోడ్లు, అచ్యుత రెడ్డి మార్గ్ రూ. 18 లక్షల వ్యయంతో విడీసీసీ రోడ్లు, ఫాతిమా మసీద్ దగ్గర మూడు లక్షల వ్యయంతో స్లాప్ వర్క్ పనులను స్థానిక కార్పొరేటర్ సునీత ప్రకాష్ గౌడ్ తో కలిసి ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రారంభించారు. ప్రజలు ఎటువంటి ఇబ్బందులైనా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. సమస్య పరిష్కారానికి వెంటనే కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు జయసింహ, స్థానిక డివిజన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి,కార్యదర్శి సురేందర్, మనోహర్ సింగ్, రవి యాదవ్, ఖదీర్, కిషోర్, మల్లికార్జున్ రెడ్డి, ఖలీల్, టైలర్ శ్రీను, శ్రీధర్ రెడ్డి, సాయి చాణిక్య రెడ్డి, జిహెచ్ఎంసి అధికారులు డీ ఈ సన్నీ, ఆర్ ఐ శివ తదితరులు పాల్గొన్నారు.

బూతు వీడియోలను అప్‌లోడ్ చేసిన హ్యాకర్లు

నవతెలంగాణ-మెహిదీపట్నం

రోజురోజుకీ హ్యాకర్లు రెచ్చిపోతున్నారు. సమాజంలో గౌరవం ఉన్న వ్యక్తుల, సంస్థల సోషల్ మీడియా పేజీలను హ్యాక్ చేస్తూ నానా హంగామా చేస్తున్నారు. తాజాగా హైదరాబాద్‌లో హ్యాకింగ్ వ్యవహారం ఒకటి వెలుగులోకి వచ్చింది. ఈసారి హ్యాకర్లు ఏకంగా పోలీస్ డిపార్ట్‌మెంట్‌ను టార్గెట్ చేశారు. పోలీస్ డిపార్ట్‌మెంట్ ఫేస్‌బుక్ పేజీని హ్యాక్ చేశారు. ఆసిఫ్ నగర్ పోలీస్ స్టేషన్ ఫేస్‌బుక్ పేజీని హ్యాకింగ్ చేసిన ఘటన తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పోలీస్ స్టేషన్ అధికారిక పేజీల్లో సైబర్ నేరగాళ్లు బూతు వీడియోలను అప్లోడ్ చేశారు. విదేశాలకు చెందిన కొందరు మహిళలకు సంబంధించిన బూతు వీడియోలను ఈ పేజీలో అప్లోడ్ చేసినారు. దీంతో వెంటనే అప్రమత్తమైన పోలీస్ అధికారులు సిసిఎస్ లో ఫిర్యాదు చేశారు పోలీసులు విషయాన్ని సీరియస్‌గా తీసుకొని విచారణ జరుపుతున్నారు.

మత్స్య రంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్
- ఎన్‌టీఆర్ స్టేడియంలో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ ప్రారంభం





నవతెలంగాణ- అడిక్‌మెట్

రాష్ట్ర ప్రభుత్వం మత్స్య రంగ అభివృద్ధికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందని పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. గురువారం ఎన్టీఆర్ స్టేడియంలో మత్స్య శాఖ ఆధ్వర్యంలో మూ డు రోజుల పాటు నిర్వహించే ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ ను శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, ఎమ్మెల్యే ము ఠాగోపాల్‌లతో కలిసి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారం భించారు. ఏర్పాటు చేసిన అన్ని స్టాల్స్ ని తిరిగి సందర్శించి చేపలు, రొయ్యలతో చేసిన ఫ్రై, బిర్యానీ, పకోడీ, పులుసు తదితర వంట కాలను పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ .ఎంతో రుచికరమైన వంటకాలతో ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్ ను సందర్శించి వంటకాలను రుచి చూడాలని, వారిని ఆదరించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో మత్స్య రంగం అభివృద్ధి కి ప్రభుత్వం అనేక కార్యక్ర మాలు అమలు చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని నీటి వనరు లలో ప్రతి సంవత్సరం ఉచితంగా చేప పిల్లలను విడుదల చేస్తున్న ట్లు చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రొయ్య పిల్లలను కూ డా ఉచితంగా విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు. మత్స్యకార వృ త్తిపై ఆధారపడి జీవిస్తున్న లక్షలాదిమంది కుటుంబాలలో వెలుగు లు తేవాలనేది ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యం అన్నారు. రాష్ట్రంలో ని వివిధ సొసైటీలలో నూతనంగా 18 సంవత్సరాలు నిండిన అర్హులై న లక్ష మంది మత్స్యకారులకు సభ్యత్వాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన మత్స్యకార యువతకు కూడా వంటకాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత వెయ్యి కోట్ల రూపాయల వ్యయంతో మత్స్యకారులకు ద్వి చక్ర, ట్రాలీ ఆటోలు, ట్రక్కుల ను సబ్సిడీపై అందించిన విషయాన్ని గుర్తు చేశారు. చెరువులపై పూర్తి హక్కులు మత్స్యకారులకు కల్పించినట్లు తెలిపారు. రాష్ట్రంలో 7 వేల కోట్ల రూపాయల విలు వైన మత్స్య సంపద ఉత్పత్తి జరుగుతుందని, రానున్న రోజుల్లో దేశా నికి, ఇతర దేశాలకు చేపలను ఎగుమతి చేసే స్థాయికి తెలంగాణ మత్స్యకా రులు ఎదుగుతారని చెప్పారు. అదేవిధంగా మత్స్యకారుల ఆత్మగౌరవాన్ని పెంచే కోట్ల రూపాయల నిధులను కూడా విడు దల చేసిందని వివరించారు. కార్పొరేటర్ రచన శ్రీ, కంది శైలజ, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి, మత్స్య శాఖ అధికా రులు మురళి, సుధాకర్, చరితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెరువుల అభివృద్ధితో తాగు, సాగునీటి సమస్య పరిష్కారం

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



నవతెలంగాణ-అంబర్‌పేట:

ప్రభుత్వం చేపట్టిన మిషన్‌కాకతీయ ద్వారా చెరువులు అభివృద్ధి చెంది తాగు,సాగునీటి సమస్య పరిష్కా రమైందని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. గురు వారం దశాబ్ది ఉత్సవాల భాగంగా బాగ్ అంబర్‌పేట డివి జన్ పరిధిలోని మోహిని చెరువులో చెరువుల పండుగ కార్య క్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, కార్పొరేటర్లు ఇ.విజ య్ కుమార్‌గౌడ్, దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్ హాజర య్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ ఇది వరకు చెరువులు సరైన నిర్వహణ, పర్యవేక్షణ లేని కారణంగా పూడిపోవడం, ఆక్రమణలకు గురయ్యా య ని, వీటిని పరిరక్షించి వాటికి పూర్వవైభవం తీసుకురా వా లని ముఖ్యమంత్రి ఎంతగానో కృషి చేశారని, ముఖ్య మంత్రి కృషి ఫలితంగానే నేడు చెరువులు నిండుగా నీటితో కళకళ లాడుతున్నాయని వివరించారు. చెరువుల అభివృద్ధి తో పా టు పరిసరాలు ఎంతో సుందరంగా మారి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం లభిస్తుందని అన్నారు. నూతన రిజర్వాయర్‌ల నిర్మాణం, చెరువుల పునరుద్ధరణ, చెక్‌డ్యాంల నిర్మాణంతో గణనీయంగా భూగర్భ జలాలు పెరిగాయని అంబర్‌పేట నియోజకవర్గంలో మోహిని చెరువును రూ.10 కోట్లతో అభివృద్ధి పరిచి సుందరి కారణ దిశగాగా తీర్చు దిద్దుతున్నామని వర్షాకాలంలోపు పెండింగ్ పనులు పూర్తి చేయాలని అధి కారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు లవంగు ఆంజనే యులు, మోర శ్రీరా ములు ముదిరాజ్, ఎర్రబోలు నరసింహా రెడ్డి, రామారావు యాదవ్, లింగారావు, సిద్ధార్థ ముదిరాజ్, రెడ పాక రాము, ఎర్ర భీష్మ దేవ్, భూపతి లక్ష్మణ్, మహేష్ ముదిరాజ్, రమేష్ నాయక్, నాయకులు పాల్గొన్నారు.

విదేశాల్లో చదువుతున్న విద్యార్థులకు సహాయం





నవతెలంగాణ-ఓయూ

ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లే ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థులకు ఇంగ్లీష్ లాంగ్వేజ్ క్వాలి ఫికే షన్ ఉపకార వేతనాలను ఇవ్వనున్నట్లు గ్లోబల్ ఎడ్యుకేషన్ కెరీర్ ఫోరమ్ ఛైర్మన్, తెలంగాణ కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ నవీన్ మిట్టల్ తెలిపారు. ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంట ర్‌ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో జరిగిన కార్యక్రమంలో ఓయూతో జీఈసీఎఫ్ పరస్పర అవగాహనా ఒప్పందం కుదుర్చు కుంది. విదేశాల్లో చదు వుల కోసం సిద్ధమవుతున్న 500 మంది విద్యార్థులకు సంస్థ తరపున స్కాలర్‌షిప్‌లు ఇవ్వనున్నట్లు ఈ సంద ర్భంగా ప్రకటించింది. ప్రపంచ స్థాయి విద్య మాత్రమే కాకుండా గ్లోబల్ కెరీర్ కోసం విద్యార్థులను జీఈసీ ఎఫ్ ప్రోత్సహిస్తుందని నవీన్ మిట్టల్ అన్నారు. గతేడాది సంస్థ నుంచి 150 మందికి ఉపకాం వేతనాలు అందించామని, ఈ ఏడాది 1500 మంది విద్యా ర్థులకు ఉపకారవేత నాలు అందించే లక్ష్యంతో పనిచే స్తున్నామని స్పష్టం చేశారు. తెలంగాణ చాప్టర్ చైర్మెన్ ప్రొ.లింబాద్రి మాట్లాడుతూ విద్యా సంస్థలు, విద్యార్థులు జీఈసీఎఫ్‌తో అనుసంధానం కావటం ద్వారా విదేశీ విద్యపై ప్రామాణికమైన సమాచారాన్ని పొందవచ్చని వివ రించారు. విదేశీవిద్య, కెరీర్ కోసం భాషా నైపుణ్యాలు చాలా కీలకమన్న ఆయన పరిజ్ఞానాన్ని పెం పొందించేందుకు జీఈ సీఎఫ్ కృషి చేస్తుందని తెలిపారు. ఉస్మానియా యూనివర్శిటీ హ్యూమన్ క్యాపిటల్ డెవలప్ మెంట్ సెంటర్, కాలేజియేట్ ఆఫ్ ఎడ్యుకేషన్, జీఈసీఎఫ్ మధ్య త్రైపాక్షిక ఒప్పందం జరిగింది. ఈ కార్యక్రమంలో ఓయూ హెచ్.సి. డి.సి డైరెక్టర్ ప్రొఫెసర్ స్టీవెన్సన్, ఓయూ అకడమిక్ ఆడిట్ సెల్‌డైరెక్టర్ ప్రొ.శ్రీనగేశ్, జీఈసీఎఫ్ కార్యదర్శి లక్ష్మీనారా యణ పాల్గొన్నారు. 80 వరకు ఓయూ అనుబంధ కళా శాలల ప్రిన్సిపల్స్, ప్రతినిధులు పాల్గొన్నారు.

'ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్‌గా డాక్టర్ దిడ్డి సుధాకర్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

రాష్ట్రంలో ఆమ్ ఆద్మీ పార్టీ చాపకింద నీరులా విస్తరిస్తు ందని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బోణి కోడుతామని ఆప్ తెలంగాణ రాష్ట్ర నూతన కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం హిమాయత్ నగర్, లిబ ర్టీ సర్కిల్ వద్ద ఉన్న ఆప్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో డాక్టర్ దిడ్డి సుధాకర్ మా ట్లాడుతూ.. ఆప్ తెలంగాణ ఇన్‌ఛార్జీ, ఎమ్మెల్యే సోమనాథ్ భారతి తనను తెలంగాణ రాష్ట్ర నూతన కన్వీనర్‌గా నియ మిం చారని, తనతో పాటు పలువురిని నూ తన తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులుగా నియ మిం చారని ఈ మేరకు ఢిల్లీలో నియామక పత్రాలను సోమనాథ్ భారతి అందజేశా రని వెల్లడించారు. ఈ సమావేశంలో వందలాది మంది ఆప్‌నేతలు, కార్యకర్తలు శాలువాలతో సత్కరించి గజ మా లలు వేసి డాక్టర్ దిడ్డి సుధాకర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



మీర్‌పేట హెచ్‌బీ కాలనీ డివి జన్ మం గాపురం కాలనీలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం ముఖద్వారంను ఉప్పల్ ఎమ్మె ల్యే బేతి సుభాష్ రెడ్డి స్థానిక కార్పొరేటర్ జెర్రి పోతుల ప్రభు దాసుతో కలిసి ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీవా సులు, బీఆర్ఎస్ నాయకులు, పాల్గొన్నారు.

నవతెలంగాణ-కాప్రా

డబ్బులు దండుకోవడానికే కాళేశ్వరం

-మా తెలంగాణ పార్టీ



నవతెలంగాణ-బంజారాహిల్స్

కమీషన్ల పేరిట డబ్బులు దం డుకోవడానికే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారని మా తెలంగాణ పార్టీ అధ్యక్షుడు వీరారెడ్డి ఎద్దేవా చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు ఒక్క పంపు నుండి కూడా నీరు ఎత్తిపోసింది లేదు. ఎత్తిపో తల పేరిట విద్యుత్తు బిల్లులు జేబులో వేసుకుంటు న్నారని, దీని మీద విచారణ చేప ట్టాల్సిన బీజేపీ ప్రభుత్వం కూడా వారికి సహకరిస్తున్నట్టే కనపడుతుందన్నారు. రాబోవు ఎన్నికలలో 119 స్థానాల్లో మా తెలంగాణ పార్టీ నుంచి అభ్యర్థులను నిలబెట్టి అధికారంలోకి వచ్చాక ఇప్పుడు ప్రభుత్వంలో ఉన్న ప్రతి ఒక్క అవినీతిపరుడిని జైలుకు పంపించడం ఖాయమనీ ఈ సందర్భంగా తెలిపారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా యువత, మహిళలకు సమాన ప్రాధాన్యత ఇచ్చి పోటీకి దిగుదామని వారు ప్రకటించారు.

ఆదుకున్న పద్మారావు



నవతెలంగాణ-ఓయూ

అత్యవసర పరిస్థితుల్లో బాధితు లకు తాను అండగా నిలుస్తానని డిప్యూ టీ స్పీకర్ తీగుల్ల పద్మారావుగౌడ్ మరో సారి నిరూపించుకున్నారు. సితాఫల మండీకి చెందిన రాఘవేందర్ రెండు రోజుల క్రి తం రోడ్డు ప్రమాదానికి గురై ఆర్‌టీసీ క్రాస్ రోడ్స్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొం దుతున్నాడు. ఈ సమాచారం తెలిసిన వెంటనే డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ స్పందించి ఆస్పత్రి వైద్యులతో సంప్రదించి మెరుగైన వైద్యం అందించాల్సిందిగా సూచించారు. అదే విధంగా ముఖ్యమంత్రి కార్యాలయాన్ని సంప్రదించి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.3 లక్షల లేటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌ఓసీ)ని సమకూర్చారు. ఈ పత్రాలను డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ బుధవారం రాత్రి కార్పొరేటర్ సామల హేమతో కలిసి ఆస్పత్రిలో రాఘవేందర్ చికిత్సకు చర్యలు తీసుకొన్నారు.

కమ్యూనిటీహాల్‌లో వార్డ్ ఆఫీసు పనులు చేపడితే అడ్డుకుంటాం

గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్



నవ తెలంగాణ-అడిక్‌మెట్

జవహర్ నగర్ కమిటీ హాల్‌లో జిహెచ్ఎంసి వార్డు ఆఫీస్ పనులు చేపడితే అడ్డుకొని తీరుతామని గాంధీ నగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ తెలిపారు. జవహర్ నగర్ కమిటీహాల్‌లో వార్డు ఆఫీస్ ఏర్పాటు పనులు చేప డుతున్నారన్న సమాచారంతో కార్పొరేటర్ పావని స్థానికుల తో కలిసి ఏర్పాటు పనులను అడ్డుకున్నారు ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ జవహర్‌నగర్ కమిటీహాల్లో జీహెచ్ఎంసీ వార్డ్ ఆఫీస్ నిర్మాణ పనులు చేపట్టవద్దని జీహెచ్ఎంసిఈ జోనల్ కమిషనర్‌లకు ఇది వరకే వినతి ప త్రాన్ని సమర్పించినట్లు తెలిపారు. వార్డ్ ఆఫీస్ ఏర్పాటును కమిటీ హాల్ కాకుండా మరోచోటకు మార్చేందుకు జీహెచ్ ఎంసీ జోనల్ కమిషనర్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ జీహెచ్ఎంసీ అధికారులు ఎందుకు ఏర్పాట్లకు పూను కుంటున్నారని ఆగ్ర హం వ్యక్తం చేశారు. ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా చర్యలు తీసుకుంటే ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరిం చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నగర యువ నా యకులు ఎ.వినయ్ కుమార్, డివిజన్ అధ్యక్షులు రత్న సా యి చంద్, శ్రీకాంత్,ఎం. ఉమేష్.ఆనంద్ రావు, స్థానిక నా యకులు సాయి నాథ్, మర్రిశెట్టి నర్సింగ్ రావు, జి.సురేష్, మల్లేష్, సాయిలు, నాగేశ్వర రావు, కృష్ణ, పాల్గొన్నారు.

రూ.10 లక్షల బీసీ బంధు ప్రకటించాలి





నవతెలంగాణ-జూబ్లీహిల్స్

బీసీ కులాలలోని పేదవారికి అందరికీ కుల వివక్ష చూపకుండా రూ.10లక్షల దళిత బంధు ప్రకటి ంచాలని జూబ్లీహిల్స్ జోన్ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కా లేరు నవీన్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం కులాలను వేరు చేసి ఓటు బ్యాంకుగా మార్చుకుంటున్నారని, బీసీ బంధు ప్రకటించాలని, ఒక లక్ష రూపాయలు బీసీ కులాల వారు ఎవరు తీసుకోవద్దని, రూ.10 లక్షలు ఇచ్చేవరకు అన్ని బీసీ కులాలు ఏకమై పోరాటం చేద్దా మని ఈ సందర్భంగా నవీన్ బీసీ కులాలకు విజ్ఞప్తి చేస్తున్నారు. లేనియెడల త్వరలో అన్ని బీసీ ఫలాలు ఏకమై జిల్లాల వారీగా అన్ని కలెక్టర్ ఆఫీసుల వద్ద నిరసనలు తెలుపుతామని బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

రాష్ట్రంలోని బీసీ కుల వృత్తిదారులకు వెంటనే బీసీ బంధు రూ.10 లక్షలు ఇవ్వా లని జూబ్లీహిల్స్ జోన్ రజక సంఘం అధ్యక్షుడు రాపర్తి అశోక్ అన్నారు. బీసీలకు ఒక లక్ష ఇవ్వాలని కేసీఆర్ నిర్ణయించడం, బీసీలను అవమాన పరచటం మాత్ర మేనని, కనుక బీసీలకు బీసీ బంధు ఎన్నికలలోపు ప్రక టించి, అమలుపరచి ప్రతి ఒక్క పేద కుటుంబానికి సహా యం చేయాలని, లేనియెడల బీసీల సత్తా ఏమిటో చూపి స్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వెంటనే ప్రకటించని యెడల బీసీ కులాలు ఏకమై అన్ని జిల్లాలలో కలెక్టర్ల ఆఫీసు వద్ద, ఎమ్మెల్యేల ఆఫీస్ వద్ద నిరసనలు తెలుపుతామని, టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా హెచ్చరించారు.

ఉస్మానియా ఓపిలో కరెంటుకు అంతరాయం

స్పందించిన అధికారులు



నవతెలంగాణ-ధూల్‌పేట్

ఉస్మానియా ఆస్పత్రి ఓపీ విభాగంలో గురువారం ఉదయం కరెంటుకు అంతరా యం ఏర్పడింది. దీంతో రోగు లు ఇబ్బందులు పడ్డారు. అసలే ఎండా కాలం వేడిమి కావ డంతో ఓపి స్లిప్ ల కోసం లైన్‌లో నిలిచిన రోగు లు, కొందరు రోగుల సహాయ కులు ఇబ్బం దులకు గురయ్యారు. విష యం తెలుసుకున్న ఉన్నతా ధికారులు వెం టనే ఎలక్ట్రికల్ విభా గపు సిబ్బందితో సమస్యను వెంటనే గుర్తించి, పరిష్కరించి అంతరా యాన్ని తొలగిం చారు.ఉస్మానియా ఆస్పత్రిలో కొద్ది సేపు ఓపి రిజిస్ట్రేషన్‌లో చిన్న సర్క్యూట్ చేంజర్‌లో లోపం వల్ల కొద్ది నిమిషాలు విద్యుత్ లేకపోవడం జరిగిందనీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టం.బి. నాగేందర్ తెలిపారు. కేవలం ఓపీ రిజిస్ట్రేషన్ వద్ద మాత్రమే వైర్ కాలిపోవడంతో అక్కడ మాత్రమే ఈ అంతరాయం ఏర్పడిందన్నారు. మిగితా విభాగాల్లో ఎలాంటి విద్యుత్ అంతరాయం జరగలేదనీ, సర్వీసెస్ లో ఎటువంటి అంతరయం లేదని తెలిపారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులూ కలగలేదన్నారు.

చెరువుల పరిరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత: ఎడ్ల సుధాకర్ రెడ్డి



నవతెలంగాణ- అంబర్‌పేట

అన్ని చెరువుల పరిరక్షణతో పాటు అభివృద్ధికి ప్ర భుత్వం ఎనలేని కృషి చేస్తోందని బీఆర్ఎస్ అంబర్ పేట ఇన్‌ఛార్జీ ఎడ్ల సుధాకర్ రెడ్డి అన్నారు.గురువారం బాగ్ అం బర్‌పేట డివిజన్ పరిధిలోని మోహిని చెరువును తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సందర్శించి ఈసందర్భంగా చెరువుల ప్రత్యేక పూజ లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊరురా చెరువుల పండుగ ఉత్సవాల్లో భాగంగా చెరువులపునరుద్ధరణ ద్వారా భూగర్భ జలాల నీటి మట్టం గణనీయంగా పెరిగింద న్నా రు. సమాఖ్య రాష్ట్రంలో పాలకుల వల్ల చెరువులను పట్టిం చుకునేపాపాన పోలేదని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం చెరువుల సుందరీకరణ, చెరువుల చుట్టు పార్కు అభివృద్ధి చేస్తూ వేసవి లో కూడా నీటి ఎద్దడి లేకుండా తీవ్రంగా కృషి చేశారని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గరిగంటి రమేష్. మాజీ కార్పొరేటర్ పులి జగన్ సీనియర్ నేతలు మురళి కృష్ణ, డాక్టర్ సులోచనా,సుశీల రెడ్డి, కోట్ల రా ము, రమణ, రాహూల్, బాబా నాయకులు పాల్గొన్నారు.

గ్రావిటీ నీళ్లు వస్తుంటే పథకాలు ఎందుకు?



నవతెలంగాణ-బంజారాహిల్స్

గ్రావిటీతో నీళ్లు వస్తుంటే చెన్నూరు ఎత్తిపోతలకు సీ ఎం ఎందుకు శంకుస్థాపన చేస్తున్నారని అనే అంశంపై గురువారం అఖిల పక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిం చారు.తెలంగాణ జలసాధన సమితి ఆధ్వర్యంలో గురు వారం సోమాజి గూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశానికి ప్రొఫె.సర్ వినాయక రెడ్డి అధ్యక్షత వహించారు. నైనాల గోవర్ధన్ (తెలం గాణసమితి నాయ కులు) చెన్నూర్ ఎత్తిపోతలకు ప్రత్యామ్నా యం గా గ్రావిటీ ప్రత్యామ్నాయలపై టోపో సర్వేఆఫ్ఇండియా మ్యాప్స్ ప్రజెంటేషన్ ఇచ్చారు. వారు మాట్లాడుతూ శీరామ్ సాగర్ ఉత్తర కాలువ సెకండ్ ఫేస్ నెహ్రూ ప్రణాళిక ప్రకారం అదే ఎన్టీఆర్ శంకుస్థాపన చేసిన రెండవ దశ మందాకిని కాలువతో చెన్నూరు ప్రాంతానికి గ్రావిటీ నీరు ఇవ్వవ చ్చ న్నారు. డిపిఆర్ పూర్తయిన కుప్టి ప్రాజెక్ట్, కడెం ఎల్లంపల్లి, తుమ్మిడిహెట్టితో కూడా ఈ ప్రాంతానికి నీరివ్వవ చ్చన్నారు. సీఎం కేసీఆర్ ప్రారంభించిన గూడెం ఎత్తిపోతలు 55 సా ర్లు విఫలమైంది. ఉమ్మడి ఆదిలాబాద్‌లో 100 ఎత్తిపోతలు విఫలమైనాయన్నారు. రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విట్టల్ రావు మాట్లా డుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు నలువై పులా భారీ నదులున్న, ఆ నీరు జిల్లా ప్రజల బతుకులను మార్చడం లేదన్నారు. చెన్నూరుకు వెళ్లే గ్రావిటీ కాలువ ల ను సర్వే ఆఫ్ ఇండియా టోపో మ్యాప్స్ ద్వారా వివరించి చెప్పారు. కోదండరాం మాట్లాడుతూ గ్రావిటీ కాలువతో నీ ళ్లు అందించాలి అన్నారు. తమ్మిడిహెట్టిని యుద్ధ ప్రాతి పదికన నిర్మాణం చేపట్టాలన్నారు. ఆకునూరి మురళి రిటైర్డ్ అధికారి, కేసీఆర్ పెట్టే ఎత్తిపోతలన్ని భారీ వ్యయంతో కూ డుకున్నవన్నారు. పక్క రాష్ట్రాల్లో మన రాష్ట్రంలో ఎత్తిపో తలన్నీ విఫలమైనాయని అనుభవాలు నిరూపిస్తు న్నాయన్నారు. కాళేశ్వరం భారీ ఎత్తిపోతలు ఒక విఫల పథ కమని, పంట సాగు చేస్తే రూ.20వేలు లాభం వస్తే, కాళేశ్వ రంతో నీళ్లిస్తే ఎకరాకు లక్ష రూపాయల ఖర్చు వస్తుంద న్నా రు. తెలంగాణకు నీళ్లు ఇవ్వలేదు కానీ, అప్పులను,అవినీతిని విపరీతంగా పెంచిందన్నారు. వేములపల్లి వెంకట్రామయ్య సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యదర్శివర్గ సభ్యులు మా ట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా దేశం లోనే అత్యంత వెనకబడ్డది, 22 లక్షల ఎకరాల భూమిలో కేవలం మూడు న్నర లక్షల అతి తక్కువ భూమికే సాగునీటి వసతి ఉంది అ న్నారు. ఆదివా సులకు నేటికీ సాగు నీరుకు నోచుకోలేద న్నా రు. కోదండరెడ్డి (కాంగ్రెస్ పార్టీ నాయకులు) మాట్లాడుతూ ముఖ్య మం త్రి మాటలకు చేతులకు పొంతన లేదన్నారు. రిటైర్డ్ హైకోర్టు జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ ఎత్తిపో తలు కాకుండా ఖర్చులేని గ్రావిటీ పథకాలకు ప్రణాళికలు వేసి అవకాశమున్నా, ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నిం చారు.రిటైర్డ్ ఇం జనీర్ లక్ష్మీనారాయణ ఎత్తిపోతలన్నీ అనేక రకాల మెకానికల్ యంత్ర ఎలక్ట్రికల్ పైపుల నాణ్యత సమ స్యల వల్ల వ్యయం ఎక్కువై అన్ని విఫలమ వుతు న్నాయ న్నారు.సిపిఐ నాయకులు పశ్య పద్మ ప్రసంగించారు. కొం డేటి సత్యనారాయణ ఆదిలాబాద్ అభివృద్ధి వేదిక అధ్యక్షు డు, మన్నారం నాగరాజు తెలంగాణ లోక్‌సత్తా, రిటైర్డ్ వెంకటనారాయణ. బీసీ సంఘం నేతలు శ్రీనివాస్ యాద వ్,జలసాధనసమితి సారయ్య, రిటైర్డ్ ప్రొఫెసర్లు మైనారిటీ నేతలు పీస్‌అండ్‌జస్టిస్ మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

వేక్ అప్ తెలంగాణ రెండో వార్షికోత్సవం

నవతెలంగాణ-సిటీబ్యూరో

సికింద్రాబాద్ హరిహరా కళాభవన్‌లో జరుగుతున్న వేక్ అప్ తెలంగాణ రెండో వార్షికోత్సవంలో తెలంగాణ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్ హాజరై పలువురికి అవార్డులను తెలంగాణ స్టేట్ టెక్నలాజికల్ సర్వీసెస్ చైర్మన్ పాటిమీది జగన్ మోహన్ రావు, బహదూర్ పురా అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి మీర్ ఇనాయత్ అలీ బక్రీతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా గెల్లు శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ నేడు సమాజంలో ప్రతినిత్యం జరుగుతున్న సామాజిక, రాజకీయ అంశాలపై ఎలాంటి పక్షపాతం లేకుండా, ఏ రాజకీయ పార్టీకి కొమ్ముకాయకుండా, నిజాలను నిగ్గుతేలుస్తున్న వేకప్ తెలంగాణ పేపర్, తెలంగాణలోనే నెంబర్ 1 పేపర్‌గా బ్రాండ్ సాధించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. వేకప్ తెలంగాణ చీఫ్ ఎడిటర్, యువకుడు కుర్రమ్ అలీకి శుభాకాం క్షలు తెలిపారు. వేకప్ తెలంగాణ పేపర్ తెలంగాణ టూరిజం మీద కూడా దృష్టి పెట్టి, తెలంగాణలోని అందమైన ప్రదేశాలు, చరిత్రాత్మకమైన కట్టడాల గొప్ప దనాన్ని తెలంగాణ ప్రజలకు ఈ పేపర్ ద్వారా తెలియజేయాలని కోరారు.

ప్రియాస్మైల్ డెంటల్ ఆస్పత్రి ప్రారంభం



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్-కాప్రా

ప్రియా స్మైల్ డెంటల్ ఆస్ప త్రినిని డాక్టర్ వీరమాచనేని రామకృష్ణ గురు వారం చక్రిపురం కాలనీలో డాక్టర్ ప్రి యాంక ఏర్పాటు చేశారు. ఈ కార్యక్ర మంలో అడిషనల్ కమిషనర్ జీహె చ్ఎంసీ డాక్టర్ యాదగిరిరావు, డెం టల్ ఆస్పత్రి నిర్వాహకురాలు డాక్టర్ ప్ర యాంక తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ

రాజ్యసభ సభ్యులు జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షులు డా. కే.లక్ష్మణ్



నవతెలంగాణ-ఓయూ

అడ్డగుట్ట డివిజన్ తుకారం గేట్ కొండ రెడ్డి నగర్ లో గురువారం మ హిళలకు ఉచిత శిక్షణ కార్యాలయం మేకల కీర్తి హర్షకిరణ్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కన్నాభిరామ్‌ల ఆధ్వర్యంలో రాజ్యసభ సభ్యు లు డా.కె. లక్ష్మణ్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. డాక్టర్ కే.లక్ష్మణ్ మాట్లాడుతూ 9 సంవత్సరాల నరేంద్ర మోడీ పాల నలో మహిళలకు పెద్దపీట వేయడం జరిగిందన్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా మహిళలను అన్ని రంగాలలో ముందుకు తీసుకుపో తు న్నది బిజెపి ప్రభుత్వమని, స్వయం ఉపాధి నైపుణ్య శిక్షణ ద్వారా మహిళల కాళ్ళ మీద వాళ్ల నిలబడే విధంగా ఆర్థిక అవసరాలకు అనుగు ణంగా శిక్షణ ఇవ్వనున్నట్లు, మగవాళ్లకు దీటుగా ఇంట్లోనే ఉండి కుటు ంబ పోషణకు మహిళలు ధైర్యంగా ముందుకు వస్తున్నారన్నారు. నైపు ణ్యం ఇచ్చి ప్రభుత్వ రుణాలు కూడా అందించి ప్రోత్సహిస్తున్నారు. ఈ కార్యక్ర మంలో బీజేపీ నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, జిల్లా కార్యదర్శిలు కనకట్ల హరి, ప్రకా ష్ గౌడ్,వీరన్న, కన్వీనర్ నాగేశ్వర్‌రెడ్డి, సతీష్, ఆదం విజయకుమార్, అధికార ప్రతిని ధులు ప్రభు గుప్తా, శారదా మల్లేష్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్య దర్శి గణేష్ ముదిరాజ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు బిక్షపతి యాదవ్, మహిళా నాయకురాలు అనిత, అనూష, కళావతి, డివిజన్ అధ్యక్షులు అంబాల మహేష్, శ్రీధర్, హను మంత్ ముదిరాజ్, ప్రధాన కా ర్యదర్శిలు రవీందర్, సాయి గంగపుత్ర, బీజేవైఎం నాయకులు శివాజీ, ఉదయ్ కుమార్ యాదవ్, హంస రాజ్, నరసింహ, వీరేష్, శంకర్, విజయ ముదిరాజ్ , రాజ్ కుమార్ నేత, వనమాల శీను,మరియు మహిళలు, జిల్లా డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ సంయుక్త మోర్చాల సమ్మేళనం



నవతెలంగాణ-ముషీరాబాద్

ప్రజాసామిక సామాజిక తెలంగాణ నిర్మాణమే బీజేపీ లక్ష్యమని రాజ్యసభ సభ్యులు బిజెపి ఓబీసీ మో ర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కే లక్ష్మణ్ అన్నారు. గురువారం ముషీరాబాద్ లోని హెరిటేజ్ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ సంయుక్త మోర్చాల సమ్మేళనం నిర్వ హించారు. ఈ కార్యక్ర మంలో ముఖ్యఅతిథిగా హాజ రైన లక్ష్మణ్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తొమ్మిది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జాతీయ పార్టీ ఆదేశాల మేరకు దేశవ్యా ప్తంగా నియోజకవర్గాల వారీగా సమ్మేళనాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద నాలుగు కోట్ల మంది మహిళలకు ఇండ్ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. కార్పొరేటర్లు సుప్రియ నవీన్ గౌడ్, రచన శ్రీ పావని వినయ్ కుమార్, బిజెపి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్ గౌడ్, ఉపాధ్యక్షులు సికే శంకర్, బిజెపి ముషీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ రమేష్ రామ్, సీనియర్ నాయకులు పూసరాజు బీజేవైఎం కన్వీనర్ గడ్డం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మాకూ రూ.లక్ష సహాయం అందజేయండి



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన చేతివృ త్తు లు, కులవృత్తుల కులాలకు రూ.లక్ష ఆర్థిక సహాయం పథకాన్ని వంజరి కులస్తులకు కూడా వర్తింపచేయాలని అఖిలభారత వంజరి సేవా సంఘం, తెలంగాణ వంజరి సేవా సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఆ సంఘం జాతీయ సీనియర్ ఉపాధ్యక్షులు సాల్వేరు కృష్ణ వంజరి, అధ్య క్షులు ఎదుగాని శంకర్ నారాయణ, ప్రధాన కార్య దర్శి దాత్రిక ధర్మరాజు, ఉపాధ్యక్షులు పిట్టల అంజ య్య, ఎదగాని హరినాథ్, కార్యదర్శులు ఎదుగాని రామకృష్ణ, లండేరి శ్రీనివాస్, వాలేరు రామకృష్ణ, కె.సూర్యనారాయణ మాట్లాడారు. వ్యవసాయం, పశుపోషణ, పశువర్ధకం, వ్యవసాయ ఆధారిత పను లను ముఖ్య వృత్తిగా చేసుకుని జీవనం కొనసాగి స్తు న్న వంజరి కులస్తులను ఆదుకోవడానికి వ్యవసాయ, వ్యవసాయేతర పనిముట్లు కొనుగోలు చేయడానికి రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని ప్రకటించాలని విజ్ఞప్తి చే శారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వంజరి కుల స్తుల కు ఎలాంటి పథకాలను ప్రకటించలేదనీ, చిన్న చి న్న వృత్తులు కొనసాగిస్తూ నిరుపేద, మధ్య తరగతి జీవితాలు కడుతున్న మంజూరు కులస్తులను ఆర్థి కంగా ఆదుకోవడానికి ఈ పథకాన్ని తమకు వర్తిం పజేయాలని వారు సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు.

భగత్ సింగ్ నగర్‌లో హైమాస్ట్ లైట్స్, సెల్ఫీ పాయింట్ ప్రారంభం

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



చింతల్ డివిజన్ పరిధిలోని భగత్‌సింగ్ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్స్, సెల్ఫీ పాయింట్‌ను బుధవారం రాత్రి ఎమ్మెల్యే కేపి వివేకానంద్ ముఖ్య అతిథిగా పాల్గొని బస్తీ వాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్తీవాసులు ఐక్యమత్యంగా ఉంటేనే సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం అవుతాయన్నారు. ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకు వస్తే రాజకీయా లకతీతంగా అందరి సహకారంతో పరిష్కరిస్తానని తెలిపారు. అనంతరం బస్తీ వాసులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ టి. లక్ష్మారెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనాథ్, సీనియర్ నాయకులు మహ్మద్ మక్సూద్ అలీ, గుజ్జుల శ్రీనివాస్ రెడ్డి ,భగత్ సింగ్ నగర్ వాసులు పాల్గొన్నారు.

చెరువుల పండుగ పేరుతో ప్రజాధనం వృధా

- వార్డు సభ్యుడు యాటవెళ్లి హన్మంత్ రెడ్డి

నవతెలంగాణ- మేడ్చల్



చెరువుల పండుగ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజాధనాన్ని వృధా చేస్తుందని కాంగ్రెస్ మేడ్చల్ మండల సేవాదళ్ అధ్యక్షుడు, వార్డు సభ్యుడు యాటవెళ్లి హన్మంత్ రెడ్డి విమర్శించారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రజలు పన్నుల రూపంలో కట్టిన డబ్బులతో బీఆర్ఎస్ ప్రభుత్వం చెరువుల దగ్గర పండుగలు చేసుకోవడం సరైనది కాదన్నారు. తాను ఒక ప్రజా ప్రతినిధిగా చెరువుల పండుగ కార్యక్రమంలో పాల్గొనకుండా బహిష్కరిస్తున్నానని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల్లో ఉండేందుకు ఎన్నికల స్టంట్‌ను ప్రదర్శిస్తోందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఇంటర్, టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు సజావుగా నిర్వహించాలి

- హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా 185 పరీక్ష కేంద్రాల ఏర్పాటు : జిల్లా డీఆర్వో సూర్యలత
- 12 నుంచి 20 వరకు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

నవతెలంగాణ-సిటీబ్యూరో


ఫైల్ ఫోటో

ఈ నెల 12 నుంచి జరగనున్న ఇంటర్మీడియేట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఎటువంటి లోటుపాట్లు లేకుండా సజావుగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని హైదరాబాద్ జిల్లా డీఆర్వో సూర్యలత అధికారులను ఆదేశించారు. ఇంటర్మీడియెట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై గురువారం డీఆర్వో ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఈ పరీక్షల నిర్వహణకుగాను 136 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు రెండు సెషన్‌లలో పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు పరీక్షా కేంద్రానికి ముందుగానే చేరుకునేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాలలో సెల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబోమని డీఆర్వో స్పష్టం చేసారు. పరీక్ష కేంద్రాలలో నిరంతర విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి పరీక్షా కేంద్రంలో ప్రాథమిక చికిత్స కిట్‌తోపాటు ఎఎన్ఎంలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారికి సూచించారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీటి సరఫరాతో పాటు బందోబస్తు ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాలకు వెళ్లే రూట్లల్లో బస్సులను అదనంగా, పరీక్షల సమాయానికి అనుగుణంగా నడిపేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పరీక్ష సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఐఈవో దాసరి ఒడ్డెన్న, వైద్య శాఖాధికారి సుధా మాధవ్, డీసీపీ బాబురావు, అడిషనల్ డీసీపీ(ట్రాఫిక్) రంగా రావు, హెచ్ఎండబ్ల్యూ మసూద్ ఖాన్, టీఎస్ఆర్టీసి అధికారి చంద్రకాంత్, పోస్టల్ అధికారి నర్సింగ రావు తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

పదోతరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 14 నుంచి 22 వరకు జరగనున్న నేపథ్యంలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా సజావుగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని హైదరాబాద్ జిల్లా డీఆర్వో సూర్యలత అధికారులను ఆదేశించారు. ఈ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై గురువారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. జిల్లాలో ఈ పరీక్షల నిర్వహణకుగాను 49 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, సుమారు 15,843 వేల మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు కేంద్రాలకు ముందుగానే చేరుకునేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని డీఆర్వో సూచించారు. పరీక్ష కేంద్రాలలో ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబోమని ఆమె స్పష్టం చేశారు. ఆయా విభాగాధిపతులకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశిం చారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి ఆర్. రోహిణి, వైద్యశాఖాధికారి సుధా మాధవ్, డీసీపీ బాబురావు, అడిషనల్ డీసీపీ(ట్రాఫిక్) రంగారావు, హెచ్ఎండబ్ల్యూ మసూద్ ఖాన్, టీఎస్ఆర్టీసి అధికారి చంద్రకాంత్, పోస్టల్ అధికారి నర్సింగ రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా గర్జనను జయప్రదం చేయండి



- సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మహేష్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కొత్తగూడెంలో ఈనెల 11న లక్షమంది ఎర్రసైన్యంతో జరిగే ప్రజా గర్జనకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి వందల మంది కార్యకర్తలు శనివారం నాడే బయల్దేరి వెళ్లాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఏసురత్నం, ఉమా మహేష్‌లు పిలుపునిచ్చారు. గురువారం షాపూర్ నగర్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వారు హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో కార్మికులు, రైతులు, మహిళలు, విద్యార్థులు, యువజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేసే విధంగా రానున్న ఎన్నికల్లో సీపీఐ ఒంటరిగా నైనా పోటీ చేయడానికి సిద్ధంగా ఉందని తెలియచెయ్యడానికి ఈ గర్జనను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే కార్యకర్తలు సిద్ధం అయ్యి ఉన్నారని, కార్యకర్తలే కాకుండా కమ్యూనిస్టు పార్టీ అభిమానులు కూడా రావచ్చని చెప్పారు. ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు స్వామి నాయకత్వం వహించగా, ఏఐటీయూసీ మున్సిపల్ కోశాధికారి హరినాథ్, జిల్లా అధ్యక్షుడు రాములు, మండల సహాయ కార్యదర్శి రాము, సీపీఐ నాయకులు అశోక రెడ్డి, శ్రీనివాస్ , బిక్షపతి, నరసింహారెడ్డి, మోగిలప్ప తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికే పాదయాత్రలు

- కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

నవతెలంగాణ-బాలానగర్



మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలో ప్రజా సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు డివిజన్ పరిధిలోని భవానీ నగర్ రిజిస్టర్ ఆఫీస్ రోడ్డులో కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ జీహెచ్ఎంసీ ఏఈ పవన్, జలమండలి అధికారి విలియమ్స్‌తో కలసి కాలనీలో పాదయాత్ర చేస్తూ స్థానికులు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు రోడ్డుపై నూతనంగా నిర్మించిన భవనం వల్ల మ్యాన్ హెూల్ ధ్వంస మైన విషయాన్ని కార్పొరేటర్ దృష్టికి తీసుకు రావడంతో, వెంటనే భవన నిర్మాణదారునితో మాట్లాడి మరమ్మత్తు చేయాలని కోరారు. అదేవిధంగా నూతనంగా నిర్మించిన భవనాలకు నూతనంగా యూజీడీలైన్ ఏర్పటుకై చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. బస్తీలల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని రాబోవు రోజులలో సీఎం కేసీఆర్‌ను, అలాగే ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుని బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బలపర చవలసిందిగా స్థానికులను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో దర్మేష్, వెంకట్ రెడ్డి, సైదులు, మాసు, హమీత్, శివ కుమార్, నర్సింగ్, సురేందర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీ నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలి



- బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి

నవతెలంగాణ-బాలానగర్

కూకట్ పల్లి సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలో పలు కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు, అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తున్నామని స్థానిక కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి అన్నారు. గురువారం బాలానగర్ డివిజన్ పరిధిలోని దామోదర సంజీవయ్య కాలనీలో రూ.20 లక్షల నిధుల వ్యయంతో చేపట్టనున్న అంతర్గత మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు కార్పొరేటర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్తీలు, కాలనీల అభివృద్ధికై కట్టుబడి ఉన్నామని, మౌలిక వసతుల కల్పనతో పాటు అభివృద్ధి కోసం నిర్విరామంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహాయ సహకారాలతో కృషి చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో ఉన్న ప్రతీ ఇంటికి ఏదో విధంగా సంక్షేమ పథకాలు ప్రజలకు పారదర్శకంగా అందుతున్నాయని, ఈ సందర్భంగా రాబోవు రోజులలో సీఎం కేసీఆర్‌ను అలాగే బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బలపరచవలసిందిగా స్థానికులను కోరారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ డీజీఎం షంషేర్, స్థానిక నాయకులు, శ్రీనివాస్ ముదిరాజ్, నాగేందర్ గౌడ్, కుమార్, ఏర్పుల సత్యనారాయణ, నర్రా దేవేందర్ రెడ్డి, కృష్ణమూర్తి, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలి



- శామీర్‌పేట సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ-శామీర్‌పేట

మహిళ రెజ్లర్లపై లైంగిక వేధింపుల కు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని శామీర్ పేట మండలంలోని అలియబాద్ గ్రామ ప్రధాన కూడలిలో గురువారం శామీర్ పేట మండల సీఐటీయూ కార్యదర్శి కిష్టప్ప ఆధ్వర్యంలో ప్లకార్డులు ప్రదర్శించి నిరసన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా కిష్టప్ప మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వంలో ఎవరికీ రక్షణ లేకుండా పోయిందన్నారు. గత కొంతకాలంగా మహిళ రెజ్లర్లు ఆందోళనలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, వెంటనే బ్రిజ్ భూషణ్ ను అరెస్టు చేసి రెజ్లర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నర్సింహ, ఆంజనేయులు, రవి, గణేష్ దాస్, మంజుల, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన రోడ్డు పనులు పూర్తి చేయాలి

- కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

నవతెలంగాణ-కూకట్‌పల్లి



ఆల్విన్ కాలనీ డివిజన్ శంశిగుడా పరిధిలోని ఆదర్శ్ నగర్ కాలనీలో రూ. 10 లక్షల నిధులతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో యుద్ధ ప్రాతిపదికను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. అలాగే వర్షాకాలంలో నీరు నిలిచిపోవడం వంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో సీసీ రోడ్డు నిర్మించాలని సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్ కు సూచించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సమ్మారెడ్డి, ఉపాధ్యక్షులు కాశినాథ్ యాదవ్, ఎస్టీ సెల్ అధ్యక్షులు వెంకట్ నాయక్, పోశెట్టిగౌడ్, శేఖర్, మల్లికార్జున్ రెడ్డి, నాగరాజు, శివ, ప్రసాద్ , ఏఈ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హైదర్‌నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట

- కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

హైదర్‌నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని



స్థానిక కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు అన్నారు. డివిజన్ పరిధిలోని భాగ్యనగర్ కాలనీలో చేపడుతున్న యూజీడి పైప్ లైన్ నిర్మాణ పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ యూజీడీ వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలన్నారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. డివిజన్ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని, అన్నివేళలా ప్రజలకు అందుబాటులోకి ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు మేనేజర్ ప్రశాంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, కాలనీ వాసులు దాసు, కీర్తి కుమార్, బాలు, హరిబాబు, మాధవ్ పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

మంత్రాలు చేసి నా బిడ్డను చంపేశారు : మృతురాలి తల్లి

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలోని భరత్‌నగర్ బస్తీలో చోటుచేసుకుంది. అయితే క్షుద్ర పూజలు చేసి తమ కూతురు బలవన్మరణానికి పాల్పడేలా చేశారంటూ యువతి తల్లిదండ్రులు ఆరోపణలు సంచలనం రేపాయి. తమ ఇంటి ముందు ఎవరో క్షుద్ర పూజలు చేశారని, ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా వాళ్ళ స్పందించలేదని నవ్య తల్లి ఆరోపించింది. బుధవారం సాయంత్రం నవ్య ఇంట్లోనే ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడిన విషయం తెలిసిందే. అయితే తమ ఇంటి ముందు వారం నుంచి ఎవరో పూజలు చేస్తున్నారని, మంత్రాలు చేసి తన కూతురిని చంపేశారని నవ్య తల్లి వాపోతోంది. వారం రోజులుగా ఇంటి ముందు క్షుద్రపూజలు చేస్తున్నారని, నిమ్మకాయలు, దీపాలు, బొమ్మలు, పసుపు-కుంకుమతో పూజలు చేస్తున్నారని అనుమానాలను వ్యక్తం చేసింది. వాటిని ఫొటోలు తీశామని, పోలీసులకు సైతం ఫిర్యాదు చేశామని చెప్పింది. పోలీసులు వెంటనే చర్యలు తీసుకుంటే తన కూతురు ప్రాణాలతో ఉండేదేమో అంటూ నవ్య తల్లి కన్నారుమున్నీరైంది. బుధవారం ఉదయం నవ్య బాగానే ఉందని, గురువారం కాలేజీకి వెళ్తానని కూడా నవ్య చెప్పిందన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదుతో అనుమానాస్పద కేసుగా నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు.

నేడు హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

నవతెలంగాణ-సిటీబ్యూరో



మృగశిర కార్తె సందర్భంగా నేడు నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఉదయం 8గంటల నుంచి చేపప్రసాదం పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాలల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ముఖ్యంగా అబిడ్స్, నాంపల్లి, బేగం బజార్, ఎంజేమార్కెట్ వివిధ ప్రాంతాలల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లోకి తీసుకొచ్చారు. చేపప్రసాదం కోసం వచ్చేవారు తమ వాహనాలను పోలీసులు సూచించిన పార్కింగ్ ప్రాంతాల్లో నిలుపాలని ట్రాఫిక్ కమిషనర్ సుధీర్‌బాబు తెలిపారు. నగర వాసులు, వాహనదారులు పోలీసులకు సహకరించాలన్నారు.

ఘనంగా ఊరూరా చెరువుల పండుగ



నవతెలంగాణ-దుండిగల్

చెరువులన్నీ నిండుకుండల్లా దర్శనమిస్తున్నాయంటే అది కేవలం సీఎం కేసీఆర్ గొప్పతనమేనని ఎమ్మెల్యే కేపి వివేకానంద్ అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం భౌరంపేట్ పెద్ద చెరువు, గాజుల రామారం చింతల చెరువు, బాచుపల్లి బిన్ (బైరన్) చెరువుల వద్ద ఏర్పాటు చేసిన " ఊరూరా చెరువుల పండుగ "లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి డప్పులు, బోనాలు, బతుకమ్మలు, మత్స్యకారులతో కలిసి చెరువు కట్టుకు ఊరేగింపుగా వెళ్లి కట్ట మైసమ్మ తల్లికి, గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కలు నాటారు. సభా ప్రాంగణంలో గోరటి వెంకన్న రాసిన చెరువోయి.. మా ఊరి చెరువు, బతుకమ్మ పాటలను వినిపించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ తీసుకువచ్చిన మిషన్ కాకతీయతో చెరువులకు పూర్వ వైభవం వచ్చిందన్నారు. పదేండ్ల క్రితం ఏ చెరువును చూసినా ఒక్క చుక్క నీరు ఉండేది కాదని, చెరువులను కాపాడాలనే సోయి కూడా గత పాలకులకు ఉండేది కాదన్నారు. చెరువులపై ఆధారపడిన కులవృత్తులకు బతుకు దెరువు లేక విలవిలలాడుతుండగా ముఖ్యమంత్రి కేసీఆర్ మిషన్ కాకతీయతో జీవం పోశారని చెప్పారు. మండు వేసవిలో కూడా చెరువులన్నీ నిండుకుండల్లా కనిపిస్తున్నాయంటే అది ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం అన్నారు. ఒకప్పుడు చేపల దిగుమతి చేసుకునే స్థాయి నుంచి మన ప్రభుత్వ హయాంలో ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి రాష్ట్రంలో మత్స్య సంపద పెరిగిందన్నారు. చెరువుల్లో ఉచిత చేప పిల్లల పంపిణీ ద్వారా గంగపుత్రుల జీవనోపాధి పెరిగిందని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్‌కు ఉన్న విజన్‌తో దేశంలోనే తెలంగాణ అన్ని రంగాల్లో నెంబర్‌వన్‌గా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి జోనల్ కమిషనర్ మమత, డీసీలు మంగతాయారు, ప్రశాంతి, నిజాంపేట్ మేయర్ కొలన్ నీలా గోపాల్ రెడ్డి, కొంపల్లి చైర్మెన్ సన్న శ్రీశైలం యాదవ్, ఇరిగేషన్ డీఈఈ సురేష్ ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దేవరయాంజల్‌ను హాకీంపేట ఎయిర్ ఫోర్స్ దత్తత

- పర్యావరణ పరిరక్షణ జీవన విధానం పై అవగాహన

నవతెలంగాణ-శామీర్ పేట



తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయాంజాల్ గ్రామాన్ని గురువారం హకీంపేట్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్ వారు దత్తత తీసుకుని పర్యావరణ పరిరక్షణకు జీవన విధానంపై అవగాహన కల్పించారు. హకీంపేట్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్ నుంచి వచ్చిన సెక్యూరిటీ ఆఫీసర్ ఎస్ కే రెడ్డి, అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్ బాబు, మెడికల్ ఆఫీసర్ ఏకే సింగ్, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ రాజీవ్, సీనియర్ సెక్యూరిటీ ఇన్‌చార్జ్ అజయ్, ఎన్విరాన్మెంట్ ఇన్‌చార్జ్ సంజీవ రావులు ఎయిర్ ఫోర్స్ సిబ్బంది తేజ, సాయిల్, కార్తీక్, సింధు లక్ష్మిసాయి, వేణు, జీనోలు విచ్చేసి పర్యావరణం కోసం జీవన విధానం అనే 7 విషయాలను వివరించారు. ఒకటి శక్తిని కాపాడు, రెండు నీటిని పొదుపు చేయి, మూడు చెత్తను తగ్గించండి, నాలుగు వ్యర్థాలను తగ్గించండి, ఐదు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు నో చెప్పండి, ఆరు ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించండి, ఏడు స్థిరమైన ఆహార వ్యవస్థలను అనుసరించండని పేర్కొన్నారు. అదేవిధంగా భద్రత వ్యవహారాలు గురించి.. ఎయిర్ ఫోర్స్ పరిసర ప్రాంతాలలో అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా తిరిగితే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. డ్రోన్ కెమెరాలు ఎయిర్ ఫోర్స్ పరిసర ప్రాంతాల్లో ఎట్టి పరిస్థితుల్లో ఉపయోగించవద్దన్నారు. ఇంకా తదితర అంశాల పైన అవగాహన కల్పించారు. త్వరలోనే గ్రామంలో హెల్త్ క్యాంప్ నిర్వహిస్తామని తెలిపారు. అదేవిధంగా గ్రామ అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేస్తామని.. గ్రామస్తుల సహకారం ఉండాలని అన్నారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ దేవరయాంజాల్ గ్రామాన్ని మరింతగా అభివృద్ధి చేయడానికి ముందుకొచ్చిన ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్ ఎయిర్ ఫోర్స్ హకీంపేట్ ఎయిర్ కమోడోర్ పంకజ్ జైన్‌కు గ్రామస్తుల తరపున కృతజ్ఞతలు తెలిపి గ్రామ అభివృద్ధి కోసం వారికి సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు పి.విక్రమ్ రెడ్డి, బీజేపీ మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ అమరం మోహన్ రెడ్డి, దేవరయాంజాల్ మాజీ సర్పంచ్ ఇడంబోయిన శ్రీనివాస్ ముదిరాజ్, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షులు భీమిడి జైపాల్ రెడ్డి, బీజేపీ మున్సిపల్ అధ్యక్షులు పట్నం నర్సింహారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు కోనేరు నర్సింగ్ రావు, పచ్చిమడ్ల నర్సింగ్ రావుగౌడ్, స్థానిక నాయకులు బక్కోళ్ల నర్సింగ్ రావు, టీచర్ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

చెరువుల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కృషి

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్
- లోటస్ పాండ్ చెరువు వద్ద ఘనంగా ఊరురా చెరువుల పండుగ

నవతెలంగాణ-సిటీబ్యూరో/బంజారాహిల్స్



చెరువుల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం విశేషయ కృషి చేసిందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఊరురా చెరువుల పండుగను గురువారం ఖైరతాబాద్ జోన్ జూబ్లీహిల్స్ లోటస్ పాండ్ చెరువు వద్ద మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ 2014 సంవత్సరానికి ముందు చెరువులు కబ్జా, నిరాదరణకు గురయ్యాయన్నారు. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి తొమ్మిదేండ్లలో చెరువుల పూడికతీత, పునరుద్ధరణ కార్యక్రమాలు జరిపి తాగు, సాగునీరు అందిస్తోం దన్నారు. జీహెచ్ఎంసీలో ఉన్న 185 చెరువుల పరిరక్షణకు జీహెచ్ఎంసీ, హెచ్.ఎం.డీ.ఏ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు చర్యలు తీసుకుంటున్నాయని తెలిపారు. గతంలో రాష్ట్రంలో 46,623 చెరువులు ఉండేవని, కాలక్రమంలో ధ్వంసమయ్యాయి అని తెలిపారు. మానవ మనుగడకు నీరు, కరెంట్ ప్రధానమైనదని, వీటిని తెలంగాణ రాష్ట్రం నిరంతరాయంగా అందిస్తోందని చెప్పారు. గతంలో రైతులు నీరు లేక బాధపడే వారని, నేడు చెరువులు జలకళను సంతరించుకున్నాయని తెలిపారు. చెరువులలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టినా చర్యలు తీసుకుంటామన్నారు. కృష్ణా, గోదావరి జలాల ద్వారా 50 సంవత్సరాలకు సరిపడా నీరు నిల్వ ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఊరురా చెరువుల పండుగ బుక్ లేట్‌ను మంత్రి ఆవిష్కరించారు.



నగరంలో 346 కోట్లతో చెరువుల అభివృద్ధి మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి


దశాబ్ది ఉత్సవాలలో భాగంగా చెరువుల పండుగను నియోజక వర్గ స్థాయిలో ప్రజల భాగస్వామ్యంతో జరుపుకుంటున్నామని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. ఆమె మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడక ముందు నగరంలో చెరువులు ఆక్రమణలతో, దుర్గంధ భరితంగా ఉండేవన్నారు. చెరువుల సుందరీకరణకు రూ.345.81కోట్ల అంచనా వ్యయంతో 355 పనులు చేపట్టగా ఇప్పటి వరకు 191 పనులు పూర్తి కాగా మరో 144 పనులు ప్రగతి దశలో ఉన్నాయని తెలిపారు. నగరంలో చెరువులను అన్యాక్రాంతం కాకుండా కూడా చర్య తీసుకున్నామన్నారు. నగరంలో ఇప్పటి వరకు 36 చెరువులను దత్తత తీసుకొని ఒక్కో చెరువుకు కోటి నుంచి రూ. 15 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నాయని తెలిపారు. ఖైరతాబాద్ జోన్ షేక్ పేట్ షికారి కుంట, కొత్త కుంట, బాతూర్ కుంట, వట్టి కుంట చెరువుల పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నామన్నారు. ఊరురా చెరువుల పండుగలో భాగంగా మహిళలతో కలిసి నగర మేయర్ బతుకమ్మ ఆడారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ చెరువుల పునరు ద్ధరణ ద్వారా భూగర్భ జలాల నీటి మట్టం గణనీయంగా పెరిగిందన్నారు. ఈ సమావేశంలో జోనల్ కమిషనర్ రవి కిరణ్, డిప్యూటీ కమిషనర్లు రజనీకాంత్, మోహన్ రెడ్డి, జీహెచ్ఎంసీ లేక్స్ సి.ఇ సురేష్, కార్పొరేటర్లు మన్నె కవిత, సంగీత యాదవ్, వెంకటేష్, ఆర్.డీ.ఓ వసంత, ఇరిగేషన్ సీ.ఇ ధర్మ ఎస్.ఇ ఆనంద్, ఇ.ఇ శంకర్ రావు, డీ..ఇ.ఇ శశికళ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రసన్న మత్స్య శాఖ అధికారులు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నవచిత్రం

నందమూరి బాలకృష్ణ, అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై నిర్మాతలు సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మిస్తున్న చిత్రానికి 'భగవంత్ కేసరి' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ని గురువారం అనౌన్స్ చేశారు. ఈ క్రేజీ కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రానికి 'ఐ డోంట్ కేర్' అనేది ట్యాగ్ లైన్. ఈ నేపథ్యంలో రిలీజ్ చేసిన టైటిల్ పోస్టర్‌కు సర్వత్రా అద్భుతమైన స్పందన వచ్చింది.

భగవంత్ కేసరిగా బాలయ్య

అలాగే మేకర్స్ మరో బిగ్ అప్‌డేట్ ఇచ్చి అందర్నీ సర్‌ప్రైజ్ చేశారు. ఈ సినిమా టీజర్‌ను బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా ఈనెల 10న విడుదల చేయనున్నారు. ఈ టీజర్ ప్రపంచవ్యాప్తంగా 108కి పైగా థియేటర్లలో ప్రదర్శితం కానుండటం విశేషం. ఇప్పటికే టైటిల్ పోస్టర్‌తో సంబరాలు మొదలయ్యాయి. స్పెషల్ డేట్‌లో వచ్చే టీజర్‌తో బాలయ్య అభిమానులు సందడి చేయనున్నారు. ఈ చిత్రంలో బాలకృష్ణను అనిల్ రావిపూడి ఎలా చూపించబోతున్నారనేది ఆసక్తికరంగా మారింది. యూనిక్ స్క్రిప్ట్‌తో, సరికొత్త యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. కాజల్ అగర్వాల్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీలీల కీలక పాత్రలో కనిపించనుంది. బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్ ఈ సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నారు. విజయదశమి కానుకగా (దసరా) ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.


బాలకృష్ణ







ఆటలు

టీమ్ ఇండియా కష్టాల్లో కూరుకుంది. టాప్ ఆర్డర్ బ్యాటర్లు విఫలం కావటంతో ఆసీస్ కొండంత తొలి ఇన్నింగ్స్ స్కోరును చేరుకునేందుకు తంటాలు పడుతుంది. అదనపు బౌన్స్, అనూహ్య సీమ్‌తో భారత బ్యాటర్లు ఇబ్బంది పడ్డారు. వికెట్ల మీదకు వచ్చిన బంతిని వదిలేసి శుభ్‌మన్ గిల్, చతేశ్వర్ పుజార నిష్క్రమించగా.. బౌన్స్‌కు కోహ్లి బలయ్యాడు. 71 పరుగులకే టాప్ ఆర్డర్‌ను కోల్పోయిన టీమ్ ఇండియా తొలి ఇన్నింగ్స్ 151/5తో ఎదురీదుతుంది. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 469 పరుగుల భారీ స్కోరు చేసింది.

వదిలేశారు..!

- టాప్-4 బ్యాటర్లు విఫలం
- పీకల్లోతు కష్టాల్లో భారత్
- భారత్ తొలి ఇన్నింగ్స్ 151/5
- ఆసీస్ తొలి ఇన్నింగ్స్ 469/10



నవతెలంగాణ-కెన్నింగ్టన్

ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో టీమ్ ఇండియా క్రమంగా పట్టు కోల్పోతుంది. ట్రావిశ్ హెడ్ (163, 174 బంతుల్లో 25 ఫోర్లు, 1 సిక్స్), స్టీవ్ స్మిత్ (121, 268 బంతుల్లో 19 ఫోర్లు) శతకాలతో తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 469 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. బంతితో ఆసీస్‌ను కట్టడి చేయటంలో విఫలమైన రోహిత్‌సేన... బ్యాట్‌తో లెక్క సమం చేయటంలో తేలిపోతుంది!. కంగారూ పేసర్లు కలిసికట్టుగా మెరవటంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో స్వల్ప స్కోరుకు పరిమితమయ్యే ప్రమాదంలో పడింది. కెప్టెన్ రోహిత్ శర్మ (15), శుభ్‌మన్ గిల్ (13), చతేశ్వర్ పుజార (14), విరాట్ కోహ్లి (14) స్వల్ప స్కోర్లకు నిష్క్రమించారు. టాప్-4 బ్యాటర్లను త్వరగా అవుట్ చేసిన ఆస్ట్రేలియా.. భారత్‌పై ఒత్తిడి పెంచింది. అజింక్య రహానె (29 బ్యాటింగ్, 71 బంతుల్లో 4 ఫోర్లు), రవీంద్ర జడేజా (48, 51 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్) ఐదో వికెట్‌కు అజేయంగా 70 పరుగులు జోడించారు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 151/5తో నిలిచింది. భారత్ మరో 318 పరుగుల వెనుకంజలో కొనసాగుతుంది.

లెక్క తప్పి.. వికెట్ జారి! : ఆసీస్‌కు భారీ స్కోరు కోల్పోయిన భారత్.. తొలి ఇన్నింగ్స్‌ను దూకుడుగా ఆరంభించింది. కెప్టెన్ రోహిత్ శర్మ (15) రెండు ఫోర్లతో ఆరంభంలోనే ఎదురుదాడి చేశాడు. శుభ్‌మన్ గిల్ సైతం రెండు బౌండరీలు బాదాడు. కానీ బంతి స్వింగ్, అదనపు బౌన్స్ అంచనా వేయటంలో మనోళ్లు లెక్క తప్పారు. పాట్ కమిన్స్ బంతికి రోహిత్ శర్మ వికెట్ల ముందు దొరికిపోగా.. క్రీజులో కుదురుకున్నట్టే కనిపించిన గిల్ లెక్క తప్పాడు. బొలాండ్ వేసిన బంతిని తప్పుగా అంచనా వేసిన గిల్ ఆడకుండా వదిలేశాడు. ఆ బంతి నేరుగా వికెట్లను గిరాటేసింది. ఇదే తప్పిదం పుజార సైతం పునరావృతం చేశాడు. కామెరూన్ గ్రీన్ ఓవర్లో బంతిని ఆడకుండా వదిలేసి మూల్యం చెల్లించాడు. ఇక విరాట్ కోహ్లిని మిచెల్ స్టార్క్ మెరుపు బంతితో సాగనంపాడు. పిచ్ నుంచి అదనపు బౌన్స్ రాబట్టిన స్టార్క్.. స్లిప్స్‌లో క్యాచౌట్‌గా అవుట్ చేశాడు. దీంతో 18.2 ఓవర్లలో 71 పరుగులకే భారత్ టాప్ ఆర్డర్ నాలుగు వికెట్లు చేజార్చుకుంది. ఈ సమయంలో రహానె, జడేజా స్కోరు బోర్డును కదిలించారు. దూకుడుగా ఆడిన జడేజా ఏడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 51 బంతుల్లోనే 48 పరుగులు సాధించాడు. రహానె, జడేజా జోడీని లయాన్ విడదీశాడు. కె.ఎస్ భరత్ (5 బ్యాటింగ్)తో కలిసి రహానె అజేయంగా ఆడుతున్నాడు.


విరాట్ కోహ్లి (14) తీసిన ఆనందంలో ఆసీస్ క్రికెటర్లు

మరో 142 పరుగులు : ఓవర్‌నైట్ స్కోరు 327/3తో రెండో రోజు బ్యాటింగ్‌కు వచ్చిన ఆస్ట్రేలియా మరో 142 పరుగులు జోడించింది. స్టీవ్ స్మిత్, ట్రావిశ్ హెడ్ నాల్గో వికెట్‌కు 285 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పారు. దూకుడు కొనసాగించిన హెడ్.. 23 ఫోర్లు, ఓ సిక్సర్‌తో 164 బంతుల్లో 150 పరుగుల మార్క్ అందుకున్నాడు. స్టీవ్ స్మిత్ సంప్రదాయ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. 16 ఫోర్లతో 224 బంతుల్లో స్మిత్ శతక గర్జన చేశాడు. హెడ్, స్మిత్ ఇన్నింగ్స్‌లతో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు సాధించింది. లంచ్‌కు ముందే హెడ్, స్మిత్ నిష్క్రమించినా.. ఆసీస్ టెయిలెండర్లు విలువైన పరుగులు జత చేశారు. వికెట్ కీపర్ అలెక్స్ కేరీ (48, 69 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్) మెరుపు ఇన్నింగ్స్‌తో కదం తొక్కాడు. కామెరూన్ గ్రీన్ (6), పాట్ కమిన్స్ (9), మిచెల్ స్టార్క్ (5), నాథన్ లయాన్ (9)లు స్వల్ప స్కోరుకు నిష్క్రమించారు. 121.3 ఓవర్లలో 469 పరుగుల భారీ స్కోరుకు ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ ముగిసింది.

సిరాజ్‌కు '4' : హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్ డబ్ల్యూటీసీ ఫైనల్లో మెరిశాడు. షమి, ఉమేశ్, శార్దుల్‌తో కలిసి పేస్ బాధ్యతలు పంచుకున్న సిరాజ్ తొలి ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్ల ప్రదర్శన చేశాడు. ఉస్మాన్ ఖవాజ (0), ట్రావిశ్ హెడ్ (163), పాట్ కమిన్స్ (9), నాథన్ లయాన్ (9) వికెట్లను సిరాజ్ పడగొట్టాడు. మహ్మద్ షమి (2/122), శార్దుల్ ఠాకూర్ (2/83) రెండేసి వికెట్లు పడగొట్టగా.. రవీంద్ర జడేజా (1/56) ఓ వికెట్ తీశాడు. ఉమేశ్ యాదవ్ (0/77) వికెట్లేమీ దక్కలేదు.

స్కోరు వివరాలు :

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ : వార్నర్ (సి) భరత్ (బి) ఠాకూర్ 43, ఖవాజ (సి) భరత్ (బి) సిరాజ్ 0, లబుషేన్ (బి) షమి 26, స్మిత్ (బి) ఠాకూర్ 121, హెడ్ (సి) భరత్ (బి) సిరాజ్ 163, గ్రీన్ (సి) గిల్ (బి) షమి 6, అలెక్స్ (ఎల్బీ) జడేజా 48, స్టార్క్ రనౌట్ 5, కమిన్స్ (సి) రహానె (బి) సిరాజ్ 9, లయాన్ (బి) సిరాజ్ 9, బొలాండ్ నాటౌట్ 1, ఎక్స్‌ట్రాలు : 38, **మొత్తం :(121.3 ఓవర్లలో ఆలౌట్) 469.**

వికెట్ల పతనం : 1-2, 2-71, 3-76, 4-361, 5-376, 6-387, 7-402, 8-453, 9-468, 10-469.

బౌలింగ్ : మహ్మద్ షమి 29-4-122-2, మహ్మద్ సిరాజ్ 28.3-4-108-4, ఉమేశ్ యాదవ్ 23-5-77-0, శార్దుల్ ఠాకూర్ 23-4-83-2, రవీంద్ర జడేజా 18-2-56-1.

భారత్ తొలి ఇన్నింగ్స్ : రోహిత్ శర్మ (ఎల్బీ) కమిన్స్ 15, గిల్ (బి) బొలాండ్ 13, పుజార (బి) గ్రీన్ 14, కోహ్లి (సి) స్మిత్ (బి) కమిన్స్ 14, రహానె బ్యాటింగ్ 29, జడేజా (సి) స్మిత్ (బి) లయాన్ 48, భరత్ బ్యాటింగ్ 5, ఎక్స్‌ట్రాలు : 13, **మొత్తం : (38 ఓవర్లలో 5 వికెట్లకు) 151.**

వికెట్ల పతనం : 1-30, 2-30, 3-50, 4-71, 5-142.

బౌలింగ్ : మిచెల్ స్టార్క్ 9-0-52-1, పాట్ కమిన్స్ 9-2-36-1, స్కాట్ బొలాండ్ 11-4-29-1, కామెరూన్ గ్రీన్ 7-1-22-1. నాథన్ లయాన్ 2-0-4-1.



ముగిసిన పోరు!

- శ్రీకాంత్, ప్రియాన్షు ఓటమి
- సింగపూర్ ఓపెన్ 2023

సింగపూర్ : భారత బ్యాడ్మింటన్ క్రీడాకారులు మరో టోర్నీలో నిరాశపరిచారు. సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పతక ఆశలు ఆవిరి చేశారు. పి.వి సింధు, సైనా నెహ్వాల్, సాత్విక్-చిరాగ్‌లు ఇప్పటికే టోర్నీ నుంచి నిష్క్రమించగా.. తాజాగా ప్రీ క్వార్టర్స్‌లో కిదాంబి శ్రీకాంత్, ప్రియాన్షు రజావత్ పోరాటానికి తెరపడింది. డబుల్స్‌లో అర్జున్, కపిల సైతం ఓటమి చెందగా సింగపూర్ ఓపెన్‌లో భారత పోరాటం ముగిసింది. పురుషుల సింగిల్స్‌లో యువ షట్లర్ ప్రియాన్షు రజావత్ వరుస గేముల్లో విఫలమయ్యాడు. మూడో సీడ్, జపాన్ స్టార్ కొడాయ్ నరోక 21-17, 21-16తో వరుస గేముల్లోనే ప్రియాన్షుపై విజయం సాధించాడు. 47 నిమిషాల పాటు సాగిన ప్రీ క్వార్టర్స్‌లో ప్రియాన్షు పోటీ ఇచ్చే ప్రయత్నం చేసినా.. జపాన్ షట్లర్ పైచేయి సాధించాడు. పురుషుల సింగిల్స్ మాజీ వరల్డ్ నం.1 కిదాంబి శ్రీకాంత్ నిరాశపరిచాడు. చైనీస్ తైపీ షట్లర్ చియ హవో లీకి వరుస గేముల్లోనే క్వార్టర్స్ బెర్త్ కోల్పోయాడు. 15-21, 19-21తో శ్రీకాంత్ పోరాడినా ఫలితం దక్కలేదు. తొలి గేమ్‌లో శ్రీకాంత్‌ను చిత్తు చేసిన చైనీస్ తైపీ ఆటగాడు.. రెండో గేమ్‌లో కాస్త ప్రతిఘటన ఎదుర్కొన్నాడు. చివర్లో 19-19తో స్కోరు సమం చేసిన శ్రీకాంత్ ఉత్కంఠ రేపాడు. కానీ వరుస పాయింట్లతో లీ ముందంజ వేశాడు. భారత స్టార్ షట్లర్‌పై లీ 37 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించాడు. పురుషుల డబుల్స్‌లో ఎంఆర్ అర్జున్, ధ్రువ్ కపిల జోడీ ఇంటిబాట పట్టింది. 15-21, 19-21తో ఇంగ్లాండ్ జోడీ బెన్ లేన్, సీన్ వెండీలతో చేతిలో ఓటమి చెందారు. 41 నిమిషాల్లోనే భారత జోడీపై గెలుపొందిన లేన్, సీన్ క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించారు.

మురుగున్ ముత్తు, జెన్నీఫర్‌కు టైటిళ్లు



హైదరాబాద్ : జాతీయ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నీలో తమిళనాడు ప్యాడ్లర్ మురుగన్ ముత్తు రాజశేఖరన్ టైటిల్ సొంతం చేసుకున్నాడు. గురువారం జరిగిన అండర్-17 యూత్ బాయ్స్ ఫైనల్లో తమిళనాడుకే చెందిన పిబి అభినంద్‌పై 11-4, 12-10, 11-13, 11-8తో విజయం సాధించాడు. అండర్-17 యూత్ గర్ల్స్ విభాగంలో మహారాష్ట్ర అమ్మాయి జెన్నీఫర్ వర్గీస్ గెలుపొందింది. ఉత్తరప్రదేశ్ ప్యాడ్లర్ అవని త్రిపాఠిపై 11-7, 11-6, 12-10తో జెన్నీఫర్ వరుస సెట్లలో విజయం సాధించింది. అండర్-13 బాయ్స్ విభాగంలో ఆదిత్య దాస్ (పశ్చిమ బెంగాల్) 11-8, 11-6, 11-4తో దుల్కాన్ (హర్యానా)పై విజయంతో టైటిల్ సాధించాడు.

తెలుగు టాలన్స్ బోణీ

- గుజరాత్‌పై 39-32తో గెలుపు
- ప్రీమియర్ హ్యాండ్‌బాల్ లీగ్



జైపూర్: ప్రీమియర్ హ్యాండ్‌బాల్ లీగ్ (పీహెచ్ఎల్) ఆరంభ సీజన్ అట్టహాసంగా ఆరంభమైంది. జైపూర్‌లోని సవాయ్ మాన్‌సింగ్ ఇండోర్ స్టేడియంలో గురువారం పీహెచ్ఎల్ తొలి సీజన్ మొదలైంది. లీగ్ ఆరంభ మ్యాచ్‌లో రాజస్థాన్ పాట్రియాట్స్, మహారాష్ట్ర ఐరన్‌మ్యాన్ పోటీపడ్డాయి. 28-27తో ఐరన్‌మ్యాన్‌పై పాట్రియాట్స్ ఒక్క గోల్ తేడాతో ఉత్కంఠ విజయం సాధించింది. ఇక తొలి రోజు రెండో మ్యాచ్‌లో తెలుగు జట్టు టాలన్స్ దుమ్మురేపింది. గార్విట్ గుజరాత్‌తో తలపడిన తెలుగు టాలన్స్ 39-32తో సాధికారిక విజయం సాధించి సీజన్లో బోణీ కొట్టింది.

ఫైనల్లో ముచోవ

- రెండో సీడ్ సబలెంక ఔట్
- ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్



పారిస్ (ఫ్రాన్స్) : అన్‌సీడెడ్ క్రీడాకారిణి, చెక్ రిపబ్లిక్ స్టార్ కరోలినా ముచోవ అద్భుతం చేసింది. మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో రెండో సీడ్, టైటిల్ ఫేవరేట్ ఆర్యన సబలెంక (బెలారస్)పై ఉద్విగ్న విజయం సాధించింది. ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లోకి ప్రవేశించి కెరీర్ తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ పోరుకు సిద్ధమైంది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో వరల్డ్ నం.43 కరోలినా ముచోవ 7-6(7-6), 6-7(5-7), 7-5తో మూడు సెట్ల ఉత్కంఠ మ్యాచ్‌లో సబలెంకపై విజయం సాధించింది. మూడు గంటల 13 నిమిషాల పాటు సాగిన మారథాన్ పోరులో సబలెంక వరుస గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల ఆశలకు తెరపడింది. తొలి రెండు సెట్లు టైబ్రేకర్లకు దారితీయగా తొలి సెట్‌ను ముచోవ గెలుపొందగా.. రెండో సెట్‌ను సబలెంక సొంతం చేసుకుంది. దీంతో క్వార్టర్‌ఫైనల్ ముచ్చటగా మూడో సెట్‌కు దారితీసింది. నిర్ణయాత్మక సెట్‌లో 7-5తో పైచేయి సాధించిన ముచోవ కెరీర్ తొలి గ్రాండ్‌స్లామ్ ఫైనల్లోకి ప్రవేశించింది. ఆరు ఏస్‌లు సంధించిన ముచోవ.. ఐదు బ్రేక్ పాయింట్లు సాధించింది. మరోవైపు సబలెంక నాలుగు బ్రేక్ పాయింట్లు మాత్రమే సాధించింది. పాయింట్ల పరంగా ముచోవ 126-115తో సబలెంకపై పైచేయి సాధించింది. ముచోవ 20 గేములు నెగ్గగా, సబలెంక 18 గేములు సాధించింది. ముచోవ 38 విన్నర్లు కొట్టగా, సబలెంక 44 విన్నర్లతో మెరిసింది. ముచోవ 27 అనవసర తప్పిదాలతో సరిపెట్టగా.. 53 అనవసర తప్పిదాలతో సబలెంక ఓటమిపాలైంది.

సెమీస్‌లో రూడ్ : పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లోకి కాస్పర్ రూడ్ (నార్వే) అడుగుపెట్టాడు. డెన్మార్క్ ఆటగాడు, ఆరో సీడ్ హోల్గర్ రూనెతో క్వార్టర్‌ఫైనల్లో రూడ్ 4-1తో గెలుపొందాడు. 6-1, 6-2, 3-6, 6-3తో కాస్పర్ రూడ్ సెమీఫైనల్లోకి చేరుకున్నాడు. ఐదు ఏస్‌లు సంధించిన రూడ్.. ఐదు బ్రేక్ పాయింట్లతో రూనెపై ఆధిపత్యం చెలాయించాడు. రూడ్ 21 గేములతో రెచ్చిపోగా.. రూనె 12 గేములతోనే సరిపెట్టుకున్నాడు. ఇక నేడు జరిగే పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో జర్మనీ స్టార్ అలెగ్జాండర్ జ్వెరెవ్‌తో కాస్పర్ రూడ్ తలపడనున్నాడు. మరో సెమీఫైనల్లో టాప్ సీడ్ అల్కరాజ్ గార్ఫియాతో మూడో సీడ్ నొవాక్ జకోవిచ్ పోటీపడనున్నాడు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

మాంద్యంలోకి యూరోజోన్

వృద్ధి 0.1 శాతానికి పతనం

న్యూఢిల్లీ : యూరోపియన్ దేశాలు మాంద్యంలోకి జారుకున్నాయని రిపోర్ట్‌లు వస్తున్నాయి. ఉక్రెయిన్, రష్యా పరిణామాలతో భారీగా పెరిగిన ఇంధన ధరలు యూరో ప్రాంతాన్ని తీవ్ర ఒత్తిడికి గురి చేస్తోన్నాయి. హెచ్చు ద్రవ్యోల్బణం ఆ దేశాల వృద్ధి రేటును దెబ్బతీస్తుంది. ప్రస్తుత ఏడాది జనవరి నుంచి మార్చి తొలి త్రైమాసికంలో 20 దేశాల ఆర్థిక వ్యవస్థ వృద్ధి 0.1 శాతానికి పడిపోయింది. ఇంతక్రితం 2022 నాలుగో త్రైమాసికంలోనూ ప్రతికూలతను చవి చూసింది. బ్లూమ్‌బర్గ్ పోల్ రిపోర్ట్ ప్రకారం.. యూరోను ప్రవేశపెట్టినప్పటి నుంచి ద్రవ్యోల్బణం అత్యధిక స్థాయికి చేరినప్పటికీ తిరోగమనాన్ని నివారించవచ్చని రాజకీయ నాయకులు యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ అధికారులు పదే పదే చెప్పినప్పటికీ.. ఆచరణలో ఆ ఫలితాలు కానరావడం లేదు.

హావ్ మోర్ మరిన్ని కొత్త రుచుల జోడింపు



హైదరాబాద్ : లోట్టెకు చెందిన ప్రముఖ ఐస్‌క్రీమ్ బ్రాండ్ హావ్ మోర్ కొత్తగా వినియోగదారుల ప్రాధాన్యతలకు అనుగుణంగా 10 సరికొత్త రుచులతో సమ్మిళితమైన ఐస్‌క్రీమ్‌లను ఆవిష్కరించినట్లు ప్రకటించింది. వినియోగదారుల మారుతున్న అభిరుచికి అనుగుణంగా వీటిని ఆవిష్కరించామని ఆ సంస్థ తెలిపింది. సంప్రదాయ ఐస్ క్రీం రుచులను అందిస్తూనే.. హావ్ మోర్ రాజ్‌వాడి కుల్ఫీ ఫలూదాతో ఆకర్షణీయమైన అనుభవాన్ని సృష్టిస్తుందని హవ్‌మోర్ ఐస్ క్రీమ్ వైస్ ప్రెసిడెంట్, మార్కెటింగ్ రిషబ్ వర్మ పేర్కొన్నారు.

మీషో నూతన బ్రాండ్ ఆవిష్కరణ

హైదరాబాద్ : ఈ-కామర్స్ వేదిక మీషో నూతన బ్రాండ్‌ను ఆవిష్కరించినట్టు ప్రకటించింది. దీనికి సంబంధించిన నూతన లోగోను ప్రవేశపెట్టింది. దీంతో వచ్చే రెండు త్రైమాసికాల్లో లాభాదాయకతపై దృష్టి పెట్టింది. "పునరుద్ధరించిన నూతన బ్రాండును ఆవిష్కరణతో సంతోషంగా ఉంది. భారత్‌లో ఈ-కామర్స్‌నకు అపారమైన అవకాశాలు ఉన్నాయి. తదుపరి వృద్ధి కొనసాగుతుందనే విశ్వాసం ఉంది. ఈ బ్రాండు పునరుద్ధరణ ద్వారా లక్షలాది వినియోగదారులు ఈ-కామర్స్ వేదికకు మారటానికి పురోగమిస్తుందని విశ్వసిస్తున్నాం" అని మీషో వ్యవస్థాపకులు, సీఈఓ విదిత్ ఆత్రేయ్ పేర్కొన్నారు.

ఆఫ్ఘన్ మంత్రి అంత్యక్రియల్లో పేలుడు

11మంది మృతి

ఫైజాబాద్ : ఆఫ్ఘన్ మంత్రి అంత్యక్రియల సమయంలో సంభవించిన పేలుడులో 11మంది మరణించగా, 30మంది గాయపడ్డారని హోం శాఖ తెలిపింది. ఆఫ్ఘన్ తాత్కాలిక ప్రావిన్షియల్ గవర్నర్ నిసార్ అహ్మద్ అహ్మది ఈ వారం ప్రారంభంలో ఆత్మాహుతి దళం జరిపిన దాడిలో మరణించారు. బదక్షాన్ ప్రావిన్స్ రాజధాని ఫైజాబాద్‌లో అహ్మది అంత్యక్రియల సమయంలో పేలుడు సంభవించింది. కాగా ఈ చర్యను హోం మంత్రిత్వ శాఖ తీవ్రంగా ఖండించింది. 2021 ఆగస్టులో తాలిబన్లు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆఫ్ఘన్‌లో భద్రత మెరుగుపడింది కానీ ఇస్లామిక్ స్టేట్ గ్రూపు ముప్పు మాత్రం మిగిలే వుంది. కాగా అహ్మది హత్యకు తమదే బాధ్యత అని ఐఎస్ ప్రకటించింది. పేలుడు పదార్థాలతో నిండిన కారును ఆయన వాహనంపైకి పోనివ్వడంతో అహ్మదితో పాటు కారు డ్రైవర్ కూడా చనిపోయారు. మరో ఆరుగురు గాయపడ్డారు. అహ్మది అంత్యక్రియలకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరైన సమయంలో గురువారం పేలుడు సంభవించింది.

సంపన్న దేశాల్లోకెల్లా బ్రిటన్‌లోనే అత్యధిక ద్రవ్యోల్బణం

ఓఈసీడీ అంచనా

లండన్ : అభివృద్ధి చెందిన దేశాల్లో కెల్లా బ్రిటన్‌లోనే అత్యధికంగా ద్రవ్యోల్బణం రేటు నెలకొనగలదని ఓఈసీడీ ఎకనామిక్ గ్రూపు అంచనా వేసింది. 2023లో దాదాపు 7శాతంగా సగటు ద్రవ్యోల్బణం రేటు వుంటుందని ఊహించింది. ఇది జీ-7 దేశాల్లో కెల్లా అధికం. సంపన్న దేశాల్లో కెల్లా బ్రిటన్‌లోనే అత్యధిక ద్రవ్యోల్బణం వుందంటే అది ప్రభుత్వ వైఫల్యమేనని లేబర్ పార్టీకి చెందిన షాడో ఆర్థిక మంత్రి జేమ్స్ ముర్రే వ్యాఖ్యానించారు. కుటుంబాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్న ఈ ద్రవ్యోల్బణం కారణంగా మన ఆర్థిక వ్యవస్థ చాలా దారుణంగా బలహీనపడిందని అన్నారు. 13ఏళ్ళ పాటు టోరీల ఆర్థిక నిర్వహణా లోపమే ఇందుకు కారణమని ముర్రే విమర్శించారు. జీ-7 దేశాల్లో అత్యధిక సుస్థిర అభివృద్ధిని సాధించేందుకు లేబర్ పార్టీ ప్రతిపాదిస్తున్న చర్యలు మన ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేస్తాయని, మరింత భద్రతగా మారుస్తుందని, టోరీల వైఫల్యానికి ప్రజలు మూల్యం చెల్లించాల్సిన పరిస్థితి వుండదని అన్నారు. లేబర్ మార్కెట్‌లో ప్రాతినిధ్యం తగ్గడం, ఇంధన ధరలు, సరఫరా చెయిన్లలో విస్తృత అంతరాయాలు ఈ పరిస్థితికి కారణమని ఓఈసీడీ గ్రూపు ప్రధాన ఆర్థికవేత్త క్లారె లాంబార్డెల్లి చెప్పారు.

ధాన్యం డబ్బులు చెల్లించాలని రైతుల రాస్తారోకో



నవతెలంగాణ - మల్లాపూర్

వరి ధాన్యం అమ్మి రెండు నెలలు గడుస్తున్నా డబ్బులు ఖాతాలో జమ కాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని కొత్త దామరాజుపల్లి గ్రామంలో గురువారం రైతులు రోడ్డుపై బైటాయించి రాస్తారోకో చేశారు. పలువురు రైతులు మాట్లాడుతూ.. వరి ధాన్యం అమ్మి రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు డబ్బులు ఇవ్వడం లేదని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో వానాకాలంలో విత్తనాలు తెచ్చేందుకు, పనులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయినా డబ్బులు ఖాతాలో జమ కాలేదన్నారు. సుమారు గంటపాటు రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ రవీందర్, ఎస్ఐ నవీన్ అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. రైతులు గజ్జి శ్రీనివాస్, పన్నాల నారాయణ, కాటిపెల్లి రాజశేఖర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌కాయిస్‌లో ఓపెన్ డే

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్‌లోని ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషియన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ (ఇన్‌కాయిస్)లో గురువారం ఓపెన్ డే నిర్వహించారు. సముద్రాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తలపెట్టిన ఈ కార్యక్రమంలో వివిధ విద్యాలయలకు చెందిన 700 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారు జాతీయ సునామీ ఎర్లీ వార్నింగ్ సెంటర్, ఆపరేషనల్ ఓషియన్ సర్వీసెస్ ల్యాబోరేటరీ, ది ఓషియన్ అబ్జర్వేషనల్ ల్యాబోరేటరీ తదితర వాటిని సందర్శించారు. ఈ సందర్భంగా సముద్ర పరిజ్ఞానంపై శాస్త్రవేత్తలతో జరిగిన చర్చల్లో విద్యార్థులు పాల్గొన్నారు. వారు తమ ప్రశ్నలడిగి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్ కాంపిటేషన్ తదితర కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

నాలుగు రోజుల తర్వాత కలిసిన కొడుకు...

భావోద్వేగంలో తల్లిదండ్రులు

భువనేశ్వర్ : ఒడిశా బాలాసోర్‌లో జూన్ 2వ తేదీన జరిగిన రైలు ప్రమాదం ఎంతోమంది ప్రయాణీకుల కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. అయితే వందల కుటుంబాల్లో విషాదాన్ని నింపిన ఈ ప్రమాదం... ఓ నేపాల్ తల్లిదండ్రులకు సంతోషాన్ని మిగిల్చింది. తమ కుమారుడు మృతి చెందాడేమోనని ఆవేదనకు గురైన ఆ తల్లిదండ్రులకు.. ప్రమాదం జరిగిన నాలుగు రోజుల తర్వాత తమ కుమారుడు తిరిగి ఆరోగ్యంగా తమ చెంతకు చేరాడు. ఈ ఘటన వివరాల్లోకి వెళితే.. నేపాల్‌కి చెందిన రామానంద్ పాశ్వాన్ (15) అనే టీనేజ్ అబ్బాయి తన బంధువులు ముగ్గురితో కలిసి కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్నాడు. జూన్2న జరిగిన ఘోర రైలు ప్రమాదంలో రామానంద్ తీవ్రంగా గాయలపాలై స్పృహ కోల్పోయాడు. తనతోపాట ప్రయాణిస్తున్న ముగ్గురు బంధువులు ఈ ప్రమాదంలో మృతి చెందారు. ఇక ఈ ఘోర రైలు ప్రమాదం గురించి తెలుసుకున్న రామానంద్ తల్లిదండ్రులు ఒడిశాకు చేరుకున్నారు. ఈ ప్రమాదంలో కుమారుడితో ప్రయాణించిన తమ బంధువులు మృతదేహాలను రామానంద్ తండ్రి హరి పాశ్వాన్ గుర్తించాడు. అయితే తమ కుమారుడు బతికే ఉన్నాడని తెలుసుకున్న కుమారుడి తల్లిదండ్రులు సంతోషపడ్డారు. అయితే తన కుమారుడు ఎక్కడున్నాడో తెలియక ఆ తల్లిదండ్రులు ఆవేదనకు గురయ్యారు. తమ కుమారుని ఆచూకీ కోసం.. స్థానిక మీడియా ఛానెల్‌కు ఓ ప్రకటన ఇచ్చారు. దీంతో రామానంద్ స్పృహలోకొచ్చిన తర్వాత టీవీలో తన తల్లిదండ్రుల్ని చూసి వారిని గుర్తించినట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. కాగా, 'నేపాల్‌కు చెందిన 15 ఏళ్ల రామానంద్ పాశ్వాన్ తన తల్లిదండ్రులకు తిరిగి కలుసుకోవడం మాకొక భావోద్వేగ క్షణం. అతను నిజంగా నేపాల్‌కి చెందినవాడే. అతను చెప్పిన సమాచారం సరైనదే. దీంతో మా హెల్ప్ డెస్క్ రామానంద్ తల్లిదండ్రులను సంప్రదించి రామానంద్‌ని వారి వద్దకు చేర్చింది' అని ఎస్‌సిబి మెడికల్ కాలేజీ ట్వీట్ చేసింది.



ఇలాంటి ఘటనే మరొకటి చోటుచేసుకుంది. రైలు ప్రమాదంలో విడిపోయిన నూతన జంటను ఎస్‌సిబి మెడికల్ కాలేజీ ఒకచోటకు చేర్చినట్లు ఆసుపత్రివర్గాలు వెల్లడించాయి.

ప్రియురాలిని చంపి.. శరీర భాగాలను ముక్కలుగా చేసి..

శ్రద్ధావాకర్ హత్య తరహాలో ముంబయిలో మరో హత్య



ముంబయి : శ్రద్ధావాకర్ హత్య తరహాలోనే ముంబయిలో మరో ఘటన చోటుచేసుకుంది. తన ప్రియురాలిని హత్యచేసి, ఆమె శరీర భాగాలను ముక్కలుగా చేసిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు వెల్లడించిన వివరాలు ప్రకారం.. ముంబయిలోని మీరా రోడ్డులోని ఓ ఇంటిలో మనోజ్ సహానీ(56), సరస్వతి వైద్యతో మూడేండ్లుగా కలిసి ఉంటున్నాడు. అయితే నిన్న వారు ఉంటున్న ఇంటి నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోవడంతో సరస్వతి హత్య గురించి వెలుగులోకి వచ్చింది. ఆ ఇంట్లో మృతురాలి శరీర భాగాల ముక్కలను పోలీసులు గుర్తించారు. ఈ హత్యను దాచిపెట్టేందుకు అతడు యత్నించాడని.. ఆమె శరీర భాగాల్లో కొన్నింటిని నిందితుడు కుక్కర్‌లో ఉడికించినట్టు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం మనోజ్ సహానీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ హత్యకు గల కారణాలపై దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.

అమెరికా, క్యూబా పర్యటనలో కేరళ సీఎం



తిరువనంతపురం : కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అమెరికా, క్యూబాల్లో పర్యటించనున్నారు. ఎనిమిది రోజుల పర్యటనలో భాగంగా విజయన్ బృందం గురువారం ఉదయం బయలుదేరింది. ముందుగా జూన్ 9 శుక్రవారం విజయన్ న్యూయార్క్‌లోని 9/11 మెమోరియల్‌ను సందర్శించనున్నారు. అనంతరం న్యూయార్క్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించనున్నారు. జూన్ 10న విజయన్ న్యూయార్క్ టైమ్‌స్క్వేర్‌లోని మారియట్ మార్కిస్‌లో ప్రాంతీయ సదస్సు లోక్ కేరళ సభను ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి కేరళ అసెంబ్లీ స్పీకర్ ఎఎన్.షంసీర్ అధ్యక్షత వహిస్తారు. ఆర్థిక మంత్రి కెఎన్. బాలగోపాల్, ప్రముఖ లోక్‌సభ సభ్యులు, చీఫ్ సెక్రటరీ విపి.జారుతో సహా పలువురు హాజరుకానున్నారు. జూన్ 11న బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్ మీట్‌ను ప్రారంభిస్తారు. ఈ మీట్‌లో అమెరికాలోని మలయాళీ పెట్టుబడిదారులు, అమెరికాలో నివసిస్తున్న మలయాళీలతో పాటు ఐటీఐ నిపుణులు, విద్యార్థులు, మహిళా వ్యాపారవేత్తలతో సమావేశం కానున్నారు. అదేరోజు సాయంత్రం టైమ్‌స్క్వేర్‌లో నిర్వహించే మలయాళీ కమ్యూనిటీ సమావేశంలో ప్రసంగించనున్నారు. జూన్ 12న వాషింగ్టన్ డీసీలో ప్రపంచబ్యాంక్ దక్షిణాసియా ప్రాంతీయ ఉపాధ్యక్షుడు మార్టిన్ రైజర్‌తో భేటీ కానున్నారు. జూన్ 13న సముద్రతీరంలో వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను పరిశీలించనున్నారు. జూన్ 14న న్యూయార్క్ నుంచి క్యూబా రాజధాని హవానాకు చేరుకుంటారు. 15,16 తేదీల్లో క్యూబాలో నిర్వహించే పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

మిషన్‌కాకతీయతో చెరువులకు పునర్వైభవం

తెలంగాణ ఫుడ్స్ చైర్మెన్ మేడే రాజీవ్‌సాగర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నాటి పాలకుల నిర్లక్ష్యంతో తెలంగాణలోని చెరువుల గొలుసుకట్టు వ్యవస్థ చిన్నాభిన్నం అయ్యిందని, కానీ దశాబ్ద కాలంలో ప్రభుత్వం చేపట్టిన మిషన్ కాకతీయతో వాటికి పునర్వైభవం దక్కిందని తెలవంగాణ ఫుడ్స్ చైర్మెన్ మేడే రాజీవ్‌సాగర్ తెలిపారు. ఒకప్పుడు ఎండకాలం రాకముందే ఊరి చెరువు ఎండిపోయి ఉండేదని, నేడు కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయ ద్వారా నడి ఎండకాలంలో సైతం చెరువులు మత్తడులు దూకుతున్నాయని ఆయన ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మిషన్ కాకతీయలో తీసిన పూడిక మట్టి పొలాల్లో పోయడం ద్వారా పొలాల్లో సారం పెరిగిందన్నారు. చెరువుల పునరుద్ధరణతో నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో పాటు దాదాపు 4లక్షల మంది మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపడిందని వివరించారు. చెరువుల మీద ఆధారపడ్డ ఎన్నో కులవృత్తులకు నేడు పునర్మ వైభవం వచ్చిందని పేర్కొన్నారు.

షర్మిల అబద్ధాలు

రైతన్న సంతోషంగా ఉండడం ఇష్టంలేకనే వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షులు షర్మిల అబద్దాలు ప్రచారం చేస్తున్నారని రాజీవ్‌సాగర్ వివరించారు. బీజేపీ టీమ్ పార్టీలను తెలంగాణ ప్రజలు పట్టించుకోవడం లేదనే బీఎస్పీ, వైఎస్ఆర్టీపీ నేతలు తమ పార్టీమీద అవాక్కులు చావాకులు పేలుతున్నారని విమర్శించారు.

సీఎం కేసీఆర్‌కు శర్వానంద్ ఆహ్వానం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఇటీవల వివాహం చేసుకున్న ప్రముఖ నటుడు శర్వానంద్, గురువారం ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావును మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. శుక్రవారం సాయంత్రం హైద్రాబాద్‌లో జరిగే తన వివాహ రిసెప్షన్ వేడుకకు రావాల్సిందిగా కేసీఆర్‌ను ఆహ్వానించారు. ఈ సందర్భంగా శర్వానంద్‌కు సీఎం వివాహ శుభాకాంక్షలు తెలిపారు.

బ్రిజ్ భూషణ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు యథాతథం

: రెజ్లర్ తండ్రి

న్యూఢిల్లీ : రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చీఫ్, బీజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై ఆరోపణలు చేసిన 'మైనర్' రెజ్లర్ కోర్టులో తన స్టేట్‌మెంట్‌ను సవరించారు. సంఘటన జరిగిన సమయంలో తాను మైనర్‌ను కాదని, మేజర్‌నేనని తెలిపారు. ఆమె తండ్రి మీడియాతో మాట్లాడుతూ, తన కుమార్తె వయసుకు సంబంధించిన స్టేట్‌మెంట్‌ను మాత్రమే మార్చారని, లైంగిక వేధింపుల ఆరోపణలు యథాతథంగా ఉన్నాయని చెప్పారు. గతంలో ఆమె చేసిన ఫిర్యాదు మేరకు ఢిల్లీ పోలీసులు బ్రిజ్ భూషణ్‌పై పోక్సో చట్టం క్రింద కేసు నమోదు చేశారు. అంతకుముందు ఇచ్చిన ఫిర్యాదును ఉపసంహరించుకోలేదని, కేవలం కొత్త స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశామని చెప్పారు.

'మైనర్' రెజ్లర్ ఫిర్యాదు మేరకు లైంగిక నేరాల నుంచి బాలల పరిరక్షణ చట్టం (పోక్సో) ప్రకారం బ్రిజ్ భూషణ్‌పై కేసు నమోదైంది. ఈ చట్టంలోని సెక్షన్ 10 ప్రకారం ఆయనపై కేసు నమోదవడంతో ఆరోపణలు రుజువైతే ఆయనకు ఏడేళ్ల జైలు శిక్ష విధించే అవకాశం ఉండేది. తాను మేజర్‌నని ఆమె కొత్తగా స్టేట్‌మెంట్ ఇచ్చిన నేపథ్యంలో బ్రిజ్ భూషణ్‌పై నమోదైన పోక్సో కేసు తొలగిపోయే అవకాశం ఉంది.

ప్రభుత్వ చర్చలు సఫలం

కేంద్ర హోం మంత్రి అమిత్ షా మహిళా రెజ్లర్లతో తొలిత చర్చలు జరిపారు. అనంతరం కేంద్ర క్రీడల శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ కూడా రెజ్లర్లతో చర్చలు జరిపారు. బ్రిజ్ భూషణ్‌పై దర్యాప్తు పూర్తి చేసి, జూన్ 15నాటికి ఛార్జిషీటు దాఖలు చేస్తామని ప్రభుత్వం లిఖితపూర్వకంగా హామీ ఇచ్చింది. అంతేకాకుండా రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలో అధికార మార్పిడికి అంగీకరించింది. ఈ ఫెడరేషన్‌కు త్వరలో జరిగే ఎన్నికల్లో బ్రిజ్ భూషణ్ కుటుంబ సభ్యులు పోటీ చేయకుండా చూస్తామని హామీ ఇచ్చింది. ఈ ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి పదవులను భర్తీ చేసేటపుడు బజరంగ్ పూనియా, సాక్షి మాలిక్, వినేష్ ఫోగట్ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చింది. ఠాకూర్‌తో ఆరు గంటలపాటు జరిగిన చర్చల్లో రెజ్లర్లు బజరంగ్ పూనియా, సాక్షి మాలిక్ పాల్గొన్నారు. చర్చలు ముగిసిన తర్వాత కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ మాట్లాడుతూ ఈ ఫెడరేషన్‌లో అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేస్తామని, దీనికి ఓ మహిళను అధ్యక్షురాలిగా నియమిస్తామని చెప్పారు. ఎన్నికల తర్వాత మంచి ఆఫీసు బేరర్లు ఉన్న మంచి ఫెడరేషన్‌గా పని చేస్తుందన్నారు. క్రీడాకారుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు.

'నకిలీ' గుట్టురట్టు.. అక్రమంగా నకిలీ విత్తనాలు విక్రయాలు

- రెండు ముఠాలకు చెందిన 15మంది అరెస్ట్
- పరారీలో మరో ముగ్గురు నిందితులు
- రూ.2.11 కోట్ల విలువైన నకిలీ విత్తనాలు స్వాధీనం



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

వరంగల్ జిల్లా కేంద్రంగా నకిలీ విత్తనాల విక్రయాలకు పాల్పడుతున్న రెండు ముఠాల గుట్టును వరంగల్ పోలీసు కమిషనరేట్ పోలీసులు రట్టు చేశారు. రెండు ముఠాలకు చెందిన 15 మందిని అరెస్ట్ చేయగా మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారు. టాస్క్‌ఫోర్స్, మడికొండ, ఎనుమాముల పోలీసులు, వ్యవసాయ శాఖాధికారులతో కలిసి సంయుక్తంగా నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.2.11 కోట్ల విలువైన నకిలీ విత్తనాలు, 7 టన్నుల విడి విత్తనాలు, 9,765 నకిలీ విత్తనాల ప్యాకెట్లు, ఒక డీసీఎం, ఒక కారు, రూ.21 లక్షల నగదు, నకిలీ విత్తనాల పాకెట్ల తయారీ కొరకు అవసరమైన సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. గురువారం వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోలిస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ వివరాలు వెల్లడించారు. కర్నూలు జిల్లాకు చెందిన దాసరి శ్రీనివాస్, తాప్తే హనుమంతు, హైదరాబాద్‌కు చెందిన చేడం పాండు, వెంకటరమణ, వేముల అరవింద్‌రెడ్డి, మంచిర్యాలకు చెందిన కొప్పుల రాజేష్, బోగే సత్యం, షేక్ అమ్జద్, ఇందుర్తి వెంకటేష్, పుట్ట రాజేశం, మహారాష్ట్రలోని చంద్రాపూర్‌కు చెందిన వడిచర్ల సురేందర్‌రెడ్డి, బల్లార్షకు చెందిన ఎన్నాడే దిలీస్, మహబూబ్‌నగర్‌కు చెందిన చేడాం నాగరాజు, బాపట్లకు చెందిన సుందర్‌శెట్టి ఫణీందర్, నాగర్‌కర్నూల్‌కు చెందిన కాల్వ శ్రీధర్, అరెస్ట్ చేయగా శివారెడ్డి, భాస్కర్‌రెడ్డి, గంప సదాశివ్ పరారీలో ఉన్నారు. ఒక ముఠాలోని సభ్యులు రైతుల నుంచి తక్కువ ధరకు విడిగా విత్తనాలు కొనుగోలు చేసి వాటిని ఈ ముఠాలోని ప్రధాన నిందితులు దాసరి శ్రీనివాసరావు, భాస్కర్‌రెడ్డి కర్నాటకలో నిర్వహిస్తున్న విత్తన కంపెనీలకు తరలించి అక్కడ విత్తన శుద్ధి చేయించేవారు. వాటిని వివిధ రకాల విత్తన కంపెనీల పేర్లతో ప్యాక్ చేసి వరంగల్ నగరానికి తీసుకువచ్చేవారు. ఇక్కడి నుంచి తెలంగాణ, మహారాష్ట్రల్లోని జిల్లాలకు చెందిన విత్తన డీలర్లు, రైతులకు విక్రయించేవారు. మరో ముఠాకు చెందిన ప్రధాన నింది తులు చేడాం పాండుకు ప్రభుత్వ అనుమతులు కలిగిన రుషి, శ్రీగణేష్ విత్తన శుద్ధి కంపెనీలున్నాయి. కాగా, గుజరాత్‌లోని నర్మదాసాగర్ కంపెనీకి ఉప విక్రయ లైసెన్స్‌దారుగా ఉన్న ఇతను.. సులువుగా డబ్బులు సంపాదించాలనే లక్ష్యంతో నర్మదాసాగర్ కంపెనీకి చెందిన విత్తన పాకెట్లను తీసిపోని విధంగా క్యూఆర్ కోడ్, విత్తన తయారీ, గడువు తారీఖులు, క్రమ సంఖ్య, ఎంఆర్‌పీలతో కూడిన నకిలీ నర్మదా విత్తన ప్యాకెట్లను తయారు చేసి విక్రయించారు. పోలీసులకు అందిన పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్, మడికొండ, ఎనుమాముల పోలీసు అధి కారులు, వ్యవసాయాధికారులు రెండు బృందాలుగా ఏర్పడి బుధవారం నిందితులను అరెస్టు చేసి విచారించారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనపరిచిన టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస రావు, జనార్ధన్‌రెడ్డి, అల్లం రాంబాబు, ఎస్. శ్రీనివాస్, వేణు, మహేందర్, ఎస్ఐలు దేవేందర్, భూక్యా చందర్, బండారి సంపత్, శరత్‌కుమార్, లవన్‌కుమార్, రాజు, శ్రీకాంత్, తదితరులను సీపీ అభినందించారు.

ఎనిమిది జిల్లాల్లో పెట్రోల్ బంక్‌లు ఏర్పాటు

- పౌరసరఫరాల సంస్థ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో రెండో దశలో ఎనిమిది జిల్లాల్లో జిల్లాకు ఒకటి చొప్పున పెట్రోల్ బంకులను ఏర్పాటు చేయనున్నట్టు పౌరసరఫరాల సంస్థ చైర్మెన్ సర్దార్ రవీందర్ సింగ్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాల్లో పెట్రోల్ బంకులకు అనువైన స్థలాలను గుర్తించి ఆయా ఆయిల్ కంపెనీలకు టాయింపు జరిపేందుకు ఐదుగురితో కమిటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కమిటీలో ఫైనాన్స్, మార్కెటింగ్, ప్రొక్యూర్ మెంట్ జనరల్ మేనేజర్లు, ఫైనాన్స్ డీజీఎం, హైదరాబాద్ జిల్లా మేనేజర్ ఉంటారని వివరించారు. తొలి విడతలో ఇదివరకే కరీంనగర్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి (ఐఓసి), కొత్తగూడెం, మేడ్చల్, ఖమ్మం (హెచ్‌పీసీఎల్), జగిత్యాల్, మెదక్ (బీపీసీఎల్)లో బంకులను ఏర్పాటు చేసినట్టు గుర్తుచేశారు. రెండో విడతలో వరంగల్, వనపర్తి, సూర్యాపేట, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, సిద్దిపేట, హనుమకొండ, జనగామ జిల్లాల్లో పెట్రోల్ బంక్‌ల ఏర్పాటుకు ఆమోదం తెలిపినట్టు వెల్లడించారు. సంస్థ ఆదాయం పెంపునకు ఉన్న మార్గాలను అన్వేషిస్తున్నట్టు రవీందర్ సింగ్ తెలిపారు.

వడదెబ్బతో సివిల్ సప్లయ్ హమాలీ మృతి

నవతెలంగాణ-భైంసా

నిర్మల్ జిల్లా భైంసాలో వడదెబ్బకు గురైన సివిల్ సప్లయ్ హమాలీ కార్మికుడు గురువారం మృతిచెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... షేక్ అస్లాం(52) 20 సంవత్సరాలుగా సివిల్ సప్లయ్ గోదాంలో పని చేస్తున్నాడు. ఎండల వల్ల వడదెబ్బకు గురయ్యాడు. గురువారం మిర్జాపూర్ గ్రామంలోని రేషన్ షాపులో పని చేస్తున్న క్రమంలో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. వెంటనే తోటి కూలీలు అతడిని భైంసా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఏసీబీకి చిక్కిన ఇద్దరు అధికారులు

- ఒకరు ఏఎల్‌ఓ, మరొకరు తహశీల్దార్

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో రెండు వేర్వేరు జిల్లాల్లో లంచాలు తీసుకుంటూ ఒక తహశీల్దారు, మరో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్(ఏఎల్‌ఓ)లు అవి నీతి నిరోధక శాఖ(ఏసీబీ) వలకు చిక్కారు. ఏసీబీ డీజీ డాక్టర్ రవి గుప్తా తెలిపిన వివరాల ప్రకా రం.. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు ఏఎల్‌ఓ సుమతిని తన కార్యాలయం వద్దే ఒక వ్యక్తి నుంచి రూ. 20 వేలను లంచం గా తీసుకుంటుండగా ఏసీబీ అధి కారులు వల పన్ని రెడ్‌హ్యాండెడ్ గా పట్టుకున్నారు. వెంకన్న అనే వ్యక్తికి లేబర్‌కార్డును జారీ చేయటంతో పాటు మరణించిన అతని కుమారుడికి మంజూరైన లక్ష రూపాయల నష్టపరిహారాన్ని చెల్లించటానికిగానూ సుమతి ఇంత మొత్తంలో లంచాన్ని డిమా ండ్ చేశారు. అలాగే, ఖమ్మం జిల్లా ఎన్‌కౌర్ మండల తహశీల్దార్ మహ్మద్‌షా ఖాసీం ఒక వ్యక్తి నుంచి రూ.3000 లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రామకృష్ణ అనే వ్యక్తికి చెందిన ఆస్థి పంపకానికి సంబంధించిన పత్రాలు ఇవ్వటానికి గానూ ఈ డబ్బును షా ఖాసీం డిమాండ్ చేసి తీసుకున్నారు. అరెస్టు చేసిన ఇద్దరిని హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపర్చి కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

- ఢీకొన్న రెండు కార్లు.. రెండు లారీలు
- నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి వద్ద ఘటన

నవతెలంగాణ- చిట్యాల

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు ప్రాణం కోల్పోయారు. ఈ ఘటన నల్లగొండ చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారులో 65జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కంటైనర్ వెనుక రెండు కార్లు వెళ్తున్నాయి. వెనుక ఉన్న కారు ముందు కారును ఢీకొట్టింది. దాంతో ముందున్న కారు డివైడర్‌ను దాటి విజయవాడ వైపు వెళ్లే రహదారిలోకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో ముందున్న కంటైనర్ డ్రైవర్ ఆందోళనకు గురవ్వడంతో అదుపు తప్పి డివైడర్‌ను దాటి హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో కుడివైపు దూసుకెళ్లిన కారును లారీ ఢీకొట్టడంతో కారులో ఉన్న నలుగురు తీవ్రంగా గాయపడ్డారు.

వారిలో ఎండి నహీం(40), సయ్యద్ మిస్బాయిద్దీన్(45) అక్కడికక్కడే మృతిచెందారు. మహమ్మద్ యూసుఫ్ హుస్సేన్, సలీంకు గాయాలవ్వగా నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించారు. అక్కడ హుస్సేన్(50) మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. సలీంను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. వీరంతా హైదరాబాద్ వాసులు. పని నిమిత్తం సూర్యాపేటకు వెళ్లి తిరిగి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. జాతీయ రహదారిపై రెండు వైపులా ప్రమాదం జరగడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. సుమారు మూడు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ శివరాంరెడ్డి తెలిపారు.

దశాబ్ది ఉత్సవాల్లో అపశృతి

- టపాకాయలు కాల్చడటంతో టెంట్ దగ్ధం

నవతెలంగాణ-భీంగల్

దశాబ్ది ఉత్సవాలలో భాగంగా 7వ రోజు చెరువుల పండగ సందర్భంగా అపశృతి చోటుచేసుకుంది. నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలం పురాణీపేట్ గ్రామ పరిసరాలలోని చెన్న చెరువు వద్ద నిర్వహిస్తున్న చెరువు పండగకు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి స్వాగతం పలికేందుకు కార్యకర్తలు బాణసంచా కాల్చగా.. అవి సమీపంలో కార్యక్రమం నిమిత్తం వేసిన టెంట్‌పై పడటంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దాంతో తేరుకున్న కార్యకర్తలు మంటలను ఆర్పివేయడంతో ప్రమాదం తప్పినట్లైంది.

నవతెలంగాణ

దళారీలు, కార్పొరేట్ సంస్థల లాభాల కోసమే

- కేంద్ర ప్రభుత్వ మద్దతు ధరలపై తెలంగాణ రైతు సంఘం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం రూపొందించిన మద్దతు ధరలు మధ్య దళారీలకు, కార్పొరేట్ సంస్థలకు లాభాలు తెచ్చిపెట్టేలా ఉన్నాయని తెలంగాణ రైతు సంఘం పేర్కొంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఉపకరణాల ధరలు 16 నుంచి 20 శాతం పెరిగినప్పటికీ, అందుకనుగుణంగా పంటలకు కనీస మద్దతు ధరలు పెంచకపోవడమేంటని ప్రశ్నించింది. అన్ని పంటలకు మద్దతు ధరలు నిర్ణయించాలంటూ రైతులు ఆందోళన చేస్తున్నా...వాటిని కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని విమర్శించింది. కేవలం 23 పంటలకు మాత్రమే మద్దతు ధరలు ప్రకటించి చేతులు దులుపుకుందని పేర్కొంది. ఈమేరకు గురువారం ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతినేని సుదర్శన్, టి. సాగర్ ఒక ప్రకటన విడుదల చేశారు. 2023-24 ఖరీఫ్ సీజన్‌కు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలు ప్రకటించిన సంగతి తెలిసిందే. క్వింటాల్ ధాన్యానికి 143 రూపాయలు, వేరుశనగకు రూ.527 పెంచిందని తెలిపారు.

గతేడాదిలో పెంచిన దానికి ఇది అదనమంటూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని విమర్శించారు. వాస్తవానికి 2022-23లో ఉత్పత్తి ఖర్చులపై 50 శాతం కూడా ప్రకటించలేదని తెలిపారు. అప్పటి మద్దతు ధరలపై ఎంతో కొంత పెంచుతూ, ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఆదరాబాదరగా మరోసారి ఎమ్ఎస్‌పీని ప్రకటించిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వాటికి శాస్త్రీయత లేదని తెలిపారు. వ్యవసాయ పంటల పెట్టుబడిని శాస్త్రీయంగా నిర్ణయించి దానికి 50 శాతం కలిపి ధరలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ కొనుగోలు సంస్థల ద్వారా అన్ని పంటలను కొనుగోలు చేసి రైతుకు రక్షణ కల్పించాలని కోరారు. సంయుక్త కిసాన్ మోర్చా సంఘాలకు కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా 'మద్దతు ధరల చట్టాన్ని' పార్లమెంట్లో ప్రవేశపెట్టాలని వారు డిమాండ్ చేశారు.

టికెట్లు తక్కువ అమ్మారంటూ బ్యానర్లు కట్టడమేంటి?

- మేడ్చల్ బస్‌డిపో మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలి: ఈయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బస్సులో ట్రావెల్ యాజ్ యూ లైక్ టికెట్లు తక్కువ అమ్మారనే కారణంతో హేళన చేస్తూ కండక్టర్ల ఫొటోలతో బ్యానర్ వేసి మేడ్చల్ బస్టాండులో అక్కడి మేనేజర్ కట్టించడాన్ని టీఎస్‌ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు. ఆయనపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అన్ని రూట్లలో ఒకేలా టికెట్లు ఎలా అమ్ముడుపోతాయని ప్రశ్నించారు. సంఘీ టెంపుల్, రామోజీ ఫిలింసిటీ, వండర్‌ల్యాండ్, రామానుజాచార్యుల విగ్రహం, శంషాబాద్, జూపార్క్, ఎంజీబీఎస్, జూబ్లీ బస్‌స్టేషన్లు, రైల్వేస్టేషన్లు టచ్ అయ్యే బస్సులలో ట్రావెల్ యాజ్ యూ లైక్ టికెట్లు ఎక్కువగా అమ్ముడుపోతాయని చెప్పారు.

రాష్ట్రంలోని 97 డిపోల్లో అన్నీ నెంబర్‌వన్ స్థానంలో ఉంటాయా? అని ప్రశ్నించారు. ఎప్పుడైనా తక్కువ ఎర్నింగ్ తెచ్చే 10 డిపోలుంటాయని తెలిపారు. అలాంటప్పుడు కండక్టర్ల ఫొటోలతోనే బ్యానర్ ఎందుకు వేశారు? బస్‌భవన్ నుంచి ఏమైనా ఆదేశాలున్నాయా? అని ప్రశ్నించారు. ఒకవేళ అలా చేయాలని యాజమాన్యం చెబితే ఆ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బస్‌భవన్ ముందు తక్కువ ఎర్నింగ్ తెస్తున్న 10 డిపోల మేనేజర్లు, 11 రీజియన్లలో చివరి మూడు రీజినల్ మేనేజర్లు, మూడు జోన్లలో తక్కువ ఎర్నింగ్ తీసుకొస్తున్న ఒక ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫొటోతో బ్యానర్ కడితే ఆ బాధేంటో ఉన్నతాధికారులకు తెలుస్తుందని పేర్కొన్నారు.

పీజీఈసెట్‌కు 13,981 మంది అర్హత

- ఫలితాలు విడుదల చేసిన లింబాద్రి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎంఈ/ఎంటెక్‌తోపాటు ఎంఫార్మసీ, ఎంఆర్క్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన పోస్టు గ్రాడ్యుయెట్ ఇంజినీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పీజీఈసెట్-2023) ఫలితాలను ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి గురువారం హైదరాబాద్‌లోని జేఎన్టీయూహెచ్‌లో విడుదల చేశారు. రాష్ట్రంలో గతనెల 29 నుంచి ఈనెల ఒకటో తేదీ వరకు నిర్వహించిన ఈ రాతపరీక్షలకు 16,563 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 14,882 మంది పరీక్షలు రాయగా, 13,981 (93.95 శాతం) మంది అర్హత సాధించారు. అందులో 8,180 అమ్మాయిలు పరీక్షలకు హాజరైతే, 7,762 మంది అర్హత పొందారు. 6,702 మంది అబ్బాయిలు రాయగా, 6,219 మంది ఉత్తీర్ణులయ్యారు. 19 సబ్జెక్టులకు పీజీఈసెట్ రాతపరీక్షలను నిర్వహించామని కన్వీనర్ రవీంద్రారెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో జేఎన్టీయూహెచ్ వీసీ కట్టా నర్సింహారెడ్డి, రెక్టార్ ఎ గోవర్ధన్, రిజిస్ట్రార్ మంజూర్ హుస్సేన్, ఉన్నత విద్యామండలి కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు, పీజీఈసెట్ కోకన్వీనర్ జె సురేష్‌కుమార్, కోఆర్డినేటర్ టి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీలో అధికంగా అర్హత

పీజీఈసెట్‌కు హాజరైన వారిలో ఫార్మసీ అభ్యర్థులే అధికంగా ఉన్నారు. ఈ పరీక్షకు మొత్తం 16,563 మంది హాజరుకాగా, అందులో 5,782 మంది ఫార్మసీ అభ్యర్థులే ఉన్నారు. వారిలో 5,679 మంది అర్హత సాధించారు. సివిల్ ఇంజినీరింగ్‌కు 2,443 మంది పరీక్ష రాయగా, 2,239 మంది అర్హత పొందారు. అలాగే కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి 2,070 మంది హాజరుకాగా, 1,902 మంది, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌కు 1,524 మంది పరీక్ష రాస్తే, 1,388 మంది, ఎలక్ట్రానిక్స్‌కు 1,450 మంది రాయగా, 1,250 మంది ఉత్తీర్ణత సాధించారు. అత్యల్పంగా టెక్స్‌టైల్ టెక్నాలజీకి తొమ్మిది హాజరైతే ఎనిమిది మంది, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజినీరింగ్‌కు 12 మంది హాజరుకాగా, 10 మంది అర్హత పొందారు.

రాష్ట్ర ప్రభుత్వ నిధులతోనే కొత్త మెడికల్ కాలేజీలు

- కేంద్రానిది రూపాయి కూడా లేదు :వైద్యారోగ్యశాఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయబోతున్న తొమ్మిది మెడికల్ కాలేజీలు పూర్తిగా ఇక్కడి ప్రభుత్వ నిధులతో ఏర్పాటవుతున్నవేనని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు గురువారం ఆ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. వాటి ఏర్పాటులో కేంద్ర ప్రభుత్వానిది ఒక్క రూపాయి కూడా లేదని తెలిపింది. రాష్ట్రంలో తొమ్మిది ప్రభుత్వ, నాలుగు ప్రయివేటు మొత్తం 13 మెడికల్ కాలేజీలకు నేషనల్ మెడికల్ కమిషన్ ఈ ఏడాది అనుమతి ఇచ్చిందని వివరించింది.

వాటికి కేంద్రం ఆమోద ముద్రంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని కొట్టేసింది. ఎన్ఎంసీ స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థ అనీ, నిర్దేశించిన అన్ని నిబంధనలు సంతృప్తిగా పరిచేలా ఉన్నాయా? లేవా? అని పలుమార్లు పరిశీలించిన అనంతరం మెడికల్ కాలేజీలకు అనుమతి ఇస్తుందని వెల్లడించింది.

బాలాసోర్ ఘటనకు మతం రంగు

మతోన్మాదుల కట్టుకథలు తోసిపుచ్చిన అధికారులు

భువనేశ్వర్ : బాలాసోర్ రైలు ప్రమాదంపై అటు సీబీఐ, ఇటు రైల్వే శాఖ విచారణ జరుపుతున్నాయి. ప్రమాద కారణాన్ని తెలుసుకునే పనిలో నిమగ్నమయ్యాయి. అయితే ఈ దుర్ఘటనపై మీడియాలోనూ, సోషల్ మీడియాలోనూ పలు కథనాలు వెలువడుతున్నాయి. ముఖ్యంగా ఈ ఘటనకు మతం రంగు పులిమేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారు. సంఘటన జరిగిన తర్వాత బాహానగర్ బజార్ రైల్వే స్టేషన్ స్టేషన్ మాస్టర్ షరీఫ్ కన్పించడం లేదంటూ సోషల్ మీడియాలో పోస్టులు కన్పించాయి. ఆ తర్వాత వాటిలో కొన్ని పోస్టులను తొలగించారు. బీజేపీ ఐటి విభాగం అధిపతిగా చెప్పుకుంటున్న ఓ వ్యక్తి కూడా ఇలాంటి పోస్టే పెట్టారు. 'విచారణకు ఆదేశించిన తర్వాత స్టేషన్ మాస్టర్ షరీఫ్ అదృశ్యమయ్యారు. ఈ మతం వారితో ఇదే సమస్య' అంటూ ఆయన ట్వీట్ చేశారు. కొందరు పనిలో పనిగా దీనిని రీ-ట్వీట్ చేశారు కూడా.

ట్విటర్ ఖ్యా వినియోగదారుడైన ఓ వ్యక్తి అయితే ఈ ప్రమాదానికి స్టేషన్ మాస్టరే కారణమని తేల్చే శారు.'ఇది ప్రమాదం కాదు. నిర్లక్ష్యమూ కాదు. కన్పిం చకుండా పోయిన స్టేషన్ మాస్టర్ షరీఫ్ ఉద్దేశపూర్వకంగాచేసిన పని. గూడ్సు రైలు ఉన్న లూప్ లైన్‌లోకి కోర మాండల్ ఎక్స్‌ప్రెస్‌ను పంపారు. స్టేషన్ మాస్టర్ పాత్రపై విచారణ జరిపితే పన్నాగం బయట పడుతుంది 'అంటూ ఆయన ట్వీట్ చేశారు. రైలు పట్టాల సమీపంలో మసీదు ఉండడం తో పలువురు స్టేషన్ మాస్టర్ షరీఫ్ వైపు వేలెత్తి చూపుతున్నారు. పట్టాల పక్కన మసీదు ఉన్న ఫొటోలను కూడా షేర్ చేస్తు న్నారు. అయితే ఆ భవనం వాస్తవానికి మసీదు కాదు... అది ఇస్కాన్ దేవాలయం. ఇక స్టేషన్ మాస్టర్ గది వెలుపల ఉన్న ఓ బోర్డు పైన సిబ్బంది పేర్లు రాశారు. వాటిలో షరీఫ్ అన్న పేరే లేదు.

ఈ నెల 4న కళింగ టీవీ ప్రసారం చేసిన వార్త శీర్షిక ఇలా ఉంది 'బాహనగర్ అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్ పరారీ'. వార్తలోకి వెళితే రైలు ప్రమాదం జరిగిన తర్వాత విధుల్లో ఉన్న అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్ ఎస్‌బీ మొహంతీ ఆచూకీ తెలియడం లేదు' అని ఉంది. అయితే మొహంతీని విచారిస్తున్నారంటూ ఈ నెల 5న మరో వార్తను ఆ టీవీ అందించింది. ఒడిశాకు చెందిన ఇద్దరు సీని యర్ ఐపీఎస్ అధికారులను సంప్రదించగా స్టేషన్ మాస్టర్లు ఎవరూ పారిపోలేదని, పోలీసులు వారిని సంప్రదిస్తూనే ఉన్నారని తెలిపారు. స్టేషన్ సిబ్బందిలో షరీఫ్ పేరు ఉన్న వారు ఎవరూ లేరని కూడా చెప్పారు.

స్టేషన్ సిబ్బంది మొత్తం విచారణకు హాజర వుతున్నారని అన్నారు. భువనేశ్వర్‌కు చెందిన పాత్రికేయులు కూడా ఈ విషయాన్నే ధృవీకరించారు. రైల్వే పీఆర్‌ఓ నిహార్ మొహంతీ కూడా ఇదే మాట చెప్పారు. ఎప్పుడో 2004 మార్చిలో పోస్ట్ చేసిన చిత్రాలను ఇప్పుడు కొందరు వినియోగిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అర్థమవుతోంది. వైరల్ అయిన ఫొటో లో చూపిన వ్యక్తి బొర్రా గుహల స్టేషన్ మాస్టర్ అని తేలింది.

> **జరిగిన పరిణామాలను గమనిస్తే బాలాసోర్ దుర్ఘటనకు మతం రంగు పులిమేందుకు ప్రయత్నాలు జరిగాయన్న విషయం తేటతెల్ల మవుతోంది. వదంతులు వ్యాపింప జేయడం ద్వారా మత సామరస్యాన్ని దెబ్బ తీసేందుకు ప్రయత్నించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఒడిశా పోలీసులు తెలిపారు.**

ఆ నియామకాలు చట్ట వ్యతిరేకం

'కనీస వేతన మండలి'పై హైకోర్టు

నవతెలంగాణ-హైదరాబాద్

కనీస వేతనాల సలహా మండలి చైర్మెన్, సభ్యుల నియామకాలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. తెలంగాణ రీజనల్ ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి దగ్గులసత్యం దాఖలు చేసిన పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీతో కూడిన ధర్మాసనం గురువారం విచారించింది. రాష్ట్ర వ్యాప్తంగా 149 ప్రభుత్వ ప్రయివేట్ విభాగాల్లో పనిచేసే 1,07,64,788 మంది సంఘటిత, అసంఘటిత కార్మికులు ఉన్నారని, వీళ్ల సమస్యల సాధనకు మండలి అవసరమని పిటిషనర్ వాదన. మండలి చైర్మెన్‌గా టీఆర్ఎస్ కార్మిక సంఘ నేత పి.నారాయణను నియమించడం చెల్లదని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్మిక చట్ట నిబంధనల ప్రకారం ఏ పార్టీకి, ఏ కార్మిక యాజమాన్యానికి సంబంధం లేని వాళ్లనే నియమించాలని, అందుకు విరుద్ధంగా ప్రభుత్వ ఉత్తర్వులు(జీవోనెం.14) ఉన్నాయని చెప్పారు. కనీస వేతనాల సలహా మండలిలో నియమితులైన సభ్యులు ఏ రాజకీయ పార్టీతో సంబంధం కలిగి ఉండకూడదని తెలిపారు. రాష్ట్రంలో కనీస వేతనాల చట్టం పరిధిలోకి వచ్చే లక్షలాది మంది కార్మికులు ఉన్నారనీ, అయితే కనీస వేతనాల సలహా బోర్డులో ఒక్క మహిళను కూడా నియమించలేదని వాపోయారు. ప్రభుత్వ కౌంటర్ నిమిత్తం హైకోర్టు విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది

ఎప్పుడు నియమిస్తారో చెప్పండి

ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర స్థాయి కమిషన్‌కు చైర్మెన్, సభ్యులను ఎప్పుడు నియమిస్తారో చెప్పాలంటూ ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. గత విచారణ సమయంలోనే నియామకాలు చేపట్టాలని ఆదేశించినా ఎందుకు అమలు చేయలేదని ప్రధాన కార్యదర్శిని ప్రశ్నించింది. నియమకాలు చేపట్టే యోచనలో ప్రభుత్వం ఉందని, సమయం కావాలని ప్రభుత్వం కోరింది. దీంతో సామాజిక కార్యకర్త గణేష్‌రావు మరికొందరు వేసిన పిటిషన్‌పై విచారణను ఈ నెల 28కి వాయిదా వేస్తూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఒకే కేసుగా ఎందుకు పరిగణించకూడదో చెప్పండి

మార్గదర్శి చిట్‌ఫండ్స్ అధిపతి, ఎమ్‌డీలపై ఏపీ సీఐడీ వేర్వేరు ప్రాంతాల్లో వేర్వేరుగా పెట్టిన కేసులు అన్నింటినీ ఒకే కేసుగా ఎందుకు పరిగణించరాదో చెప్పాలని ఏపీ ప్రభుత్వాన్ని తెలంగాణ హైకోర్టు ప్రశ్నించింది. మార్గదర్శి చైర్మెన్, ఎమ్‌డీలపై ఒకే తరహా కేసులను నమోదు చేయడాన్ని పలువురు హైకోర్టులో సవాల్ చేశారు. వీటిని జస్టిస్ భాస్కర్‌రెడ్డి విచారించారు. ఏపీ సీఐడీ పోలీసుల విచారణ నిమిత్తం విచారణను ఈ నెల 20కి వాయిదా వేశారు.

11న గ్రూప్-1 ప్రిలిమ్స్

3.80 లక్షల మంది దరఖాస్తు : సర్వం సిద్ధం చేసిన టీఎస్‌పీఎస్సీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈనెల 11న తెలంగాణ తొలి గ్రూప్-1 ప్రిలిమినరీ రాతపరీక్షను తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) నిర్వహించనుంది. ఆబ్జెక్టివ్ విధానంలో ఈ పరీక్ష జరగనుంది. 503 గ్రూప్-1 పోస్టుల భర్తీకి గతేడాది ఏప్రిల్ 26న టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. అయితే గతేడాది అక్టోబర్ 16న గ్రూప్-1 ప్రిలిమినరీ రాతపరీక్షను కూడా నిర్వహించారు. ఆ పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా 3,80,202 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, వారిలో 2,85,916 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అందులో 25,150 మంది అభ్యర్థులను గ్రూప్-1 మెయిన్స్ రాతపరీక్షలకు కూడా అర్హత సాధించినట్టు టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది.

అయితే ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంతో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను టీఎస్ పీఎస్సీ రద్దు చేసింది. దీంతో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను తిరిగి ఈనెల 11న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం అధికారులు సర్వంసిద్ధం చేశా రు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లాల కలెక్టర్లు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని టీఎస్‌పీఎస్సీ ఆదేశించింది. ఉదయం 10.15 గంటలకే పరీక్షా కేంద్రం వద్ద గేటు మూసి వేయడం జరుగుతుందని స్పష్టం చేసింది. అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవా లని అధికారులు సూచిస్తున్నారు. టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశం కల్పించింది. హాల్‌టికెట్లలో ఉన్న నిబంధనలను అభ్యర్థులు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. అభ్యర్థులు షూ వేసుకుని రావడానికి అవకాశం లేదు. అక్టోబర్ 16న నిర్వహించిన పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్ చెల్లుబాటు కాదని స్పష్టం చేసింది. కొత్త హాల్‌టికెట్‌తో వస్తేనే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి ఉంటుందని వివరించింది.

టీచర్ల పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలి

పీఆర్టీయూటీఎస్ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయులకు సంబంధించిన సరెండర్ లీవు, మెడికల్, జీపీఎఫ్ వంటి పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని పీఆర్టీయూటీఎస్ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ బిల్లులు నగదుగా మారకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. గురువారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రఘోత్తంరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల ఇబ్బందిని ఆసరాగా తీసుకుని జిల్లా ట్రెజరీ కార్యాలయాల్లో పర్సెంటేజీలు తీసుకుని బిల్లులను మంజూరు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల 13న కోర్టు తీర్పు అనంతరం బదిలీలు వీలు కాని పక్షంలో అడ్‌హాక్ పద్ధతిలో ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు, మాజీ ప్రధాన కార్యదర్శి గుర్రం చెన్నకేశవరెడ్డి, పత్రిక ప్రధాన సంపాదకులు తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి, సబ్‌ఎడిటర్ చిత్తలూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కటకం సుదర్శన్ మరణం తర్వాత..

- మావోయిస్టులలో తాజా పరిణామాలపై
- ఇంటెలిజెన్స్ విభాగాల ఆరా

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి



(ఫైల్)

మావోయిస్టు అగ్రనాయకుడు, కేంద్ర కమిటీ సభ్యుడు కటకం సుదర్శన్ అలియాస్ ఆనంద్ మరణం తర్వాత మావోయిస్టు పార్టీలో నెలకొంటున్న పరిణామాలపై కేంద్ర ఇంటెలిజెన్స్ బ్యూరోతో పాటు ప్రభావిత రాష్ట్రాల నిఘా అధికారులు ఆరా తీస్తున్నారు. నెల రోజుల క్రితం కటకం సుదర్శన్ గుండె పోటుతో మరణించినట్టు ఆ పార్టీ అధికార ప్రతినిధి అభయ్ ఇటీవల ప్రకటించారు. పార్టీలో కీలక నేతగా గుర్తింపు పొందిన సుదర్శన్ పార్టీ వ్యూహరచన, సిద్ధాంతవ్యాప్తిలో కీలకపాత్ర వహించినట్టు ఇంటెలిజెన్స్ వద్ద సమాచారం ఉన్నది. ముఖ్యంగా, దండకారణ్యంలో పటిష్టమైన పీపుల్స్ గెరిల్లా ఆర్మీని తయారు చేయటంలోనూ సుదర్శన్‌కు సిద్ధహస్తుడిగా పేరున్నది. ఇంతటి కీలక నేత మరణించటంతో మావోయిస్టుల పార్టీ కార్యకలాపాల్లో దాని ప్రభావం ఏ మేరకు ఉన్నదనే కోణంలో నిఘా అధికారులు నిశితంగా దృష్టిని సారించినట్టు తెలిసింది.

ఇటీవలి కాలంలో మావోయిస్టు అగ్రనేతలైన అక్కిరాజు హరగోపాల్ అలియాస్ రామకృష్ణ, హరిభూషన్‌తో పాటు మరికొందరు నేతలు అనారోగ్య కారణాల వలన మృతిచెందిన వైనాలను కూడా పరిగణలోకి తీసుకొని ఇంటెలిజెన్స్ అధికారులు ఆరా తీస్తున్నట్టు తెలుస్తున్నది. అదే సమయంలో జంపన్నతో పాటు మరికొందరు నాయకులు లొంగు 'బాట'లో నడవటం కూడా మావోయిస్టుల బలాన్ని ఏ మేరకు తగ్గించగలిగిందనేది కూడా ఇంటెలిజెన్స్ అధికారులు అంచనా వేస్తున్నట్టు సమాచారం. మొత్తమ్మీద 2024 లోక్‌సభ ఎన్నికల నాటికి మావోయిస్టుల కార్యకలాపాలను పూర్తిగా అణచివేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్టు కేంద్ర హోం శాఖ గతంలో ప్రకటించింది. ఈ నేపథ్యంలో మావోయిస్టు పార్టీలోని కీలక నేతలు కొందరు మరణించటం, మరికొందరు లొంగిపోవటాన్ని యాంటీ నక్సలైట్ విభాగాలు మదింపు చేస్తూ మావోయిస్టుల కార్యకలాపాలను అణచివేయటానికి వేయాల్సిన కొత్త ఎత్తుగడలపై కేంద్ర ఇంటెలిజెన్స్ బ్యూరోతోపాటు తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, బీహార్, ఒడిశా, ఏపీ రాష్ట్రాల నిఘా అధికారులు సమిష్టిగా చర్చించి వ్యూహాలను రచిస్తున్నారని తెలిసింది. అదే సమయంలో రాష్ట్రంలో సైతం వచ్చే ఆరు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు వస్తున్నందున మావోయిస్టుల కదలికలపై ఇప్పటి నుంచే దృష్టిని సారించాలని మావోయిస్టు ప్రభావిత జిల్లాల ఎస్పీలను డీజీపీ అంజనీ కుమార్ ఇప్పటికే ఆదేశించారు. అంతేగాక, ఎప్పటికప్పుడు ప్రభావిత జిల్లాల్లోని పరిస్థితులపై ఆయన ఉన్నతాధికారులతో చర్చిస్తున్నారని తెలిసింది.

ఆ జిల్లాల్లో మ్యాన్యువల్ స్కావెంజింగ్

- 34 శాతం జిల్లాల్లో ఇప్పటికీ ఇదే పద్ధతి
- దేశవ్యాప్తంగా 508 జిల్లాల్లో దీనిపై నిషేధం

న్యూఢిల్లీ : మ్యాన్యువల్ స్కావెంజింగ్ నిర్మూలన విషయంలో మోడీ సర్కారు గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ వాస్తవ పరిస్థితులు అందుకు పూర్తి విరుద్ధంగా ఉన్నాయి. దేశంలోని చాలా జిల్లాల్లో మనుషులు చేతులతో మలమూత్ర విసర్జాలు, మురుగు కాలువలను శుభ్రం చేసే ఈ అమానవీయ విధానం ఇప్పటికీ కొనసాగుతున్నది. సాక్షాత్తూ కేంద్ర సామాజిక న్యాయ, సాధితకారత మంత్రిత్వ శాఖ విడుదల చేసిన అధికారిక నివేదికే ఈ విషయాన్ని వెల్లడిస్తున్నది.

ఈ నివేదిక ప్రకారం.. భారత్‌లో మ్యాన్యువల్ స్కావెంజింగ్ ఇప్పటికీ ఆందోళన కలిగిస్తున్నది. దేశవ్యాప్తంగా మొత్తం 766 జిల్లాలకు గానూ 508 జిల్లాలు మ్యాన్యువల్ స్కావెంజింగ్ రహితంగా ప్రకటించుకున్నాయి. అయితే, మ్యాన్యువల్ స్కావెంజర్లుగా ఉపాధిని నిషేధించటం, పునరావాస చట్టం కింద ఈ పద్ధతి నిషేధించబడినప్పటికీ భారత్‌లో ఇప్పటికీ దాదాపు 34 శాతం జిల్లాల్లో మ్యాన్యువల్ స్కావెంజింగ్ ప్రబలంగా ఉండటం గమనార్హం.

2017 నుంచి 2021 మధ్య దేశంలో మొత్తం 330 మంది మ్యాన్యువల్ స్కావెంజర్ల మరణాలు చోటు చేసుకున్నాయి. మురుగు కాలువలు, సెప్టిక్ ట్యాంకులు శుభ్రం చేస్తున్న సమయంలో ఈ మరణాలు చోటు చేసుకున్నాయి. ఈ మరణాలపై కర్నాటక సఫాయి కర్మచారి కమిషన్ చైర్‌పర్సన్ ఎం. శివన్న కొటే ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నాలుగేండ్లలో చనిపోయిన 330 మందిని ఎందుకు మ్యాన్యువల్ స్కావెంజర్లుగా పరిగణించలేదని ప్రశ్నించారు. మ్యాన్యువల్ స్కావెంజింగ్‌కు వ్యతిరేకంగా గత కొన్నేండ్లుగా ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు కొనసాగుతున్నాయి. అయినప్పటికీ ఈ అమానవీయ పద్ధతిని నిర్మూలించే విషయంలో మోడీ సర్కారు నిర్లక్ష్యం వహిస్తుండటం ఆందోళనను కలిగిస్తున్నదని దేశవ్యాప్తంగా సఫాయి కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఏసీబీకి చిక్కిన ఇద్దరు అధికారులు

- ఒకరు ఏఎల్‌ఓ, మరొకరు తహశీల్దార్

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో రెండు వేర్వేరు జిల్లాల్లో లంచాలు తీసుకుంటూ ఒక తహశీల్దారు, మరో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్(ఏఎల్‌ఓ)లు అవి నీతి నిరోధక శాఖ(ఏసీబీ) వలకు చిక్కారు. ఏసీబీ డీజీ డాక్టర్ రవి గుప్తా తెలిపిన వివరాల ప్రకా రం.. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు ఏఎల్‌ఓ సుమతిని తన కార్యాలయం వద్దే ఒక వ్యక్తి నుంచి రూ. 20 వేలను లంచం గా తీసుకుంటుండగా ఏసీబీ అధి కారులు వల పన్ని రెడ్‌హ్యాండెడ్ గా పట్టుకున్నారు. వెంకన్న అనే వ్యక్తికి లేబర్‌కార్డును జారీ చేయటంతో పాటు మరణించిన అతని కుమారుడికి మంజూరైన లక్ష రూపాయల నష్టపరిహారాన్ని చెల్లించటానికిగానూ సుమతి ఇంత మొత్తంలో లంచాన్ని డిమాండ్ చేశారు. అలాగే, ఖమ్మం జిల్లా ఎన్‌కోర్ మండల తహశీల్దార్ మహ్మద్‌షా ఖాసీం ఒక వ్యక్తి నుంచి రూ.3000 లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రామకృష్ణ అనే వ్యక్తికి చెందిన ఆస్తి పంపకానికి సంబంధించిన పత్రాలు ఇవ్వటానికి గానూ ఈ డబ్బును షా ఖాసీం డిమాండ్ చేసి తీసుకున్నారు. అరెస్టు చేసిన ఇద్దరిని హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపర్చి కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ముదిరాజ్‌లు బీసీ కులాల్లో లేరా? కులవృత్తి లేదా?

మెపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్..

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది వేడుకల సందర్భంగా ప్రభుత్వం ముదిరాజ్ కులాన్ని అవమానించిందని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష ఆర్థికసా యం జాబితాలో ముదిరాజ్ కు లాన్ని పొందుపర్చక పోవడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ముదిరాజ్‌లు బీసీ కులాల్లో లేరా? ముదిరాజ్‌లకు కుల వృత్తి లేదా? అని ఆందోళన వ్యక్తంచేశారు. వృత్తిదారులకే ఆర్థిక సాయం అందిస్తామని చెప్పడం స్వాగతనీ యమని, కానీ ముదిరాజ్‌లను విస్మరించడం ఎంత వరకు సబబని వాపోయారు. తెలంగాణ రాష్ట్రంలో జనాభా ప్రాతిపదికన అధిక ఓటింగ్ శాతాన్ని కలిగి ఉన్న ముదిరాజ్‌లను బీసీ సంక్షేమ శాఖ ఎందుకు పరిగణలోనికి తీసుకోలేదో సమాధానం చెప్పాలని అన్నారు.

దోస్త్ రిజిస్ట్రేషన్‌కు రేపే ఆఖరు

- ఇప్పటి వరకు 90,634 మంది నమోదు
- 54,079 వెబ్‌ఆప్షన్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో బీఏ, బీఎస్సీ, బీకాం, బీకాం ఒకేషనల్, బీకాం ఆనర్స్, బీబీఏ, బీసీఏ, బీబీఎం, బీఎస్‌డబ్ల్యూ, బీసీఏ కోర్సుల్లో 2023-24 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్)కు రిజిస్ట్రేషన్ చేసుకునే గడువు శనివారంతో ముగియనుంది. ఇప్పటి వరకు 90,634 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ మేరకు ఉన్నత విద్యామండలి చైర్మెన్, దోస్త్ కన్వీనర్ ఆర్ లింబాద్రి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈనెల 10వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు గడువున్నదని తెలిపారు. ఇప్పటి వరకు 54,079 వెబ్‌ఆప్షన్లు నమోదయ్యాయని వివరించారు. ఈనెల 11వ తేదీ వరకు వెబ్‌ఆప్షన్లను నమోదు చేసేందుకు అవకాశమున్నదని పేర్కొన్నారు. ఈనెల 16వ తేదీన తొలివిడత సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. విద్యార్థులు పూర్తి వివరాలకు https://dost.cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 పోస్టులకు మెరిట్ జాబితా విడుదల

- 9,192 మంది ఎంపిక

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకుల కార్యాలయం, వైద్య విద్య, తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లో ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 పోస్టులకు సంబంధించిన మెరిట్ జాబితా విడుదలైంది. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనితా రామచంద్రన్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 325 ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 పోస్టుల భర్తీకి 2017, డిసెంబర్ 18న నోటిఫికేషన్ విడుదలైంది. 11,984 మంది దరఖాస్తు చేశారని తెలిపారు. వారిలో 9,192 మంది పరీక్ష రాశారని, వారంతా మెరిట్ జాబితాకు ఎంపికయ్యారని వివరించారు. అర్హతలు, వెయిటేజీ, సర్వీసు వెయిటేజీకి సంబంధించిన మార్కులపై అభ్యర్థుల నుంచి ఈ ఏడాది జనవరి 19 నుంచి 27 వరకు అభ్యంతరాలను స్వీకరించామని పేర్కొన్నారు. అర్హత ఉన్న అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని మార్కులను పొందుపరిచామని స్పష్టం చేశారు. అనంతరం ప్రస్తుత నిబంధనల ప్రకారమే జనరల్ ర్యాంకుల జాబితాను రూపొందించామని తెలిపారు. వివరాలకు www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

పదోన్నతులు వెంటనే ఇవ్వాలి

- పీఆర్టీయూ తెలంగాణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎలాంటి అడ్డంకుల్లేని ఉపాధ్యాయుల పదోన్నతులను వెంటనే ఇవ్వాలని పీఆర్టీయూ తెలంగాణ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం చెన్నయ్య, సుంకరి బిక్షంగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం అంజిరెడ్డి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కోర్టు స్టే బదిలీలకే ఉంది తప్ప పదోన్నతులకు కాదని పేర్కొన్నారు. పదోన్నతుల కోసం ప్రత్యేకంగా ఉత్తర్వులు విడుదల చేసి అడ్‌హక్ పద్ధతిలో లేదంటే మరో మార్గంలో ఇవ్వాలని కోరారు. అయినా ప్రభుత్వం స్పందించలేదని తెలిపారు. మన ఊరు మన బడి కింద పాఠశాలలు అభివృద్ధి చెందుతున్నాయని, బడుల ప్రారంభంలోగా అర్హులైన ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని సూచించారు.

రాష్ట్రంలో ఎనిమిదేండ్లుగా ఒక్క పదోన్నతికి నోచుకోకుండా ఉపాధ్యాయులే ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ దృష్టి సారిస్తే వారంలో పదోన్నతులు కల్పించే అవకాశముందని తెలిపారు. ఈనెలాఖరులోగా పీఆర్సీ కమిటీని వేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను మంజూరు చేయాలని కోరారు. ఏపీలో సీపీఎస్‌ను రద్దు చేసి జీపీఎస్‌ను తెచ్చిందని, తెలంగాణలోనూ సీపీఎస్‌ను రద్దు చేసి జీపీఎస్ కంటే మెరుగైన ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈహెచ్‌ఎస్ విధివిధానాలను తయారుచేసి వెంటనే ప్రవేశపెట్టాలని పేర్కొన్నారు.

మంత్రి కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకో

- మహేష్‌కుమార్, నిరంజన్ హెచ్చరిక

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

నోరు అదుపులో పెట్టుకోవాలంటూ మంత్రి కేటీఆర్‌ను కాంగ్రెస్ హెచ్చరించింది. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టీపీసీసీ కార్యనిర్వహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, జి నిరంజన్ వేర్వేరుగా విలేకర్లతో మాట్లాడారు. అరచేతిలో స్వర్గం చూపించి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. బీఆర్‌ఎస్‌ను అధికారంలోకి తెచ్చినందుకు ప్రజలు బాధపడుతున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ బంగాళాఖాతంలో కలిపేస్తారని హెచ్చరించారు.

కొనసాగుతున్న యూత్ కాంగ్రెస్ జాతీయ సమావేశాలు

రెండు రోజులుగా యూత్ కాంగ్రెస్ జాతీయ సమావేశాలు హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ హోటల్‌లో కొనసాగుతున్నాయి.నిరుద్యోగ సమస్యపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై చర్చిస్తున్నారు. యూత్ కాంగ్రెస్ సమావేశాల్లో గురువారం కాంగ్రెస్ ఎమ్మెల్యేలు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జగ్గారెడ్డి మాట్లాడారు.

హైదరాబాద్‌కు చేరుకున్న రేవంత్

అమెరికా పర్యటనకు వెళ్లిన టీపీసీసీ అధ్యక్షులు,ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి గురువారం రాత్రి హైదరాబాద్ చేరుకున్నారు. అమెరికాలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో ప్రసంగించిన ఆయన...కాంగ్రెస్ ప్రవాస భారతీయులతో ప్రత్యేకంగా మాట్లాడారు. అనంతరం నిర్వహించిన బహిరంగసభలో రాహుల్‌గాంధీతోపాటు ఆయన పాల్గొన్నారు.